www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI


ప్రధాని మోదీ నామినేషన్ సందర్భంగా వారాణసీలో ఆయనను అభినందిస్తున్న చంద్రబాబు, పవన్

400 దాటేస్తాం!

నినాదం కాదు.. నిజం చేస్తాం: మోదీ

మత రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం

'ఇండియాటుడే' ఇంటర్వ్యూలో ప్రధాని

2

బుధవారం | 15-5-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 29 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి పూర్తి; నక్షత్రం: ఆశ్లేష మ. 3.25 తదుపరి మఖ; వర్జ్యం: తె. 4.49 మొదలు; దుర్ముహూర్తం: ఉ. 11.45-12.37; అమృతఘడియలు: మ. 1.39-3.25; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 5.46; సూర్యాస్తమయం: 6.36 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఎప్పుడిస్తారు?

అసలిస్తారా.. నొక్కేస్తారా?

- అవసరం తీరిపోయిందని వదిలేస్తారా?
- ఆరు పథకాల సొమ్ములు ఇచ్చేదెప్పుడు?
- పోలింగ్‌కు 2 రోజుల ముందు హడావుడి
- డబ్బులిచ్చేస్తామంటూ లేఖల మీద లేఖలు
- నిబంధనలకు విరుద్ధమని ఈసీ బ్రేక్
- పోలింగ్ తర్వాత నిధుల జమకు ఓకే
- ఇప్పుడు చడీచప్పుడు చేయని ప్రభుత్వం
- కాంట్రాక్టర్లకు చెల్లింపులపైనే ఆసక్తి!?
- నిధులు సర్దేస్తారనే అనుమానాలు



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

పోలింగ్ ముగిసింది. అక్కచెల్లెమ్మలు, అవ్వా తాతలు, అన్నదాతలు, విద్యార్థులతో అవసరం తీరిపోయింది. ఇక వాళ్లతో పనేముంది?' అని సర్కారు భావిస్తోంది. ఎప్పుడో నొక్కిన బటన్‌ల డబ్బులు పోలింగ్‌కు ముందు వేసేస్తామని హడావుడి చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు... పోలింగ్ ముగిశాక ఆ మాటే ఎత్తడం లేదు. బటన్ నొక్కుడు సొమ్ములు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసేందుకు ఇప్పుడు ఎలాంటి ఆటంకాలూ లేవు. పోలింగ్ తర్వాత జమ చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ ఎప్పుడో అనుమతి ఇచ్చింది. అయినా సరే... ఈ విషయంలో ప్రభుత్వం వ్యూహాత్మక మౌనం పాటిస్తోంది. ఈ సొమ్ములను అస్మదీయ కాంట్రాక్టర్లకు సర్దేస్తారనే అనుమానాలు తలెత్తుతున్నాయి. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి హోదాలో జనవరి 23న ఆసరా, ఫిబ్రవరి 28న కల్యాణమస్తు, షాదీ తోఫా, మార్చి 1న విద్యా దీవెన, మార్చి 6న

మిగతా 11వ పేజీలో...





(1) పులివర్తి నాని కారుపై సమ్మెటతో దాడి చేస్తున్న దృశ్యం (2) అదే సమ్మెటతో గన్‌మ్యాన్‌పై పెను దాడి (3) గాయాలతో రక్తమోడుతున్న గన్‌మ్యాన్ (4) దాడికి వాడిన సమ్మెట ఇదే




విధ్వంసకాండ

తిరుపతి, తాడిపత్రి, పల్నాడులో చెలరేగిన వైసీపీ మూకలు

మంగళవారం కారంపూడి వీధుల్లో అల్లరి మూకలను నడిపిస్తున్న వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి సోదరుడు వెంకట్రామి రెడ్డి (ముఖానికి కర్చీఫ్ కట్టుకున్న వ్యక్తి). పిన్నెల్లి అనుచరులు, బయటి నుంచి తీసుకొచ్చిన కిరాయి మూకలు పట్టపగలు, నడి వీధుల్లో కర్రలు, ఇనుప రాడ్లతో వీరంగం సృష్టించారు. ఒకేసారి వందల మంది అరాచకానికి దిగడంతో... పోలీసులూ నిస్సహాయులై చూస్తూ ఊరుకుండిపోయారు.

నెత్తురోడిన పల్నాడు

- పోలింగ్ మర్నాడు కారంపూడిలో బీభత్సం
- టీడీపీ కార్యాలయం, వాహనాలు ధ్వంసం
- టీడీపీ కార్యకర్తల ఇళ్లు, షాపులపై రాళ్లవర్షం
- వందలాదిగా వెళ్లి 'టీడీపీ' గ్రామాల్లో బీభత్సం
- హింసాకాండకు వైసీపీ అభ్యర్థుల నేతృత్వం
- దగ్గరుండి దాడులు చేయించిన కాసు, అనిల్


గాయపడ్డ కారంపూడి సీఐ నారాయణస్వామి

తిరుపతిలో అరాచకం

- చంద్రగిరి టీడీపీ అభ్యర్థి నానీపై హత్యాయత్నం
- మాటేసి విరుచుకుపడ్డ 150 మంది
- సుత్తి, రాడ్లు, బీరు సీసాలతో పెనుదాడి
- నానీకి గాయాలు.. గన్‌మ్యాన్‌కు తీవ్రంగా..
- ఆత్మరక్షణకు గాల్లోకి గన్‌మ్యాన్ కాల్పులు
- టీడీపీ శ్రేణుల ప్రతిదాడి.. విధ్వంసం
- గాల్లోకి బలగాల కాల్పులు, లాఠీచార్జి

తన్నండి.. తరమండి.. తగలబెట్టండి

- కారంపూడిలో వైసీపీ మూకల స్వైర విహారం
- రాడ్లు, కర్రలతో వందల మంది వీరంగం
- 30 కార్లు, 300 మంది రౌడీలతో విధ్వంసం
- దగ్గరుండి రెచ్చగొట్టిన పిన్నెల్లి సోదరుడు


తాడిపత్రిలో గాయపడ్డ సీఐ మురళీకృష్ణ

12

యుద్ధభూమి తాడిపత్రి

- రెండోరోజూ కొనసాగిన వైసీపీ గూండాగిరి
- టీడీపీ నాయకుడు సూర్యముని ఇంటిపై దాడి
- టీడీపీ శ్రేణుల ఎదురుదాడితో రణరంగం
- సీఐకి గాయాలు.. పోలీసు వాహనాలు ధ్వంసం
- జేసీ, పెద్దారెడ్డి ఇళ్ల వద్ద మరోమారు దాడులు
- గంటలు గడిచినా అదుపులోకి రాని పరిస్థితి

జనం సొమ్మేగా ఇచ్చేయండి!

హిందూజా కోసం వసూల్ రాజా ఒత్తిడి

- 4న ఎన్నికల ఫలితాలకు ముందే 1500 కోట్లు చెల్లించేయాలని తొందర
- గతంలో హిందూజా క్లెయిమ్‌కు ఈఆర్‌సీ నో
- వసూల్‌రాజా తీరుతో ఆందోళనలో డిస్కమ్‌లు
- సలహా కోసం రిటైర్డ్ జడ్జి విక్రమ్‌జిత్‌కు లేఖ

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'జనం సొమ్మేగా.. హిందూజాకు రూ.1500 కోట్లు ఇచ్చేయండి' అని డిస్కమ్‌లపై వసూల్‌రాజా ఒత్తిడి చేస్తున్నారు. ఈ ఒత్తిడిని ఏపీ పవర్ కో-ఆర్డినేషన్ కమిటీ (ఏపీపీసీసీ) తట్టుకోలేకపోతోందని విద్యుత్తు సంస్థల వర్గాలు చెబుతున్నాయి. హిందూజా చేసిన క్లెయిమ్‌లను ఆమోదించవద్దంటూ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఆదేశించింది. విద్యుత్తు కొనుగోలు చేసినందుకుగాను రూ.1,220 కోట్లను హిందూజాకు డిస్కమ్‌లు చెల్లించడంపై

మిగతా 11వ పేజీలో...

కొత్తగా రూ.4 వేల కోట్ల అప్పు



నెలన్నరలోనే 17 వేల కోట్ల రుణం

3

పేదలకు ఆపి.. కాంట్రాక్టర్లకు చెల్లింపులా!

- రాజకీయ స్వార్థంతో చేసే ఈ పనులను అడ్డుకోండి
- గవర్నర్‌కు చంద్రబాబు లేఖ
- కాంట్రాక్టర్లకు చెల్లింపులు నిలిపివేయాలని విజ్ఞప్తి

11


రాజమహేంద్రవరంలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద బలగాల పహారా


రికార్డు బద్దలైంది!

- రాష్ట్రంలో పోలింగ్ శాతం 81.17.. ఓటర్ టర్నవుట్ యాప్‌లో వెల్లడి
- రాష్ట్ర ఎన్నికల చరిత్రలో ఈ స్థాయి పోలింగ్ ఇదే ప్రథమం
- 2019లో 79.88 శాతం నమోదు

అమరావతి, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల చరిత్రలో సంచలన రికార్డు నమోదైంది. పోటెత్తిన ఓటర్లతో బ్యాలట్లేకాదు.. రికార్డులు సైతం బద్దలయ్యాయి. రాష్ట్ర ఎన్నికల చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ఓట్లు పోలయ్యాయి. మంగళవారం అర్ధరాత్రి సమయానికి 'ఓటర్ టర్నవుట్ యాప్'లో సీఈవో కార్యాలయం వెల్లడించిన వివరాల మేరకు గతంలో ఎన్నడూ లేని రీతిలో 81.17 శాతం పోలింగ్ నమోదైంది. దీనిలో సాధారణ ఓటింగ్ 80.07 శాతం కాగా, పోస్టల్ బ్యాలెట్ 1.1 శాతంగా ఉంది. 2019లో నమోదైన పోలింగ్ 79.88 శాతంతో పోలిస్తే తాజా ఎన్నికల్లో పోలింగ్ శాతం తారాజువ్వలా దూసుకుపోయింది. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా పోలింగ్ శాతం చరిత్ర సృష్టించినట్టయింది. సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ప్రక్రియ రాష్ట్రంలో సాయంత్రం 6 గంటలకే ముగిసినా.. దాదాపు 47 పోలింగ్ కేంద్రాల్లో

మిగతా 11వ పేజీలో...

ఈ-ఆఫీస్‌లో కిరికిరి!



- 17 నుంచి 25వ తేదీ వరకు మూసివేత
- సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్, విస్తరణ పేరుతో క్లోజ్
- కీలక ఫైళ్లు, డేటా మాయం చేసేందుకేనా?
- చీకటి జీవోల సమాచారమూ 'ఈ-ఆఫీస్'లోనే
- పోలింగ్ ముగియగానే ఆకస్మిక నిర్ణయం
- ఉద్యోగ వర్గాల్లోనే అనుమానాలు

అమరావతి, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడు, ఏం చేయాలో తెలియదా... లేక, ఉద్దేశపూర్వకంగానే ఇప్పుడు చేస్తున్నారా!? ఈ ప్రశ్నకు సమాధానం ఏదైనా, జగన్ సర్కారు మరో అనుమానాస్పద నిర్ణయం తీసుకుంది. 17వ తేదీ (శుక్రవారం) నుంచి 25వ తేదీ వరకు... 'ఈ-ఆఫీస్'ను మూసేస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాలకు ఈ-ఆఫీస్‌ను విస్తరించడం, ప్రస్తుతం వాడుకలో ఉన్న ఈ ఆఫీస్ వెర్షన్‌ను అప్‌గ్రేడ్ చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. అయితే.. దీనిపై ఉద్యోగుల్లోనే పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇటీవల... మద్యం క్రయ విక్రయాలు, డీలింగ్స్, బేవరేజెస్ కార్పొరేషన్ ద్వారా తెచ్చిన అప్పులకు సంబంధించిన ఫైళ్లను మాయం చేసినట్లు బలమైన ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఉన్నతాధికారులు కిక్కురుమనడంలేదు. ఇప్పుడు... ఏకంగా ఈ-ఆఫీసునే 'అప్‌గ్రేడ్' పేరిట మూసేస్తున్నారు. ఎన్నికల తర్వాత, ప్రభుత్వం మారే అవకాశమున్న సమయంలో పలురకాల గిమ్మిక్కులు చేస్తుంటారు. పాత వ్యవహారాలు బయటపడకుండా.. అనుమానాస్పద, వివాదాస్పద నోట్‌ఫైళ్లను మాయం చేసే అవకాశాలను తోసిపుచ్చలేం. ఈ క్రమంలో... సరిగ్గా పోలింగ్ తర్వాత, అకస్మాత్తుగా

మిగతా 11వ పేజీలో...

విమానాల్లో దొంగ!

- మహిళలు, వృద్ధులను మాటల్లో పెట్టి బంగారు, వెండి నగలు దోచేస్తున్న వైనం
- 110 రోజుల్లో 200 విమాన ప్రయాణాలు
- అతడికి ఢిల్లీలో గెస్ట్‌హౌస్, మొబైల్ షాపు
- ఇంట్లో సోదాలు.. చోరీ సొత్తు స్వాధీనం

2



నాన్‌స్టిక్ పాత్రలతో ఆరోగ్యానికి ముప్పు!

- గీతలు పడితే విష వాయువులు, రసాయనాలు
- ఒక్క గీత నుంచి 9,100 మైక్రోప్లాస్టిక్ రేణువులు
- వాటితో హార్మోనల్ సమస్యలు, క్యాన్సర్
- మట్టి, గ్రానైట్ పాత్రలు ఉత్తమం: ఐసీఎంఆర్

2



ఏదో తేడా కొడుతోంది!

ఒక్క పూటలోనే వైసీపీ మాట మారింది

- మహిళలు, వృద్ధులు తమకే ఓటేశారన్న సజ్జల.. జగన్ యువతకు ఐకాన్ అని అభివర్ణన.. తెల్లవారేసరికి టీడీపీపై రిగ్గింగ్ ఆరోపణలు
- ఈసీ తీరు ఏకపక్షమని, పోలీసులు సహకరించలేదని బుకాయింపు
- ఇంకోవైపు ఊళ్లలో టీడీపీపై దాడులు.. వైసీపీ నేతల తీరుపై అనుమానాలు

11

లెక్క తేలుతోంది!

భారీ పోలింగ్‌పై టీడీపీలో సంతృప్తి

- ప్రభుత్వ వ్యతిరేకత వల్లేనని విశ్లేషణ.. సీట్లు, మెజారిటీపైనే ప్రధాన చర్చ
- అత్యధిక చోట్ల గత ఎన్నికల కంటే ఎక్కువ ఓటింగ్.. తరలివచ్చిన ప్రవాసులు
- యువత, మహిళల ఓట్లు కూటమికే!.. పథకాలు అందడంతో పని లేదు
- అందరిలోనూ ప్రభుత్వం మారాలన్న ఆకాంక్ష.. సర్వే సంస్థల ప్రతినిధుల వెల్లడి

జగన్ కేసులను రోజువారీగా విచారించండి

- నాంపల్లి కోర్టుకు సీబీఐ అభ్యర్థన.. ఆయన విదేశీ టూర్‌కు కోర్టు ఓకే
- కాంటాక్ట్ నంబర్లు, ఈ-మెయిల్‌ను సమర్పించాలని సీఎంకు ఆదేశం

3

మోదీపై నిషేధం విధించాలన్న పిటిషన్ డిస్మిస్

న్యూఢిల్లీ, మే 14: ఎన్నికల ప్రచారంలో విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్న ప్రధాని మోదీపై అనర్హత వేటు వేయాలన్న పిటిషన్‌ను స్వీకరించడానికి మంగళవారం సుప్రీంకోర్టు నిరాకరించింది. మోదీ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారని, ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆరేళ్ల పాటు నిషేధం విధించాలని కోరుతూ ఫాతిమా అనే మహిళ ఈ పిటిషన్ వేశారు. పరిశీలించిన ధర్మాసనం.. ఇలాంటి సమస్యల పరిష్కారానికి తొలుత సంబంధిత అధికార్లను ఆశ్రయించాల్సి ఉంటుందని తెలిపింది.

లోకం తీరు



రాయ్‌బరేలీతో నాది కుటుంబ బంధం

» పాత ఫొటోలు చూస్తూ రాహుల్ భావోద్వేగం



న్యూఢిల్లీ, మే 15: రాయ్‌బరేలీ నియోజకవర్గంతో తనకు కుటుంబ బంధం ఉందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఈ నియోజకవర్గానికి రెండు దశాబ్దాల పాటు ఆయన తల్లి సోనియా గాంధీ ప్రాతినిధ్యం వహించగా, ప్రస్తుత ఎన్నికల్లో ఆయన పోటీ చేస్తున్నారు. మంగళవారం తల్లితో కలిసి పాత ఫొటోలు చూస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. తన అనుభవాలను హిందీలో వివరిస్తూ ట్వీట్ చేశారు. ఆరు నిమిషాల నిడివిగల వీడియోను కూడా జత చేశారు. "రాయ్‌బరేలీ, అమేఠీ మాకు కేవలం నియోజకవర్గాలు మాత్రమే కాదు. మా కర్మభూమి. వీటి ప్రతి మూలలోనూ మా తరాల అనుభవాలు దాగి ఉన్నాయి. అమ్మతో కలిసి పాత ఫొటోలను చూస్తుంటే నాన్న, నానమ్మ గుర్తుకు వచ్చారు. సేవ చేయాలన్న సంప్రదాయాన్ని వారు ప్రారంభించారు. అమ్మ, నేను వాటిని కొనసాగిస్తున్నాం. ప్రేమ, నమ్మకం అన్న పునాదులతో నిర్మితమైన ఈ సంబంధం వందేళ్లనాటిది. ఈ బంధం మాకు అన్నీ ఇచ్చింది. అమేఠీ, రాయ్‌బరేలీ ఎప్పుడు పిలిచినా మేం అక్కడ వాలుతాం" అని రాహుల్ అందులో పేర్కొన్నారు.

నంద్యాల ఎస్పీ తప్పు చేశారు!

» అల్లు అర్జున్ వస్తున్న సమాచారం తెలిసినా ఆయన స్పందించలేదు

» ర్యాలీ నిర్వహించినా చోద్యం చూశారు.. ఎన్నికల సంఘానికి సీఎస్ నివేదిక

అమరావతి, మే 14(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డిపై రాష్ట్ర ప్రభుత్వం క్రమశిక్షణా చర్యలు తీసుకోనుంది. పోలింగ్‌కు 48 గంటల ముందు 144 సెక్షన్ అమల్లో ఉన్నప్పటికీ వాటిని విస్మరించినట్లు వచ్చిన ఆరోపణలను నిర్ధారించింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల కమిషన్‌కు నివేదిక సమర్పించింది. రాష్ట్ర డీజీపీ దీనికి సంబంధించి చర్యలు ప్రారంభించినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి సీఈసీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. సినీనటుడు అల్లు అర్జున్ నంద్యాల వైసీపీ అభ్యర్థి శిల్పా రవి చంద్ర కిశోర్ రెడ్డి తరఫున ప్రచారానికి వచ్చినప్పుడు ఎలాంటి అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించినా చోద్యం చూడటం, అధికార పార్టీ అభ్యర్థి ఇంటిముందు వేల మంది జనం గుమిగూడినా అదుపు చేయక పోవడం వంటి వాటిని నివేదికలో ప్రస్తావించారు. స్థానిక ఎన్నికల అధికారి, పోలీసుల నుంచి ఎలాంటి అనుమతి లేకుండా సుమారు రెండు వేల మందితో, ముఖ్యంగా మైనర్లతో మున్సిపల్ కార్యాలయం, పద్మావతి నగర్, రాంనాథ్ రెడ్డి నగర్ మీదుగా ర్యాలీ నిర్వహించినా అడ్డుకోక పోవడాన్ని తీవ్ర వైఫల్యంగా పేర్కొన్నారు. ముందు రోజు సాయంత్రం నుంచే అల్లు అర్జున్ నంద్యాలకు వస్తున్నట్లు పలు వాట్సాప్ గ్రూపుల్లో సమాచారం వైరల్ అయింది. ఈ విషయం తెలిసినా పోలీసులు కనీసం పట్టించుకోక పోవడం పెద్ద తప్పిదంగా తెలిపారు. వైసీపీ అభ్యర్థి ఇంటి వద్ద అల్లు అర్జున్ ఉదయం 11.45 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నంద్యాలలో ఉన్నా పోలీసులు కనీస బందోబస్తు చర్యలు తీసుకోలేదని నివేదికలో సీఎస్ వివరించారు. సినీ నటుడితో కలిసి వైసీపీ అభ్యర్థి సమూహాన్ని ఉద్దేశించి బాల్కనీ నుంచి మాట్లాడినా అడ్డుకోలేదని, అనుమతి లేకుండా ప్రముఖులు ర్యాలీ చేపడితే అడ్డు చెప్పలేదని, వేలాది మంది వస్తే కనీసం నియంత్రించలేదని వివరించారు. జన సమూహాన్ని చూసిన తర్వాత కూడా కనీసం చెదరగొట్టే ప్రయత్నం పోలీసులు చేయలేదని తెలిపారు. వైసీపీ అభ్యర్థి ఇంటి వద్ద జనం భారీగా గుమిగూడిన చోటు నుంచి ప్రతిపక్ష నేత సభకు కేవలం 650 మీటర్ల దూరం మాత్రమే ఉందని, ఒకే సమయంలో వేర్వేరు పార్టీలకు చెందిన వారు పెద్ద ఎత్తున గుమిగూడే అవకాశం పోలీసులు ఇవ్వాల్సింది కాదన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో నంద్యాల పోలీసులు విఫలమవడం వాస్తవమేనని తెలిపారు. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన రెండు భారీ సమూహాలు ఒకే సమయంలో నంద్యాలలో గుమిగూడిన విషయాన్ని పోలీసు ఉన్నతాధికారులకు ఎస్పీ తెలియజేయలేదని నివేదికలో పేర్కొన్నారు. ఈ నెల 11న జరిగిన ఈ ఘటనపై ఎన్నికల సంఘం 12న ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఎస్పీ రఘువీర్ రెడ్డితోపాటు ఓఎస్‌డీ ఎస్. రవీంద్రనాథ్ రెడ్డి, నంద్యాల టూ టౌన్ సీఐ కె. రాజారెడ్డిని సంజాయిషీ అడిగినట్లు తెలిపారు. నంద్యాల పోలీసుల వైఫల్యంపై కర్నూల్ రేంజ్ డీఐజీ ఇచ్చిన నివేదికతోపాటు రాష్ట్ర డీజీపీ తీసుకోబోతున్న చర్యల వివరాలను ఎన్నికల సంఘానికి జవహర్‌రెడ్డి పంపించారు.

రెంటచింతల ఎస్‌ఐపై ఈసీ వేటు


ఎస్ఐ నారాయణరెడ్డి

రెంటచింతల, మే 14: పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం రెంటచింతల ఎస్ఐ కేవీ నారాయణరెడ్డిని సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్ కుమార్ మీనా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నారాయణరెడ్డిపై డిపార్ట్‌మెంట్ పరంగా విచారణ చేసి 60 రోజుల్లోగా నివేదిక అందజేయాలని ఆదేశించారు. తమ అనుమతి లేకుండా ఎస్ఐపై చార్జ్‌షీట్‌ను తొలగించకూడదని స్పష్టం చేశారు. ఇటీవల పలు సంఘటనలు చోటు చేసుకోవడం, వాటిలో టీడీపీ వారు బాధితులుగా మారిన నేపథ్యంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ నారాయణరెడ్డిని సస్పెండ్ చేశారు. కాగా, నారాయణ రెడ్డి జనవరి 13న రెంటచింతల పోలీసు స్టేషన్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఓ ఎస్ఐ సస్పెండ్ కావడం ఇదే ప్రథమం.

లాయర్లు 'వినియోగదార్ల చట్టం'లోకి రారు

న్యూఢిల్లీ, మే 14: న్యాయవాదులు..వినియోగదారుల పరిరక్షణ చట్టం-1986 పరిధిలోకి రారని మంగళవారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సరైన సేవలు అందించలేదంటూ వారిపై ఈ చట్టం కింద వినియోగదారుల ఫోరాల్లో కేసులు పెట్టలేరని తెలిపింది. న్యాయవాద వృత్తి నిరుపమానమైనదని, దాన్ని ఇతర వృత్తులతో పోల్చలేమని తెలిపింది. లాయర్లు కూడా వినియోగదారుల పరిరక్షణ చట్టం పరిధిలోకి వస్తారని, సరైన సేవలు అందించకపోతే ఫోరాలను ఆశ్రయించవచ్చని 2007లో జాతీయ వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ తీర్పు ఇచ్చింది. దీన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో అప్పీలు దాఖలైంది.

సరిహద్దులో 49 పాక్ డ్రోన్ల కూల్చివేత

న్యూఢిల్లీ, మే 14: ఓ పక్క దేశంలో లోక్‌సభ ఎన్నికల హడావిడి కొనసాగుతుంటే... మరోపక్క సరిహద్దుల్లో పాకిస్థాన్ డ్రోన్ల అక్రమ చొరబాట్లు కలకలం రేపుతున్నాయి. ఎన్నికల కోడ్ అమలులోకొచ్చిన ఈ 60 రోజుల్లో భారత్-పాక్ అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఏకంగా 49 పాకిస్థాన్ డ్రోన్లను కూల్చివేసినట్లు బీఎస్ఎఫ్ వెల్లడించింది. వీటిలో అత్యధికంగా 47 డ్రోన్లు పంజాబ్ సరిహద్దులో పట్టుబడగా, రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్, బికానీర్ సెక్టార్లలో మిగతా 2 బీఎస్ఎఫ్‌కు చిక్కాయి. కాగా, బీఎస్ఎఫ్ నివేదిక ప్రకారం, 2022 జనవరి- మే మాసాల మధ్య కేవలం 6 పాకిస్థాన్ డ్రోన్లు పట్టుబడగా, 2023లో అదే వ్యవధిలో వాటి సంఖ్య 14కి చేరింది. ఇక 2024లో ఏకంగా 75కి చేరడం గమనార్హం.

పీవోకేలో ఆగని హింస.. కాల్పుల్లో ముగ్గురి మృతి

ఇస్లామాబాద్, మే 14: పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే) హింసతో అట్టుడుకిపోతోంది. భారీగా పెరిగిన ఆహార, విద్యుత్, నిత్యావసరాల ధరలను తగ్గించాలంటూ అవామీ యాక్షన్ కమిటీ చేపట్టిన ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. మంగళవారం భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో ముగ్గురు పౌరులు మృతి చెందగా, ఆరుగురు గాయపడ్డారు. ముజఫరాబాద్‌లో జరుగుతున్న అల్లర్లను కట్టడి చేసేందుకు ప్రభుత్వం మిలటరీ దళాలను భారీగా మోహరించింది. మంగళవారం భద్రతా దళాల కాన్వాయ్ షోరన్‌దా నక్కా గ్రామాన్ని చేరుకోగానే ఆందోళనకారులు దానిపై రాళ్ల దాడి చేశారు. దాడిని నిరోధించేందుకు భద్రతా దళాలు కాల్పులు జరిపాయి.

మోదీ ఆస్తి రూ.3.2 కోట్లు

సొంత ఇల్లు, కారు లేవు.. ఎన్నికల అఫిడవిట్‌లో ప్రధాని వెల్లడి

» వారాణసీ నుంచి నామినేషన్

» గంగా సప్తమి పర్వదినాన దాఖలు

» చంద్రబాబు, పవన్ సహా ఎన్డీయేకు చెందిన పలువురు నేతల హాజరు


వారాణసీ బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను సమర్పిస్తున్న మోదీ

వారాణసీ, మే 14: హిందువులు అత్యంత పవిత్రంగా భావించే గంగా సప్తమి పర్వదినాన.. ప్రధాని మోదీ వారాణసీ నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి నామినేషన్ వేశారు. అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్ సహా పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ సహా పలువురు ఎన్డీయే కూటమి నేతలు తదితర అతిరథమహారథులు వెంటరాగా.. మంగళవారం ఉదయం ఆయన జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను సమర్పించారు. సార్వత్రిక ఎన్నికల ఆఖరి దశలో (జూన్ 1న) పోలింగ్ జరిగే నియోజకవర్గాల్లో వారాణసీ ఉంది. నామినేషన్ల దాఖలుకు ఆఖరు రోజు మంగళవారమే. గంగాదేవి భూమికి దిగివచ్చిన గంగా సప్తమి, పుష్యమి నక్షత్రం కలిసి రావడంతో.. మోదీ ఈరోజును ఎంచుకున్నారు. నామినేషన్ వేయడానికి ముందు ఆయన దశాశ్వమేధ ఘాట్‌లో గంగా స్నానం చేశారు. అక్కడ జరిగిన హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కాశీ క్షేత్రపాలకుడైన కాలభైరవుడి గుడికి వెళ్లి స్వామి దర్శనం చేసుకుని ప్రార్థనలు చేశారు. "కాశీతో నా అనుబంధం అద్భుతమైనది, విడదీయలేనిది, పోలిక లేనిది. మాటల్లో చెప్పలేనిది. మీ అందరి ఆప్యాయతతో పదేళ్లు ఎలా గడిచిపోయాయో కూడా గుర్తురావట్లేదు. ఈరోజు గంగమ్మ తల్లి నన్ను తన దత్తత తీసుకుంది" అని 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. నామినేషన్ అనంతరం నేరుగా.. కాశీలోని రుద్రాక్ష కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుని స్థానిక పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. పార్టీ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని వారికి దిశానిర్దేశం చేశారు. ప్రతి బూత్‌లోనూ.. గతంలో పోలైన ఓట్ల కంటే 370 ఓట్లు అధికంగా పోలయ్యేలా చూడాలని సూచించారు. ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో ఆయన ఈ సూచన చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. నామినేషన్ దాఖలు చేసిన తర్వాత ప్రధాని మోదీ 'ఎక్స్'లో ఒక పోస్టు పెట్టారు. "ఈ చారిత్రక నియోజకవర్గం (వారాణసీ) నుంచి పోటీ చేసి గెలిచి ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం నాకు దక్కిన గౌరవం" అని పేర్కొన్నారు. కాశీ ప్రజలను తన కుటుంబసభ్యులుగా అభివర్ణించారు. "ప్రజల మద్దతుతో మూడోసారి కూడా గెలిచి.. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఇనుమడించిన ఉత్సాహంతో కృషి చేస్తా. 'జై బాబా విశ్వనాథ్'" అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

ఆ నలుగురూ..

2014, 2019 తరహాలోనే.. ఈసారి కూడా మోదీ నామినేషన్ వేయడానికి వేర్వేరు వర్గాలకు చెందిన నలుగురు ప్రపోజర్లను(లోక్‌సభ అభ్యర్థిగా బలపర్చేవారు) ఎంచుకున్నారు. ఆ నలుగురూ.. పండిత్ గణేశ్వర్ శాస్త్రి, బైజ్‌నాథ్ పటేల్, లాల్‌చంద్ కుశ్వాహ, సంజయ్ సోంకర్. వీరిలో పండిత్ గణేశ్వర్ శాస్త్రి ప్రముఖ జ్యోతిష్కుడు, వేదపండితుడు, న్యాయశాస్త్ర కోవిదుడు. అయోధ్య రామ మందిర శంకుస్థాపనకు, బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి ముహూర్తం పెట్టింది ఆయనే. 2022 ఫిబ్రవరిలో కాశీ విశ్వనాథ్ కారిడార్ నిర్మాణానికి కూడా ముహూర్తం పెట్టింది ఈయనే. గణేశ్వర్ శాస్త్రి తాతముత్తాతలు.. తమిళనాడులోని తిరువసనల్లూరు నుంచి ఎప్పుడో వారాణసీకి వచ్చి స్థిరపడ్డారు. మరో ప్రపోజర్.. వారాణసీ లోక్‌సభ నియోజకవర్గంలోని సేవాపురి ప్రాంతానికి చెందిన బైజ్‌నాథ్ పటేల్ ఆరెస్సెస్ కార్యకర్త. జన సంఘ్‌తో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన వ్యక్తి. ఇంకో ప్రపోజర్ లాల్‌చంద్ కుశ్వాహ(65).. ఓబీసీ వర్గానికి చెందిన వ్యక్తి. బీజేపీ వారాణసీ జోనల్ ఇన్‌చార్జ్. మరో ప్రపోజర్.. సంజయ్ సోంకర్ (50) దళితుడు. వారాణసీ జిల్లా విభాగం జనరల్ సెక్రటరీగా వ్యవహరిస్తున్నారు.

కాంగ్రెస్‌కు ఒక్క సీటూ రాదు

తనకు మొత్తం రూ.3 కోట్ల విలువ చేసే ఆస్తులు ఉన్నాయని మోదీ ప్రకటించారు. మంగళవారం నామినేషన్ దాఖలు చేసిన ఆయన.. పోల్ అఫిడవిట్‌లో తన ఆస్తులు, అప్పులు, చేతిలో ఉన్న డబ్బు వివరాలను వెల్లడించారు. ఆ అఫిడవిట్ ప్రకారం.. మోదీకి కారు లేదు. సొంత ఇల్లు లేదు. భూములుగానీ, షేర్లుగానీ లేవు. మ్యూచువల్ ఫండ్స్‌లో ఎలాంటి పెట్టుబడులూ లేవు. ఎస్‌బీఐలో ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో మాత్రం రూ.2.86 కోట్లున్నాయి. రూ.2.68 లక్షల విలువ చేసే నాలుగు బంగారు ఉంగరాలు, రూ.9.12 లక్షల విలువైన జాతీయ పొదుపు పత్రాలు ఆయన పెట్టుబడులు. ఇక, ఆయన చేతిలో ఉన్న నగదు.. 52,920 రూపాయలు. వారాణసీ, గాంధీనగర్‌లోని రెండు బ్యాంకు ఖాతాల్లో 80,304 రూపాయలు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి తీసుకుంటున్న జీతాన్ని, బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వస్తున్న వడ్డీని తన ఆదాయ వనరులుగా చూపారు. 2018-19లో తన ఆదాయం రూ.11.14 లక్షలుగా చూపిన మోదీ.. 2022-23లో రూ.23.54 లక్షలుగా పేర్కొన్నారు. 2014లో మోదీ తన ఆస్తుల విలువను రూ.1.66 కోట్లు, 2019లో రూ.2.51 కోట్లుగా పేర్కొన్న సంగతి తెలిసిందే. కాగా, ఈ లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాదని మోదీ అన్నారు.

బీజేపీ కంచుకోట.. వారాణసీ

వారాణసీ నియోజకవర్గం బీజేపీకి కంచుకోట! ఇక్కడ హిందూ జనాభా 75 శాతం కాగా.. ముస్లింలు 20 శాతం దాకా ఉన్నారు. హిందువుల్లో.. 10శాతం ఎస్సీలు, 0.7 శాతం ఎస్టీలు ఉన్నారు. గ్రామీణ ఓటర్లు 65 శాతం.. అర్బన్ ఓటర్లు 35 శాతం. ఒక్క 2004 ఎన్నికల్లో మినహా.. 1991 నుంచి ఇప్పటిదాకా ఆ నియోజకవర్గాన్ని బీజేపీనే దక్కించుకుంది. 2004 ఎన్నికల్లో.. కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఆర్కే మిశ్రా అక్కడ విజయం సాధించారు. ఇక, మోదీ 2014లో 3.71 లక్షల ఓట్ల ఆధిక్యంతో (56.37 శాతం ఓట్లు).. 2019లో 4.79 లక్షల ఓట్ల ఆధిక్యంతో (63 శాతం ఓట్లతో) అద్భుత విజయాలు సాధించారు. ఇప్పుడు ముచ్చటగా మూడోసారి పాత రికార్డులను ఛేదించడమే లక్ష్యంగా బరిలోకి దిగారు. ఈసారి ఆయనకు పోటీగా కాంగ్రెస్ పార్టీ ఆ రాష్ట్ర పీసీసీ చీఫ్ అజయ్ రాయ్‌ని వరుసగా మూడోసారి రంగంలోకి దించింది.

400 దాటేస్తాం!

» 'ఇండియాటుడే' ఇంటర్వ్యూలో మోదీ

న్యూఢిల్లీ, మే 14: లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే 400 స్థానాలకుపైగా కచ్చితంగా గెలుస్తుందని మోదీ అన్నారు. ఇది కేవలం నినాదం కాదని.. నిజరూపం దాలుస్తుందని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా మహిళలు, యువత, తొలి ఓటర్లు క్రియాశీలంగా ఓటు హక్కు వినియోగించుకుంటున్నారని తెలిపారు. తాజాగా ఆంగ్ల వార్తాచానల్ 'ఇండియాటుడే'తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. కాంగ్రెస్ పూర్తిగా బలహీనపడిందని, కనీసం వారి కుటుంబ కంచుకోట అమేఠీలో పోటీచేసే ధైర్యం కూడా వారికి లేకపోయిందని రాహుల్‌గాంధీని ఎద్దేవాచేశారు. 'ఆ పార్టీకి చెందిన అతిపెద్ద నాయకురాలు (సోనియాగాంధీ) రాజ్యసభకు వెళ్లారు. రాహుల్ అమేఠీకి దూరమైపోయారు. రేపు రాయ్‌బరేలీలో గెలిస్తే వయనాడ్‌ను కూడా వదిలేస్తారు. ప్రజలకు సేవచేయడంపై వారికి ఆసక్తి లేదు. కుటుంబ ప్రయోజనాలు తప్ప దేశ ప్రయోజనాలు పట్టవు' అని ధ్వజమెత్తారు. 'ఓ చాయ్‌వాలా కొడుకు ప్రధానిగా ఉండడం వారు భరించలేకపోతున్నారు. నేను మూడోసారి కూడా గెలిస్తే వారి (నెహ్రూ వరుసగా మూడుసార్లు ప్రధాని అయ్యారు) రికార్డుకు గ్రహణం పడుతుందని భయపడుతున్నారు' అని చెప్పారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణంపై విపక్షాలు చేస్తున్న విమర్శలను మోదీ తీవ్రంగా ఖండించారు. తన ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావించారు. బీజేపీ 400 సీట్లతో గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తుందన్న ఆరోపణలను కూడా ఆయన ఖండించారు. బీజేపీ ఎప్పుడూ రాజ్యాంగాన్ని అగౌరవపరచలేదన్నారు. కాంగ్రెస్సే దానిని దుర్వినియోగం చేసిందన్నారు. '2019లోనే ఎన్డీయే 400 సీట్లకు పైగా సాధించింది' అని మోదీ గుర్తు చేశారు. మతప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వడానికి బీజేపీ వ్యతిరేకమన్నారు. దానిని ఎన్నటికీ అనుమతించబోమని తేల్చిచెప్పారు. ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలకు కోటా ఇవ్వాలని అంబేడ్కర్‌తో పాటు రాజ్యాంగ సభ కూడా చెప్పిందని.. దానికే తాము కట్టుబడి ఉన్నామని ప్రధాని స్పష్టం చేశారు. కాంగ్రెస్ హయాంలో సాయుధ బలగాలు బలహీనపడ్డాయన్నారు.

లిక్కర్ స్కాం నిందితుల జాబితాలో 'ఆప్'ను చేర్చుతాం

» ఢిల్లీ హైకోర్టుకు తెలిపిన ఈడీ

న్యూఢిల్లీ, మే 14 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులోని నిందితుల జాబితాలో ఆమ్ ఆద్మీ పార్టీని కూడా చేర్చుతామని ఈడీ మంగళవారం హైకోర్టుకు తెలిపింది. త్వరలో దాఖలు చేయనున్న మరో చార్జిషీటులో ఈ విషయాన్ని ప్రస్తావిస్తామని పేర్కొంది. అదే జరిగితే మనీలాండరింగ్ కేసులో నిందితునిగా ఓ రాజకీయ పార్టీని పేర్కొనడం ఇదే మొదటిసారి అవుతుంది. ఈ కేసులో ఆప్ సీనియర్ నేత సిసోడియా దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈడీ తరపు న్యాయవాది జోహెబ్ హుస్సేన్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ కుంభకోణం ద్వారా లభించిన సొమ్ము అంతా ఆప్‌కు వెళ్లినట్లు చెబుతున్నా ఆ విషయాన్ని ఛార్జిషీటులో ఎందుకు పేర్కొనలేదని బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణ కాంత శర్మ ప్రశ్నించారు. ఇందుకు న్యాయవాది హుస్సేన్ సమాధానమిస్తూ రానున్న ఛార్జిషీటులో ఆ పార్టీ పేరును ప్రస్తావిస్తామని తెలిపారు. కాగా, సిసోడియా బెయిల్ పిటిషన్‌పై తీర్పును న్యాయమూర్తి రిజర్వు చేశారు.

పరప్పన జైలు నుంచి రేవణ్ణ విడుదల

బెంగళూరు, మే 14(ఆంధ్రజ్యోతి): కిడ్నాప్ కేసులో జైలుకు వెళ్లిన కర్ణాటక మాజీ మంత్రి, హసన్ జిల్లా హొళె నరసీపుర ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణ మంగళవారం విడుదలయ్యారు. బెయిల్ సోమవారం సాయంత్రం మంజూరైనా, న్యాయపరంగా సాంకేతిక అంశాలు పూర్తి కావడం జాప్యం కావడంతో బయటకు రాలేకపోయారు. మధ్యాహ్నం 12.45 గంటలకు రేవణ్ణ బెయిల్ ప్రక్రియ పూర్తయింది. 1.30 గంటలకు పరప్పన అగ్రహార జైలు నుంచి రేవణ్ణ బయటకు వచ్చి నేరుగా ఇంటికి బయల్దేరారు. ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల పెన్‌డ్రైవ్ వివాదానికి అనుబంధంగా, ఫిర్యాదు చేసిన మహిళను కిడ్నాప్ చేశారనే కారణంగా ఈనెల 4న సిట్ అధికారులు రేవణ్ణను అరెస్టు చేశారు.

బైడెన్‌ను చంపేద్దామనుకున్నా!

వైట్‌హౌస్‌పై ట్రక్కుతో దాడి కేసులో సాయి వర్షిత్ నేరాంగీకారం



వాషింగ్టన్, మే 14: అమెరికా ప్రభుత్వాన్ని కూలదోసి, నాజీ ప్రభుత్వాన్ని నెలకొల్పే ఉద్దేశంతో వైట్‌హౌస్‌పై దాడికి పాల్పడినట్లు భారత సంతతికి చెందిన సాయి వర్షిత్ కందుల(20) అంగీకరించాడు. ఈ లక్ష్యాన్ని సాధించడానికి అవసరమైతే అధ్యక్షుడు జో బైడెన్‌ను చంపడానికి కూడా సిద్ధపడినట్లు విచారణలో వెల్లడించాడు. నిందితుడిని యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టులో హాజరుపరిచిన నేపథ్యంలో అమెరికా అటార్నీ ఈ మేరకు ప్రకటన చేసింది. కోర్టు పత్రాల ప్రకారం.. అమెరికాలో శాశ్వత నివాసం పొందిన భారత సంతతి కుటుంబానికి చెందిన సాయి వర్షిత్ మిస్సోరీలోని సెయింట్ లూయిస్‌లో నివసించేవాడు. గతేడాది మే 22న వాషింగ్టన్‌కు వెళ్లిన సాయి వర్షిత్.. అక్కడ ట్రక్కును అద్దెకు తీసుకున్నాడు. రాత్రి 9.35 గంటల ప్రాంతంలో వైట్‌హౌస్ వద్దకు చేరుకొని అక్కడ భద్రత నిమిత్తం ఏర్పాటు చేసిన బ్యారికేడ్లను వాహనంతో ఢీకొట్టాడు. ఆ తర్వాత ట్రక్కు దిగి నాజీ జెండాను పట్టుకొని నినాదాలు చేస్తున్న అతడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో సాయి వర్షిత్‌కు శిక్షను యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టు జడ్జి ఆగస్టు 23వ తేదీకి వాయిదా వేశారు.

కేజ్రీ రంగంలోకి దిగితే?

నేటి నుంచి ఢిల్లీ సీఎం ఎన్నికల ప్రచారం.. ఈ నెల 25న ఢిల్లీలో పోలింగ్

» రాజధానిలో కాంగ్రెస్‌తో ఆప్ పొత్తు.. 4చోట్ల పోటీ

» పంజాబ్‌లో అన్ని స్థానాల్లో ఒంటరిగా బరిలోకి!

(సెంట్రల్ డెస్క్)



గత ఎన్నికల్లో ఢిల్లీలో పార్టీల ఓట్ల శాతం ఇలా..

	2014	2019
బీజేపీ	46.04	56
కాంగ్రెస్	15.,01	23
ఆప్	32.09	18

మద్యం విధానం కుంభకోణంలో అరెస్టయిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు ఎన్నికల ప్రచారం కోసం బెయిల్ రావడం ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది. మరీ ముఖ్యంగా ఆప్ అధికారంలో ఉన్న ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో కేజ్రీ రంగంలోకి దిగితే రాజకీయ పరిణామాలు ఎలా మారుతాయన్నది ఆసక్తికరంగా మారింది. రెండు వారాల బెయిల్ పొందిన కేజ్రీ శుక్రవారం బయటకు వచ్చారు. మరుసటి రోజే మీడియా సమావేశం ఏర్పాటు చేయగా.. పార్టీ కార్యకర్తలు, నేతలు భారీఎత్తున తరలివచ్చారు. దీంతో సమావేశం బహిరంగ సభను తలపించింది. ఆదివారం ఎమ్మెల్యేలతో సమావేశమైన కేజ్రీ మ్యానిఫెస్టోను విడుదల చేశారు. ఇండియా కూటమి పార్టీల అభ్యర్థులకు మద్దతుగా బుధవారం లఖ్‌నవూ, 16న జమ్‌షెడ్‌పూర్, 17న ముంబైలో పర్యటించడం ద్వారా నేరుగా ఎన్నికల కదన రంగంలోకి దిగనున్నారు. ఢిల్లీలో ఏడు స్థానాలకు గాను ఆప్ నాలుగుచోట్ల పోటీ చేస్తోంది. కాంగ్రెస్‌కు మూడు స్థానాలు కేటాయించింది. ఢిల్లీలో ఆరో విడతలో ఈ నెల 25న పోలింగ్ జరగనుంది. పంజాబ్‌లో మాత్రం కాంగ్రెస్, ఆప్ వేటికవే పోటీ చేస్తున్నాయి. చాలాచోట్ల ప్రధాన ప్రత్యర్థులుగా తలపడతున్నాయి. ఈ రాష్ట్రంలో ఏడో విడతలో జూన్ 1న పోలింగ్ నిర్వహించనున్నారు.

కేజ్రీ లోటు ఢిల్లీలో స్పష్టం

ఆమ్ ఆద్మీ పార్టీకి పంజాబ్ కంటే ఢిల్లీ ఎన్నికల్లో కేజ్రీవాల్ లేని లోటు మొన్నటివరకు స్పష్టంగా కనిపించింది. గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీని స్వీప్ చేసిన బీజేపీని ఈసారి నిలువరించాలంటే కేజ్రీనే మూలస్తంభం. అయితే, సరిగ్గా ఎన్నికల సమయంలో మద్యం కుంభకోణంలో ఆయనను అరెస్టు చేసి 50 రోజులు జైల్లో ఉంచడంతో ఆప్ డీలాపడిపోయింది. మరోవైపు ఆప్‌తో పొత్తును తీవ్రంగా వ్యతిరేకిస్తూ కాంగ్రెస్‌కు చెందిన పలువురు నాయకులు రాజీనామా చేశారు. ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్విందర్ సింగ్ లవ్లీ బీజేపీలో చేరిపోయారు. క్షేత్రస్థాయిలోనూ రెండు పార్టీల శ్రేణుల మధ్య విభేదాలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కేజ్రీ రాక.. రెండు పార్టీల మధ్య సమన్వయాన్ని పెంచుతుందని.. ఉమ్మడి ప్రత్యర్థి బీజేపీని ఎదుర్కొనేందుకు బలం ఇస్తుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. కేజ్రీవాల్ రాకతో ఆప్ కార్యకర్తల్లో నైతిక స్థైర్యం పెరిగింది. ఆప్-కాంగ్రెస్ ఎన్నికల సమన్వయ కమిటీలో చురుకుదనం వచ్చింది. అయితే, సుదీర్ఘ కాలం నుంచి ప్రత్యర్థులుగా ఉన్న పార్టీల మధ్య రెండు పార్టీల మధ్య ఓట్ల బదిలీపైనే ఆందోళన వ్యక్తం అవుతోంది.

పంజాబ్ వెళ్లకుంటేనే మేలు?

ఢిల్లీలో కేజ్రీ ప్రచారం ఆప్‌నకు ఎంత బలమో పంజాబ్‌లో అంత ఇబ్బందికరం అన్న విశ్లేషణలు వస్తున్నాయి. సీఎం భగవంత్‌సింగ్ మాన్ ఇప్పటివరకు అంతా తానే అయి నడిపిస్తున్నారు. దీంతో కేజ్రీ వచ్చినా పెద్దగా ప్రయోజనం లేదంటున్నారు. అంతేగాక, ఆయన రాక రాష్ట్రంలో ఆప్-కాంగ్రెస్ శ్రేణుల మధ్య విభేదాలను మరింత రాజేస్తుందని.. ఆ ప్రభావం ఢిల్లీపైనా పడుతుందని పేర్కొంటున్నారు. అన్నిటికిమించి కేజ్రీ రాక పంజాబ్‌లో అతివాద సిక్కు ఓటర్లు ఆప్‌నకు వ్యతిరేకం అవుతారని వివరిస్తున్నారు. ఖదూర్ సాహిబ్ నుంచి స్వతంత్రుడిగా పోటీ చేస్తున్న ఖలిస్థానీ ఉగ్రవాది అమృత్ పాల్‌సింగ్‌కు బెయిల్ రాకపోవడం, కేజ్రీవాల్‌కు ప్రచారం కోసం బెయిల్ దొరకడం ఆప్‌కు ఇబ్బందికరమవుతుందన్న భావన వ్యక్తమవుతోంది.

నాన్‌స్టిక్‌తో ఆరోగ్యానికి ముప్పు!

» గీతలు పడితే విష వాయువులు, రసాయనాలు వెలువడే ప్రమాదం

» ఒక్క గీత నుంచి 9 వేల మైక్రోప్లాస్టిక్ రేణువులు: ఐసీఎమ్మార్



న్యూఢిల్లీ, మే 14: నాన్‌స్టిక్ వంటపాత్రలతో తీవ్రమైన ఆరోగ్యసమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్' (ఐసీఎమ్మార్) హెచ్చరించింది. నాన్‌స్టిక్ వంటపాత్రలపై చిన్న గీత పడినా దాని మీద ఉన్న టెఫ్లాన్ పైపూత (కోటింగ్)లో నుంచి విష వాయువులు, హానికారక రసాయనాలు వెలువడి ఆహారంలో కలుస్తాయని తెలిపింది. ఒక్క గీత నుంచి కనీసం 9,100 మైక్రోప్లాస్టిక్ రేణువులు విడుదలవుతాయని పేర్కొంది. గీతలు పడిన నాన్‌స్టిక్ వంటపాత్రల్లో 170 డిగ్రీల సెల్సియస్ కన్నా అధిక ఉష్ణోగ్రత వద్ద వంట చేసినప్పుడు ఈ ప్రమాదం ఉందని తెలిపింది. కడిగేటప్పుడు నాన్‌స్టిక్ పాత్రలపై బోలెడన్ని గీతలు పడుతుంటాయి. ఈ లెక్కన వీటి నుంచి కొన్ని లక్షల మైక్రోప్లాస్టిక్స్ విడుదలయ్యే ప్రమాదం ఉంది. వీటి వల్ల హార్మోన్లలో అసమతుల్యత, క్యాన్సర్, సంతానోత్పత్తి సమస్యలు వంటివి తలెత్తవచ్చని ఐసీఎమ్మార్ పేర్కొంది. నాన్ స్టిక్ వంటపాత్రల బదులు మట్టిపాత్రల్లో వండుకోవటం అత్యంత సురక్షితమని తెలిపింది. మరో ప్రత్యామ్నాయంగా గ్రానైట్ పాత్రలను కూడా సూచించింది. అయితే, వాటిపై ఎటువంటి రసాయన పూతలు ఉండవద్దని పేర్కొంది. ఫుడ్ గ్రేడ్ స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు కూడా మంచివేనని తెలిపింది. 'భారతీయులకు ఆహార మార్గదర్శకాలు' పేరుతో ఐసీఎమ్మార్ ఈ సూచనలను ఇటీవల విడుదల చేసింది.

విమానాల్లో దొంగ!

110 రోజుల్లో 200సార్లు విమాన ప్రయాణం

న్యూఢిల్లీ, మే 14: అతడు 110 రోజుల్లో 200సార్లు విమానాలెక్కి దేశమంతా తిరిగాడు. కానీ, అతడు పర్యాటక ప్రేమికుడు కాదు.. రాజకీయ నేత అంతకన్నా కాదు.. అతడో దొంగ. విమాన ప్రయాణికులతో కలిసిపోతాడు. విమానాశ్రయాల్లోనే వారితో మాటలు కలిపేస్తాడు. విమానం ఎక్కాక వారి పక్కనే తాను కూర్చునేలా సిబ్బందిని బతిమాలుకుంటాడు. తర్వాత వారి లగేజీల్లోంచి బంగారు, వెండి నగలు, విలువైన వస్తువులు దోచేస్తుంటాడు. అతడి పేరు రాజేశ్ కపూర్(40). ఢిల్లీలోని పహర్‌గంజ్‌లోని నివాసంలో రాజేశ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. గతనెల హైదరాబాద్ నుంచి ఢిల్లీ వెళుతున్న ఓ ప్రయాణికురాలి హ్యాండ్‌బ్యాగ్ లోంచి రాజేశ్ రూ.7లక్షల నగలు దొంగిలించాడు. మరో విమానంలోరూ.20లక్షల ఆభరణాలు కాజేశాడు. వీటిపై పోలీసులకు ఫిర్యాదులందాయి. ప్రయాణికుల జాబితాను పరిశీలించగా రాజేశ్, ఈ రెండు ఫ్లైట్స్‌లోనూ ఉన్నాడు. దర్యాప్తులో అతడే దొంగ అని తేలింది. రాజేశ్‌కు ఢిల్లీలో 'రికీ డీలక్స్' పేరుతో ఓ గెస్ట్ హౌస్ ఉంది. అన్నట్టు.. రాజేశ్ అంతకుముందు రైళ్లలోనూ చోరీలు జరిపాడట!

ఏపీఈఏపీసెట్‌కు 3,61,640 దరఖాస్తులు

▸▸ 16 నుంచి 23 వరకూ పరీక్షలు

కాకినాడ (జేఎన్టీయూకే), మే 14: ఏపీ, తెలంగాణలోని రెండు కేంద్రాల్లో కాకినాడ జేఎన్టీయూకే ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 23వ వరకూ నిర్వహించనున్న ఏపీఈఏపీసెట్‌కు ఇప్పటివరకూ 3,61,640 దరఖాస్తులు వచ్చినట్టు సెట్ చైర్మన్, జేఎన్టీయూకే ఉప కులపతి జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబందించిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణపై మంగళవారం ఆయన అధికారులు, సెట్ కన్వీనర్ వెంకటరెడ్డి, కో కన్వీనర్లు, కోఆర్డినేటర్లతో వర్సిటీలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ మొత్తం 49 ప్రాంతీయ కేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ పరీక్షల హాల్‌టికెట్లను ఈ నెల 7న విడుదల చేశామని.. విద్యార్థులు తమ రిజిస్ట్రేషన్ నంబర్, హాల్‌టికెట్ నంబర్, పుట్టిన తేదీ నమోదుచేసి హాల్‌టికెట్లను పొందవచ్చని తెలిపారు. అగ్రికల్చర్ ఫార్మసీ పరీక్షలు 16 నుంచి 17వరకూ, ఇంజనీరింగ్ పరీక్షలు 18 నుంచి 23 వరకూ ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నామని హాల్‌టికెట్లను https:// cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కన్వీనర్ కె.వెంకటరెడ్డి సూచించారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే 0884-2342499, 2359599 నంబర్లలలో కానీ helpdeskapeapcet@apsche.org మెయిల్ ఐడీ ద్వారా కానీ సంప్రదించా

గురుకులాల ప్రవేశ ఫలితాలు విడుదల

▸▸ రేపటి నుంచి సీట్ల కేటాయింపు.. ఇంటర్, డిగ్రీ కోర్సులకు కౌన్సెలింగ్

అమరావతి, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీల్లో (2024-25) సీట్ల భర్తీకి గత నెలలో నిర్వహించిన ప్రవేశ పరీక్షల ఫలితాలు వెలువడ్డాయి. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్, గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆర్.నరసింహారావు మంగళగిరిలోని కమిషనర్ కార్యాలయంలో విడుదల చేశారు. గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో విశాఖపట్నం జిల్లాకు చెందిన ఎం.కీర్తి, ఆరో తరగతిలో విజయనగరం జిల్లా విద్యార్థి పి.సోమేశ్వరరావు, ఏడో తరగతిలో శ్రీకాకుళం విద్యార్థి కె.ఖగేంద్ర, ఎనిమిదో తరగతిలో విజయనగరం జిల్లా విద్యార్థి వై.మేఘశ్యామ్ టాపర్లుగా నిలిచారు. 3770 సీట్లు అందుబాటులో ఉండగా 25216 మంది పరీక్షలు రాశారు. గురుకుల జూనియర్ కాలేజీల్లో జె.యశ్వంత్ సాయి (ఎంపీసీ), యం.మహిత(బైపీసీ, ఎల్.సత్యారామ్మోహన్(ఎంఈసీ) టాపర్లుగా నిలిచారు. 7 జూనియర్ కాలేజీల్లో 1149 సీట్లు ఉంటే 49308 మంది పరీక్ష రాశారు. గురుకుల డిగ్రీ కాలేజీల్లో ఎం.రవీంద్ర వరప్రసాద్(బీఏ), టి.గణేష్(బీకామ్), బి.సాయి కృపారెడ్డి(బీఎస్సీ-ఎంపీసీ), బి.రాజశేఖర్(బీఎస్సీ- ఎంఎస్‌సీఎస్) టాపర్లుగా ఉన్నారు. డిగ్రీలో 152 సీట్లు ఉంటే 963 మంది ప్రవేశ పరీక్ష రాశారు. ఎంపికైన విద్యార్థులకు బుధవారం సాయంత్రంలోగా ఎస్ఎంఎస్ ద్వారా సమచారం పంపుతామని అధికారులు తెలిపారు. విద్యార్థులు గురుకుల విద్యాలయాల సంస్థ వెబ్‌సైట్ నుంచి కూడా ఫలితాలు చూసుకోవచ్చని సూచించారు. గురువారం నుంచి ర్యాంకు, రిజర్వేషన్, పాఠశాలల ప్రాధాన్యత క్రమంలో పాఠశాలల్లో సీట్ల ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. జూనియర్ కాలేజీల్లో 1:5 నిష్పత్తి ప్రకారం ఈ నెల 20 నుంచి కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తామని తెలిపారు. డిగ్రీ కాలేజీలో 1:10 నిష్పత్తి ప్రకారం 23న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. సంస్థ నిర్వహిస్తున్న 12 మైనారిటీ పాఠశాలలు, 3 మైనారిటీ కాలేజీల్లో నేరుగా అడ్మిషన్లు కల్పిస్తామని తెలిపారు.

టెన్త్ సప్లిమెంటరీ హాల్‌టికెట్లు విడుదల

అమరావతి, మే 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24 నుంచి జరిగే పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు హాల్‌టికెట్లను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి తెలిపారు. విద్యార్థులు బుధవారం నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, హెచ్ఎంల లాగిన్ నుంచి కూడా హాల్ టికెట్లు పొందవచ్చని సూచించారు.

రేపటి నుంచి 12 జిల్లాల్లో బీసీజీ టీకా

▸▸ 2025 నాటికి ఏపీలో టీబీ నిర్మూలన లక్ష్యం

రాష్ట్రంలో 2025 నాటికి టీబీ కేసులను పూర్తిగా నిర్మూలించాలని ఆరోగ్యశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. టీబీ కేసుల సంఖ్యను గణనీయంగా తగ్గించే లక్ష్యంతో 18 ఏళ్లు నిండిన వారికి బీసీజీ టీకా అందించాలని అధికారులు నిర్ణయించారు. గురువారం నుంచి రాష్ట్రంలోని 12 జిల్లాల్లో తొలి విడత బీసీజీ టీకా పంపిణీని ప్రారంభించనున్నట్టు తెలిపారు. అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, విజయనగరం, కృష్ణా, గుంటూరు, పల్నాడు, నెల్లూరు, చిత్తూరు, నంద్యాల, కడప, అన్నమయ్య, సత్యసాయి జిల్లాల్లో ఆరు కేటగిరీలకు చెందిన అర్హులైన వారికి 3 నెలల వ్యవధిలో ఈ బీసీజీ టీకా అందించనున్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా క్షయ నివారణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారులు సంయుక్తంగా అమలు చేయనున్నారు. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎం, ఆశా, సీహెచ్‌వో, టీబీ చాంపియన్లు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

కోనసీమలో ఘోర రోడ్డు ప్రమాదం

ధాన్యం లోడు చేస్తున్న కూలీలను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు



ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు

▸▸ అక్కడిక్కడే నలుగురు మృతి

▸▸ పలువురికి తీవ్రగాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం

పి.గన్నవరం/అంబాజీపేట, మే 14: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ఉడిమూడి శివారు చింతావారిపేట వద్ద మంగళవారం రాత్రి ట్రాక్టర్‌లో ధాన్యం లోడు చేస్తున్న కూలీలను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో నలుగురు అక్కడిక్కడే మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. పి.గన్నవరం మండలం ఆదిమూలవారిపాలెం, గంటి పెదపూడి గ్రామాలకు చెందిన 10 మంది జట్టుకూలీలు మంగళవారం తెల్లవారుజామున ధాన్యం బస్తాలను ట్రాక్టర్‌లో లోడు చేసేందుకు ఉడిమూడి వెళ్లారు. రాత్రి సుమారు 7.30 గంటల సమయంలో రాజోలు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు చింతావారిపేట వద్ద రహదారి పక్కనే ధాన్యం బస్తాలు లోడు చేస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్‌కి పగ్గం బిగిస్తున్న జట్టు కూలీలు ప్రమాదానికి గురయ్యారు. పి.గన్నవరం మండలం ఆదిమూలవారిపాలేనికి చెందిన చిలకలపూడి మణిబాబు (31), గంటి పెదపూడికి చెందిన నూకపెయ్యి శివ (32), వాసంశెట్టి సూర్యప్రకాష్ (48), ఈరి కట్టయ్య (46) అక్కడిక్కడే మృతి చెందారు. ఇద్దరు జట్టు కూలీలకు, బస్సులో ప్రయాణిస్తున్న 10 మందికిపైగా తీవ్ర గాయాలయ్యాయి. క్షతగ్రాతులను తొలుత పి.గన్నవరం సీహెచ్‌సీ, కొత్తపేట ఏరియా ఆసుపత్రులకు తరలించారు. జట్టు కూలీలు చిలకలపూడి సురేష్, బొరుసు నాని పరిస్థితి విషమంగా ఉండడంతో అమలాపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సంఘటనాస్థలాన్ని కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ, సీఐ డి.ప్రశాంత్‌కుమార్ పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు డ్రైవర్ పరారయ్యాడు. డ్రైవర్ ఇక్కడకు వచ్చే వరకు మృతదేహాలను తరలించేందుకు వీల్లేదంటూ బంధువులు రహదారిపై బైఠాయించి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. మృతుల కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

జగన్ అక్రమాస్తుల కేసులను.. రోజువారీగా విచారించండి

▸▸ నాంపల్లి కోర్టుకు సీబీఐ అభ్యర్థన

▸▸ ఆయన విదేశీ టూర్‌కు న్యాయస్థానం అనుమతి

▸▸ కాంటాక్ట్ నంబర్లు, ఈ-మెయిల్‌ను కోర్టుకు, సీబీఐకి సమర్పించాలని సీఎంకు ఆదేశం

▸▸ పర్యటించే ప్రాంతాల వివరాలు కూడా..

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అక్రమాస్తుల కేసులపై రోజువారీ పద్ధతిలో విచారణ జరపాలని ప్రత్యేక కోర్టుకు సీబీఐ విజ్ఞప్తి చేసింది. ఆయన కుటుంబంతో విదేశాలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వొద్దని కోరింది. అయితే నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టు ఆయన విదేశీ టూర్‌కు అనుమతించింది. గురువారం (ఈ నెల 16) నుంచి జూన్ 1 వరకు 17 రోజులపాటు కుటుంబ సమేతంగా యూకే, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్ వెళ్లడానికి అనుమతి కోరుతూ జగన్ సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సీబీఐ స్పెషల్ కోర్టు ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి టి.రఘురాం విచారణ చేపట్టారు. జగన్ తరపు న్యాయవాది జి.అశోక్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. అక్రమాస్తుల కేసులు ప్రస్తుతం 'హియరింగ్ ఆన్ చార్జెస్' దశలో ఉన్నాయని.. వీటికి చాలా సమయం పడుతుందని పేర్కొన్నారు. 2015 నుంచి ఇప్పటివరకు అనేకసార్లు విదేశీ పర్యటనలకు వెళ్లినప్పటికీ ఎక్కడా షరతులు ఉల్లంఘించలేదని తెలిపారు. సీబీఐ తరపు న్యాయవాది ఇందర్‌జీత్ సంతోషి వాదనలు వినిపిస్తూ.. ప్రజాప్రతినిధులపై క్రిమినల్ కేసులను వేగంగా పరిష్కరించేందుకు సుప్రీంకోర్టు పలు మార్గదర్శకాలు జారీచేసిందని తెలిపారు. 'వాటి అమలులో భాగంగా జగన్ కేసులను రోజువారీ పద్ధతిలో విచారణకు స్వీకరించాల్సి ఉంటుంది. జగన్, ఇతర నిందితులు కార్పొరేట్ ముసుగులో మోసపూరితంగా అయాచిత ఆర్థిక లబ్ధి పొందారు. సమయానుగుణ మినహాయింపులను వాడుకుంటూ.. ఏదో ఒక కారణంతో విదేశీ పర్యటనలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కేవలం ఒకే ఒక్కసారి 2020 జనవరి 10న ఈ కోర్టుకు వ్యక్తిగతంగా హాజరయ్యారు. ఇతర అన్ని సందర్భాల్లో వ్యక్తిగత హాజరు మినహాయింపు తీసుకున్నారు. అక్రమాస్తుల కేసుల్లో ఒకరి తర్వాత ఒకరు వివిధ కారణాలతో కోర్టు ప్రొసీడింగ్స్‌కు ఆటంకాలు కలిగిస్తున్నారని.. నిందితులు వేర్వేరుగా వివిధ సెక్షన్ల కింద అప్లికేషన్స్ దాఖలు చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు పొందుతూ ఆలస్యం చేస్తున్నారని తెలంగాణ హైకోర్టు 2017, 2018లో ఇచ్చిన పలు తీర్పుల్లో వ్యాఖ్యానించింది. జగన్, ఇతర నిందితులు విచారణలో ఆలస్యానికి కారణమవుతూనే మళ్లీ అదే ఆలస్యాన్ని కారణంగా చూపి బెయిల్ షరతుల నుంచి మినహాయింపు పొందాలని చూస్తున్నారు. ఈ నేపథ్యంలో విదేశీ పర్యటన సహా ఎలాంటి మినహాయింపులూ ఇవ్వొద్దు' అని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు.. పిటిషనర్ విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు ఉల్లంఘనలకు పాల్పడినట్టు సీబీఐ ఎలాంటి ఆధారాలు చూపలేదని పేర్కొంది. 'ఫ్యామిలీ వెకేషన్ సహా చాలా సందర్భాల్లో ఇదే కోర్టు పిటిషనర్ విదేశీ పర్యటనలకు అనుమతిచ్చింది. ఈ నెల 16 నుంచి జూన్ 1 వరకు యూకే, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్ అనుమతిస్తున్నాం. జగన్ తన కాంటాక్ట్ నంబర్లు, ఈ-మెయిల్, పర్యటించే ప్రాంతాల వివరాలు కోర్టుకు, సీబీఐకి సమర్పించాలి' అని ఆదేశించింది.

రాష్ట్ర స్థాయి పర్యావరణ అంచనా అథారిటీ ఏర్పాటు

అమరావతి, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో పర్యావరణ ప్రభావం అంచనాకు కేంద్ర పర్యావరణ శాఖ ఒక అథారిటీని ఏర్పాటు చేసింది. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కార్యదర్శి బి.శ్రీధర్ చైర్మన్‌గా, నూజివీడు ఆర్జీయూకేటీ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ సభ్యుడిగా, రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ ప్రత్యేక కార్యదర్శి సభ్య కార్యదర్శిగా నియమించింది. ఈ అథారిటీ చైర్మన్, సభ్యులు మూడేళ్లపాటు ఈ పదవుల్లో ఉంటారని కేంద్రం పేర్కొంది. ఈ అథారిటీకి సహాయపడేందుకు రాష్ట్రస్థాయి నిపుణుల అంచనా కమిటీని కూడా ఏర్పాటుచేసింది. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర వర్సిటీ బయో కెమిస్ట్రీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావును నిపుణుల కమిటీ చైర్మన్‌గా, కాలుష్య నియంత్రణ మండలి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరును కార్యదర్శిగా నియమించింది. పర్యావరణ రంగంలో నిపుణులైన వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన 13 మంది సభ్యులుగా నియమితులయ్యారు.

ఐస్‌క్రీం తిని చిన్నారికి అస్వస్థత

▸▸ గొంతు, పెదాల వాపుతో ఆస్పత్రిలో చికిత్స


కొమ్ము ఎసిబా

తర్లుపాడు, మే 14: ఐస్‌క్రీం తిన్న ఓ చిన్నారి అస్వస్థత పాలైన ఘటన ప్రకాశం జిల్లా తర్లుపాడు మండలం గానుగపెంట గ్రామంలో చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన కొమ్ము ఎసిబా అనే చిన్నారి నరసరావుపేటలోని గోకుల్ కంపెనీకి చెందిన ఐస్‌క్రీం కొనుక్కుని తింది. తిన్న గంట వ్యవధిలో ఆమె గొంతు, పెదాలు వాపులు వచ్చా యి. దీంతో చిన్నారిని వెంటనే మార్కాపురంలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. కొమ్ము మరియదాసు అనే వ్యక్తి నరసరావుపేటలో తయారుచేసిన ఐస్‌క్రీంలను గానుగపెంటలో అమ్ముకుంటున్నాడు. కాలం చెల్లిన ఐస్‌క్రీంలు తినడంతో బాలిక పెదాలు, గొంతు వాచినట్లు వైద్యులు తెలిపారు. వెంటనే మరియదాసును చిన్నారి తల్లిదండ్రులు నిలదీశారు. తనకేమీ తెలియదని, అక్కడి వారు ఇచ్చిన ఐస్‌క్రీంలను మాత్రమే విక్రయిస్తున్నానని చెప్పాడు. అతని దగ్గర ఉన్న ఐసీక్రీంలను స్థానికులు పరిశీలించగా వాటిలో కొన్నింటికి గడువు ముగిసినట్లు గుర్తించారు. ప్రస్తుతం ఎసిబా చికిత్స పొందుతోంది. ఆమె తల్లిదండ్రులు తాడివారిపల్లె ఎస్ఐ వేముల సుధాకర్‌కు సమాచారం అందించారు. చిన్నారుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఐస్‌క్రీంల కంపెనీ యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కొత్తగా రూ.4వేల కోట్ల అప్పు

▸▸ నెలన్నరలోనే 17వేల కోట్ల రుణం

అమరావతి, మే 14(ఆంధ్రజ్యోతి): జగన్ సర్కారు కొత్తగా మరో రూ.4,000 కోట్ల అప్పులు తెచ్చింది. మంగళవారం ఆర్బీఐ నిర్వహించిన వేలంలో రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలు అమ్మి ఈ రుణం తీసుకుంది. దీనిపై 7.41 నుంచి 7.45 శాతం వరకూ వడ్డీ పడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు వాడుకునేందుకు రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం రూ.47,000 కోట్ల అప్పులకు అనుమతి ఇచ్చింది. అయితే మొదటి 45 రోజుల్లోనే జగన్ ప్రభుత్వం ఒక్క ఆర్‌బీఐ నుంచి రూ.17వేల కోట్ల చేబదులు తెచ్చి వాడేసింది. ఇంకా రూ.30వేల కోట్ల అప్పుల పరిమితి మిగిలి ఉంది.

17 నుంచి పద్మావతి పరిణయోత్సవాలు

తిరుమల, మే 14 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు పద్మావతీ శ్రీనివాసుల పరిణయోత్సవాలు ఘనంగా జరగనున్నాయి. నారాయణగిరి ఉద్యానవనంలోని పరిణయోత్సవ మండపంలో ఈ వేడుకలను నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో 17 నుంచి 19వ తేదీ వరకు అర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అసంపూర్ణ న్యాయం

ప్రముఖ హేతువాది, మహారాష్ట్ర అంధశ్రద్ధ నిర్మూలన సమితి వ్యవస్థాపకుడు నరేంద్ర దభోల్కర్ హత్యకేసులో పుణే కోర్టు మొన్న శుక్రవారం ఇద్దరు నిందితులకు జీవితఖైదు విధించింది, మరో ముగ్గురిని సాక్ష్యాలు లేవన్న కారణంతో నిర్దోషులని ప్రకటించి, వదిలేసింది. హత్యజరిగి పదకొండేళ్ళయిన తరువాత వెలువడిన ఈ తీర్పులో, దభోల్కర్ మీద కాల్పులు జరిపిన ఇద్దరికీ కఠినశిక్ష పడినప్పటికీ, ప్రధాన కుట్రదారుడిని వదిలివేయడం బాధాకరం. సీబీఐ వైఫల్యంతో అత్యంత కీలకమైన వ్యక్తి తప్పించుకోగలిగాడు.

2013 ఆగస్టు 20న ఉదయపు నడకలో ఉన్న ఆయనమీద కొందరు దుండగులు కాల్పులు జరిపారు, ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆయన ప్రాణం కోల్పోయారు. ఆరంభంలో పుణే పోలీసులు ఈ కేసు దర్యాప్తుచేసినప్పటికీ, తర్వాత అది సీబీఐకి బదిలీ అయింది. శరద్ కలస్కర్, సచిన్ అందూరేలు ధబోల్కర్‌ను కాల్చినట్టు విచారణలో తేలడంతో కోర్టు వీరికి జీవిత ఖైదుతో పాటు ఐదులక్షలరూపాయల జరిమానా కూడా విధించింది. కానీ, అభియోగాలను నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైనందున వీరేంద్రసింగ్ తావ్డే, సంజీవ్ పునలేకర్, విక్రమ్ భావేలను కోర్టు వదిలేసింది. పుణేకోర్టు తీర్పును స్వాగతిస్తూనే, ఈ ముగ్గురినీ వదిలేసినందుకు ధబోల్కర్ కుటుంబీకులు, అభిమానులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేస్తున్నారు.

హత్యతో సంబంధం ఉన్నవారందరికీ శిక్ష పడేట్టుగా చేయలేకపోవడం పెద్ద వైఫల్యం. ప్రధాన కుట్రదారు అని సీబీఐ పేర్కొన్న తావ్డే సహా మిగతా ఇద్దరు ఆధారాలు లేని కారణంగా నిర్దోషులుగా బయటపడిపోవడం విచిత్రం. 'సనాతన సంస్థ'కు చెందిన వీరంతా ధబోల్కర్ హత్యలో సూత్రధారులు, పాత్రధారులని సీబీఐ చాలా గట్టిగా వాదించింది. కానీ, ఈ ముగ్గురి విషయంలో దర్యాప్తు సంస్థ నేరాన్ని రుజువుచేయలేకపోయింది. సీబీఐ, మహారాష్ట్ర పోలీసులను ఉద్దేశించి కోర్టు తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. ఈ ముగ్గురూ కుట్రలో భాగస్వాములు కాదని, వారి పాత్ర ఏమీ లేదని తాను భావించడం లేదని స్పష్టంచేసింది. వారు అమాయకులని నమ్మి తాను వదిలిపెట్టడం లేదనీ, దర్యాప్తు సంస్థలు తమ విధిని నిర్వహించడంలో విఫలమైనందున తాను ఈ ముగ్గురినీ విడిచిపెట్టాల్సి వస్తున్నదని వ్యాఖ్యానించింది. మహారాష్ట్ర అధికారులను సైతం న్యాయస్థానం తీవ్రంగా విమర్శించింది. ధబోల్కర్ హత్యకు సంబంధించిన వ్యవహారంలో సమస్త వ్యవస్థలు అలసత్వాన్ని కనబరిచాయని వ్యాఖ్యానించింది. దేశాన్ని తీవ్రంగా కుదిపేసిన ఈ హత్య ఘటనలో కేసును ఉద్దేశపూర్వకంగానే బలహీనపరిచారన్నది న్యాయస్థానం అభిప్రాయం కావచ్చు. కుట్ర జరిగిందని, హత్యకు కొందరు ప్రేరేపించారని న్యాయస్థానం నమ్మింది. ఈ ముగ్గురి పాత్ర విషయంలో అనుమానపడాల్సినంత ఉన్నదని కూడా వ్యాఖ్యానించింది. కానీ, వారి భాగస్వామ్యాన్ని రుజువుచేయడంలో ప్రాసిక్యూషన్ ఎందుకు విఫలమైందో తనకు అర్థంకావడం లేదన్నది. డిఫెన్స్ లాయర్ల వాదనలతీరుమీదా, ప్రవర్తనమీదా కూడా న్యాయస్థానం కొన్ని వ్యాఖ్యలు చేసింది. దభోల్కర్‌ను హిందూవ్యతిరేకిగా ముద్రవేయడం ద్వారా అతని హత్యను సమర్థించే ప్రయత్నం జరిగినట్టు కనిపిస్తోందన్నది.

మూఢవిశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న క్రమంలో ధబోల్కర్‌కు చాలా బెదిరింపులు వచ్చాయి. ప్రాణాలకు వెరవకుండా ఆయన తనపనితాను చేసుకుంటూపోయాడు. ఆయనను భౌతికంగా నిర్మూలించడం వెనుక ఆయన సిద్ధాంతాలను ఆశయాలను అంతంచేయాలన్న విశేషమైన ప్రయత్నం ఉన్నదని కోర్టు గుర్తుచేసింది. ఈ కేసును కేవలం ఒక వ్యక్తి హత్యగా కాక మరింత విస్తృతంగా చూడాల్సి ఉంటుందని కూడా న్యాయమూర్తి గుర్తుచేశారు. ధబోల్కర్ హత్య తరువాత మహారాష్ట్ర, కర్ణాటకల్లో ఈ తరహా ఆదర్శాలు, భావజాలం ఉన్న గోవింద్ పన్సారే, ఎంఎం కల్బుర్గీ, గౌరీ లంకేశ్ వంటివారి హత్యలు జరిగిన విషయం తెలిసిందే. ఈ హత్యల చుట్టూ సాగిన రాజకీయాలు, దర్యాప్తుపై ఆయా రాష్ట్రాల్లో అప్పట్లో ఉన్న ప్రభుత్వాల ప్రభావాల గురించి ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. మరో ఐదేళ్లకు జరిగిన గౌరీ లంకేశ్ హత్య తరువాత కానీ వీరిని అరెస్టుచేయకపోవడం మరో విశేషం. దభోల్కర్ కేసులో ఇప్పుడు జీవితఖైదు పడిన శరద్ కలస్కర్, సచిన్ అందూరేలతో పాటు వీరేంద్రసింగ్ తావ్డే కూడా పన్సారే కేసులో నిందితుడు. గౌరీలంకేశ్ హత్యకేసులో కలస్కర్ నిందితుడు. ఆయుధంపట్టినవారితో పాటు, తెరవెనుక కుట్రదారులను కూడా శిక్షించగలిగినప్పుడే ఈ తరహా హత్యల కేసుల్లో ఎంతోకొంత న్యాయం జరిగినట్టు.

సైద్ధాంతిక పోరుగా సార్వత్రిక సమరం



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

ప్రధానమంత్రి నరేంద్రమోదీ మూడోసారి అధికారంలోకి వస్తారా లేదా అన్న ప్రశ్నతో నిమిత్తం లేకుండా ఈ ఎన్నికలతో భారత రాజకీయాలు ఒక నిర్ణాయక ఘట్టంలో ప్రవేశించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఎన్నికలలో భారతదేశ ప్రజలు ఏమి కోరుకుంటున్నారు అన్న ప్రశ్నకు త్వరలో సమాధానం లభించనుంది. 1952 నుంచి వరుసగా మూడుసార్లు జరిగిన ఎన్నికలు వేరు. అప్పుడు కాంగ్రెస్‌కు పెద్ద పోటీ లేదు. కాని 2014, 2019, 2024 ఎన్నికలు వేరు. దేశ రాజకీయ, సామాజిక, ఆర్థిక విధానాలు ఏ దిశన ఉండాలో ప్రజలు కోరుకుంటున్నారో సూచించే ఎన్నికలు ఇవి. గతంలో ఎన్నడూ లేనంతగా దేశంలో రెండు వాదాలు ఈ ఎన్నికల్లో హోరా హోరీ పోరాడుతున్నాయి. తెలిసో, తెలియకో, ఆలోచించో, అన్యమనస్కంగానో ప్రజలు రెండు శిబిరాల్లో ఏదో ఒక శిబిరంలో చేరారు. రెండు దశాబ్దాల క్రితం నిలదొక్కుకునేందుకు నానా అగచాట్లు పడిన ఒక పార్టీ ఇవాళ దేశంలోనే ప్రబల శక్తిగా మారింది. ఆ శక్తిని ఢీకొనేందుకు ఇప్పుడు ఇతర వర్గాలన్నీ తమ అంతరె□ధ్యాలన్నీ మరిచి ఏకం కావల్సిన చారిత్రక ఆవశ్యకతను గ్రహించాయి. వారితో పాటు మేధావులు, ప్రజాస్వామిక వాదులు, సమాజం ఫలానా విధంగా ఉండాలని కోరుకుంటున్న బుద్ధిజీవులు కూడా విడిపోయారు. అందువల్ల స్పష్టంగా ఆలోచనల మధ్య సమరం జరుగుతున్న ఎన్నికలు ఇవి.

నాలుగోదశ ఎన్నికలు జరిగి దేశంలో 379 స్థానాలకు ఎన్నికలు పూర్తయిన తర్వాత కూడా ప్రధానమంత్రి నరేంద్రమోదీ అంతే సమధికోత్సాహంతో ఎన్డీఏకు 400 సీట్లు రావడం ఖాయం అని ఆత్మసె□ంతో ప్రకటించారు. కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా రావని ప్రతిపక్ష హోదా కూడా లభించదని ఆయన స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మరోసారి ప్రధాని అవుతారని, మూడో టర్మ్ మొత్తం ఆయనే పాలిస్తారని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించారు. సూర్జిత్ భల్లా వంటి ఆర్థికవేత్తలు కూడా బీజేపీ 350 సీట్లు గెలుస్తోందని చెబుతుంటే, మోదీ ఉధృతి పెరుగుతుందే కాని తగ్గడం లేదని బీజేపీ అనుకూల మేధావులు వాదిస్తున్నారు.

2014లో కాంగ్రెస్ వ్యతిరేక పవనాలు వీస్తే, 2019లో పుల్వామా, బాలాకోట్ ఘటనలు ఫలితాలను ప్రభావితం చేశాయి. ఈ సారి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఒక వ్యక్తిగా దేశంలోని మొత్తం ప్రతిపక్ష పార్టీలనన్నిటినీ ఢీకొనేందుకు సిద్ధపడ్డారు. మోదీ వర్సెస్ ఇతరులు అన్నట్లుగా ప్రచార సరళిని తీర్చిదిద్దారు. ప్రతి నియోజకవర్గంలోనూ మోదీయే పోటీ చేస్తున్నారు అన్న భావన ముఖ్యంగా ఉత్తరాదిన కల్పించారు. నిజంగా ఇది ప్రతిపక్షాలకు మాత్రమే కాదు, ఒక భావజాలాన్ని వ్యతిరేకిస్తున్న, ముఖ్యంగా మోదీని ద్వేషిస్తున్న వారందరికీ సవాల్.

మరో వైపు ప్రతిపక్షాలు కూడా ఈ ఎన్నికలు నిర్ణాయకంగా మారనున్నాయని అంగీకరిస్తున్నాయి. ప్రతి దశలోనూ పోలింగ్ పూర్తయిన కొద్దీ ప్రతిపక్షాల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతోంది. బీజేపీ గ్రాఫ్ పడిపోతుందని, మోదీ చేస్తున్న ప్రసంగాలు, వ్యాఖ్యలే ఆయనలో భయాందోళనలను ప్రతిఫలిస్తున్నాయని వారు విశ్వసిస్తున్నారు. మోదీ కీ గ్యారంటీ అన్న నినాదాన్ని కూడా పక్కన పెట్టి ప్రతిపక్షాలపై దాడులు ప్రారంభించారని, కాంగ్రెస్ మేనిఫెస్టోను సైతం వక్రీకరిస్తున్నారని వారు ఎత్తిచూపుతున్నారు. కార్పొరేట్ ఎజెండాకు అనుకూలంగా మోదీ పనిచేస్తుంటే తాము సామాజిక న్యాయ ఎజెండాతో ముందుకు వెళుతున్నామని చెప్పుకుంటున్నారు. ఈ రకంగా కూడా రెండు విధానాల మధ్య ఘర్షణ జరుగుతోందని ప్రతిపక్షాలు కూడా స్పష్టీకరిస్తున్నాయి.

అయితే ఎన్నికల సమయంలో నేతలు ఏ రకంగా ప్రచారం చేసినా, ఎన్ని వ్యాఖ్యలు చేసినా కేవలం వాటి ద్వారానే ప్రజలు ప్రభావితం అవుతారని, ముందుగా తాము ఏర్పర్చుకున్న నిశ్చితాభిప్రాయానికి భిన్నంగా ఆలోచిస్తారని భావించడం అమాయకత్వమే. కొంత అనిశ్చిత పరిస్థితుల్లో ఉన్న ఓటర్లు మాత్రమే ఎన్నికల సమయంలో జరిగే ప్రచారాలకు, పరిణామాలకు ప్రభావితమవుతారు. 1991లో రాజీవ్ గాంధీ హత్య జరిగినప్పుడు తొలి దశ ఫలితాలకు, మలిదశ ఫలితాలకూ మధ్య వ్యత్యాసం స్పష్టంగా కనపడింది. ఇప్పుడా పరిస్థితులేమీ లేవు. నిజానికి దేశంలో చాలా చోట్ల ప్రజలు తాము ఎవరికి ఓటు వేయాలో ఎన్నికలకు చాలా ముందే నిర్ణయించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ లాంటి చోట్ల ఇలాంటి పరిస్థితులు చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయి.

దేశంలో మూడు వాదనలు ఇప్పుడు ఎదురవుతున్నాయి. మోదీపై జనాదరణ ఏ మాత్రం తగ్గలేదని ఆయన మళ్లీ భారీ మెజారిటీతో అధికారంలోకి వస్తారని ఒక వర్గం చెబుతోంది. ఉత్తరప్రదేశ్ లాంటి చోట్ల బీజేపీకి సీట్లు పెరుగుతాయే కాని తగ్గే అవకాశాలులేవని వారు వాదిస్తున్నారు. మోదీకి కనీసం 70 నుంచి వంద సీట్లు తగ్గుతాయని, ఆయన మళ్లీ ప్రధానమంత్రి కావడం కష్టమని ఇంకో వర్గం చెబుతోంది. 2004లో వాజపేయికి తిరుగులేదని అందరూ భావించారని, భారతదేశం వెలిగిపోతుందన్న ప్రచారాన్ని ఆర్భాటంగా జరిపారని, అయినప్పటికీ ప్రజలు బీజేపీని తిరస్కరించి యూపీఏను అధికారంలోకి తీసుకువచ్చారని వారు గుర్తు చేస్తున్నారు. అందువల్ల ఈ ఎన్నికలను 2004లో జరిగిన ఎన్నికలతో పోల్చవచ్చని వారు వాదిస్తున్నారు. ఇక మూడోవర్గం మోదీ, బీజేపీ చెప్పుకుంటున్నట్లు ఎన్డీఏకు 400 సీట్లు రాకపోయినా అధికారంలోకి రావడం ఖాయమని వాదిస్తోంది. 2019కీ, ఇప్పటికీ పరిస్థితుల్లో తేడా లేదని, కాకపోతే కొన్ని రాష్ట్రాల్లో సీట్లు తగ్గినా ఎన్డీఏ ప్రభుత్వంలోకి రావడం ఖాయమని వారు వాదిస్తున్నారు. ఏదో గొప్ప పరిణామం జరిగి బీజేపీ 200 సీట్ల కంటే తక్కువకు పడిపోతుందన్న విషయం వారు ఏ మాత్రం అంగీకరించడం లేదు.

అయితే బీజేపీ ఈ దేశంలో మెజారిటీ వాద పార్టీగా అవతరిస్తుందని మోదీ సమర్థకులు, వ్యతిరేకులు ఇరువురూ అంగీకరిస్తున్నారు. 2014లో కాంగ్రెస్, మిత్రపక్షాలు ఎదుర్కొంటున్న వ్యతిరేక పవనాలు బీజేపీ ఇప్పుడు ఎదుర్కోవడంలేదని వారే చెబుతున్నారు. ఉచిత రేషన్, కశ్మీర్‌లో 370 రద్దు, రామమందిర నిర్మాణం, విదేశాల్లో దేశ ఆత్మగౌరవాన్ని కాపాడడం వంటి నాలుగు అంశాలే ప్రజలు తమకు చెబుతున్నారని, బీజేపీ పట్ల వారి ఆదరణకు ఇదే కారణమని యోగేంద్ర యాదవ్, సుధీంద్ర కులకర్ణి వంటి రాజకీయ విశ్లేషకులు కూడా అంగీకరిస్తున్నారు. అయితే ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతుల సమస్యలు, దైనందిన జీవన సమస్యల విషయంలో మోదీ హయాంలో ఏమీ మార్పులేదని గ్రహించినందువల్ల బీజేపీకి సీట్లు తగ్గే అవకాశాలున్నాయని వారు వాదిస్తున్నారు. 2019లో మోదీకి ఓటు వేసిన వారిలో అనేకమంది ఇప్పుడు పునరాలోచనలో పడ్డారని వారి అభిప్రాయం. కర్ణాటకలో 10 సీట్లు, మహారాష్ట్రలో 20 సీట్లు, రాజస్థాన్, గుజరాత్‌లలో 10 సీట్లు, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్‌లలో 10 సీట్లు, హర్యానా, ఢిల్లీ, పంజాబ్, హిమాచల్ లలో 10 సీట్లు, ఉత్తరప్రదేశ్, బిహార్‌లలో 30 సీట్లు, పశ్చిమ బెంగాల్, అస్సాం, ఇతర ఈశాన్య రాష్ట్రాలు, కేంద్ర ప్రాంత పాలిత రాష్ట్రాల్లో 10 సీట్లు కనీసం తగ్గిపోతాయని యోగేంద్ర యాదవ్ ఇటీవల ఒక టీవీ ఇంటర్వ్యూలో చెప్పారు. అయితే ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, తెలంగాణ రాష్ట్రాల్లో ఎన్డీఏకు సీట్లు పెరుగుతాయని ఆయన అన్నారు. ఈ వాదనను చాలా మంది బీజేపీ యేతర వర్గాలు ప్రచారం చేస్తున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీజేపీ 210–240 సీట్లు దాటదని తొలుత ప్రకటించారు. ఎన్డీఏ 400 సీట్లు సాధించాలంటే పాకిస్థాన్‌ను గెలవాల్సి ఉంటుందని చమత్కరించారు. శరద్ పవార్ కూడా ఈ వాదనను సమర్థించారు. బీజేపీ 220 సీట్లు దాటదని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అంటే, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా కమలనాథులకు 200 కూడా దాటవని చెబుతున్నారు. ఇక రాహుల్ గాంధీ అందరికంటే ఒకడుగు ముందుకు వేసి బీజేపీకి 150 సీట్లు మించవని చెబుతున్నారు. అంటే దేశంలో బీజేపీయేతర వర్గాలన్నీ ఒకే వాదన వినిపిస్తున్నాయని అర్థమవుతోంది. అసలు తమకెన్ని వస్తాయో చెప్పకుండా బీజేపీ కెన్ని వస్తాయో వారు అంచనా వేయడమే ఆశ్చర్యకరం. బీజేపీ నష్టమే తమకు లాభమని వారు భావిస్తున్నారు.

ఎన్డీఏ 400 సీట్లు, బీజేపీ 370 సీట్లు సాధించాలన్న లక్ష్యంతో మోదీ జనవరిలోనే తన ప్రచారాన్ని ప్రారంభించారు. 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో నెహ్రూ సాధించిన 364 సీట్ల రికార్డును అధిగమించాలని, కశ్మీర్‌లో 370 అధికరణ రద్దును ప్రేరణగా తీసుకొని పనిచేయాలని ఆయన భారత మండపంలో పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. రాను రానూ సంక్లిష్టంగా మారిన పరిస్థితుల్లో మోదీ ఈ లక్ష్యం సాధించడం కష్టమని బీజేపీ నేతలే అనేకమంది అంగీకరిస్తున్నారు. భారీ లక్ష్యం విధిస్తే కార్యకర్తలు ఉత్సాహంతో పనిచేస్తారన్న ఉద్దేశంతోనే మోదీ ఈ ప్రకటన చేశారని వారు అభిప్రాయపడుతున్నారు. ఉత్తర ప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ, బిహార్‌లో ఆర్జేడీ, వామపక్షాలు, ఢిల్లీలో ఆప్, మహారాష్ట్రలో ఎన్సీపీ, శివసేన వర్గాలతో కాంగ్రెస్ చేతులు కలిపి, సామాజిక న్యాయాన్ని ఎజెండాగా మార్చి 2019 ఎన్నికల్లో కంటే ఈ సారి మరింత సంఘటితంగా రంగంలోకి దిగడంతో ఈ రాజకీయ పోరు క్రమంగా సైద్ధాంతిక పోరుగా పరిణమించింది. దీనికి తోడు దేశంలో మోదీని వ్యతిరేకిస్తున్న శక్తులన్నీ ఏకమై ఈ పోరును మరింత దట్టంగా మార్చాయి. దేశంలో అలముకున్న ఈ దట్టమైన కారుమేఘాలు జూన్ 4న చెదిరిపోయి ఒక స్పష్టత ఏర్పడినప్పుడు దేశం ఎటుపోతుందో చెప్పడం సాధ్యం.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)



గతంలో ఎన్నడూ లేనంతగా దేశంలో రెండు వాదాలు ఈ ఎన్నికల్లో హోరా హోరీ పోరాడుతున్నాయి. తెలిసో, తెలియకో, ఆలోచించో, అన్యమనస్కంగానో ప్రజలు రెండు శిబిరాల్లో ఏదో ఒక శిబిరంలో చేరారు. రెండు దశాబ్దాల క్రితం నిలదొక్కుకునేందుకు నానా అగచాట్లు పడిన ఒక పార్టీ ఇవాళ దేశంలోనే ప్రబల శక్తిగా మారింది. ఆ శక్తిని ఢీకొనేందుకు ఇప్పుడు ఇతర వర్గాలన్నీ తమ అంతర్వైరుధ్యాలన్నీ మరిచి ఏకం కావల్సిన చారిత్రక ఆవశ్యకతను గ్రహించాయి. మేధావులు, ప్రజాస్వామిక వాదులు, సమాజం ఫలానా విధంగా ఉండాలని కోరుకుంటున్న బుద్ధి జీవులు సైతం విడిపోయారు. అందువల్ల స్పష్టంగా ఆలోచనల మధ్య సమరం జరుగుతున్న ఎన్నికలు ఇవి.

గత సాధారణ ఎన్నికల ప్రచారాస్త్రాలలో వాట్సప్ ముఖ్యభూమిక పోషించగా ఈ సారి యూట్యూబ్ తన వంతు పాత్ర పోషిస్తోంది. క్షేత్రస్థాయిలో ప్రతిపక్షాలు నిర్వర్తించవల్సిన కర్తవ్యాన్ని అస్తిత్వం లేని యూట్యూబ్ చానళ్ళు నిర్వహిస్తున్నాయి. ప్రధాన ప్రసార మాధ్యమాలకు దీటుగా నిమిషాల వ్యవధిలో లక్షల ప్రేక్షకులు రవీష్ కుమార్, ధృవ్ రాఠీల వీడియోలను ఆదరిస్తున్నారంటే ప్రజా చైతన్యంలో వచ్చిన మార్పుగా భావించవచ్చా? నిజంగా అది అలాంటి మార్పు అయితే ప్రజా తీర్పులో కూడా అది ప్రతిబింబిస్తుందా?

ఇవి యూట్యూబ్ ఎన్నికలు

సార్వత్రిక ఎన్నికల ప్రచారం ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పొడుస్తూ సాగుతోంది. ప్రజాస్వామ్య పండుగ అయిన ఎన్నికల ప్రక్రియలో ఇంతవరకు భారతవని ఓటర్లలో ఇంచుమించు సగం మందికి పైగా గుంభనంగా తమ తీర్పునిచ్చారు. రాజకీయ పార్టీలు ఏ రకమైన ప్రచారం చేసినప్పటికీ ఓటరు మాత్రం వారి పని తీరును అంచనా వేసి, విధానాలను గమనించి ఓటు వేస్తాడు. అందుకు అందుబాటులో ఉన్న అన్ని వినూత్న పద్ధతులను రాజకీయ పార్టీలు ఉపయోగించుకుంటాయి. రాత పూర్వక సందేశాలు ఇప్పటి వరకు విద్యావంతులకు మాత్రమే పరిమితం కాగా నిరక్షరాస్యులకు ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాలలో ఉన్న మహిళలకు సైతం సునాయాసంగా తమ వాదనలను చేరవేయడానికి ఇప్పుడు యూట్యూబ్ అమితంగా ఉపకరిస్తోంది. ప్రస్తుత ఎన్నికల ప్రచార పర్వంలో యూట్యూబ్ ప్రసార వేదిక కీలక పాత్ర పోషిస్తోంది.

ప్రాంతీయ పార్టీల మొదలు జాతీయ పార్టీల వరకు ప్రతి పార్టీ కూడా డిజిటల్ ప్రచారానికి ప్రత్యేకించి యూట్యూబ్‌పై భారీగా వెచ్చించి ప్రచారం చేస్తున్నాయి. నాటి గోడ రాతల నుండి నేటి యూట్యూబ్ వరకు అన్ని రాజకీయ పార్టీలలో బీజేపీది అగ్రస్థానం. ఫేస్ బుక్, ట్విటర్, వాట్సప్‌లలో బీజేపీతో దేశంలోని ఏ ఇతర రాజకీయ పక్షం పోటీపడజాలదు. కాషాయ విజయ వ్యూహాలలో ఈ అత్యాధునిక సామాజిక మాధ్యమాల పాత్ర కీలకం. వీటిని సద్వినియోగం చేసుకుని సమర్థంగా తిప్పికొట్టలేకపోయిన ప్రతిపక్షాలన్నీ చివరకు బీజేపీని 'వాట్సప్ విశ్వవిద్యాలయం' అని విమర్శించే అచేతన స్థితికి చేరుకున్నాయి. ప్రధాన స్రవంతి మీడియా తమను పట్టించుకోవడం లేదని నిత్యం వాపోయే రాహుల్ గాంధీ యూట్యూబ్‌తో సహా డిజిటల్ మీడియాలో కనీసం తన ఉనికిని కూడా చాటుకోలేకపోతున్నారు.! ట్విటర్ తరహా సంస్థలు రాహుల్ గాంధీ లేదా కాంగ్రెస్ పార్టీ ఖాతాలకు అవరోధం కల్పించడానికి బీజేపీ ఒత్తిడితో పాటు అవి అనుసరించే సాధారణ మార్కెట్ సూత్రాలు కూడా ఒక కారణం కావచ్చు.

గల్ఫ్ లేఖ

రెండు దశాబ్దాల క్రితం బీజేపీ అగ్రనేత లాల్‌కృష్ణ అడ్వాణీ ఫేస్ బుక్‌ను వినియోగించే సమయానికి కాంగ్రెస్ పార్టీ అధునాతన సామాజిక మాధ్యమాల దరిదాపులకు కూడ చేరలేదు. ఇప్పటికీ అది ప్రాంతీయ పార్టీ అయిన ఆమ్ ఆద్మీ పార్టీ కంటే చాలా వెనుకబడి ఉన్నది. ఇదే యూట్యూబ్‌ను తెలంగాణలో రేవంత్ రెడ్డి సమర్థంగా వినియోగించుకుని తన వ్యక్తిగత ప్రతిష్ఠను పెంచుకోవడంతో పాటు బీఆర్‌ఎస్‌ను దెబ్బతీశారు. యూట్యూబ్ చానళ్ళ కారణాన ఓడిపోయామనే కె.టి.ఆర్ ఆక్రోశానికి ఇది కూడా ఒక కారణం కావచ్చు. తమ ప్రచార సమరాలకు బీఆర్‌ఎస్ కూడా భారీగా ఖర్చు చేసి సినిమాల తరహా విడియోలను నిర్మించి విడుదల చేసినా జనాలు పట్టించుకోలేదనేది వేరే విషయం.



ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలలో యూట్యూబ్ ప్రచారానికి ప్రాధాన్యం పెరిగింది. గత సాధారణ ఎన్నికల ప్రచారాస్త్రాలలో వాట్సప్ ముఖ్యభూమిక పోషించగా ఈ సారి యూట్యూబ్ తన వంతు పాత్ర పోషిస్తోంది. క్షేత్రస్థానంలో ప్రతిపక్షాలు నిర్వర్తించవల్సిన కర్తవ్యాన్ని అస్తిత్వం లేని యూట్యూబ్ చానళ్ళు నిర్వహిస్తున్నాయి.

రాహుల్ గాంధీతో సహా యావత్తు ప్రతిపక్షాలు కలిసికట్టుగా చేయలేని పనిని కేవలం ఇద్దరు ముగ్గురు వ్యక్తులు తమ విడియోల ద్వారా చేస్తూ శక్తిమంతమైన బీజేపీపై పదునైన విమర్శనాస్త్రాలు సంధిస్తూ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. స్వతంత్రంగా, నిష్పాక్షికంగా కొందరు వ్యక్తులు ప్రసారం చేస్తున్న దృశ్య సందేశాలు ప్రత్యేకించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విధానాలను ప్రశ్నిస్తుండగా వాటికి యూట్యూబ్‌లో ప్రజలు నీరాజనం పడుతుండడం ఆశ్చర్యంతో పాటు ఆసక్తి కల్గిస్తోంది. ఎన్నికల వేళ, ఈ దిశగా ఒక ప్రముఖ టెలివిజన్ చానల్‌లో ఉద్యోగానికి రాజీనామా చేసిన రవిష్ కుమార్, ప్రవాస భారతీయుడు ధృవ్ రాఠీలు అనతికాలంలో మోదీ వ్యతిరేక వైఖరితో యూట్యూబ్ వారధిగా అశేష జనవాహినికి చేరువ అయిన తీరు ఆసక్తికరం. ఈ ఇరువురు అచితూచి చట్టపరిధిలో ఉండడంతో సర్కారు ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండడం ఇక్కడ అంతకంటే ఆసక్తికరం. సాధారణ వార్తలు, ఇతర వర్తమాన అంశాలకు కాకుండా కేవలం మోదీ వ్యతిరేక వార్తలే లక్ష్యంగా వారు పని చేయడం కూడ ఇక్కడ గమనార్హం.

ప్రధాన స్రవంతిలోని సంప్రదాయ సమాచార, ప్రసార సాధనాల పట్ల సామాన్యులలో సన్నగిల్లుతున్న విశ్వసనీయత కారణాన యూట్యూబ్ లోకంలో అవిష్కృతమవుతున్న ఈ రకమైన నూతన వార్తా వ్యవస్థలకు ఆదరణ లభిస్తోంది. జైలు నుంచి విడుదలయిన మరుసటి రోజు ఉదయం ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కెజ్రీవాల్ చేసిన సంధించిన విమర్శలను ప్రధాన స్రవంతి మీడియా అలక్ష్యం చేసినా చిన్నచితకా యూట్యూబ్ చానళ్ళు మాత్రం జనాలకు చేరవేసాయి. నవీన సామాజిక మాధ్యమాలలో ఇప్పటి వరకు బీజేపీ చెప్పిందే వేదంగా నడిచింది కానీ ఇప్పుడు మోదీ విధానాలకు వ్యతిరేకంగా యూట్యూబ్‌లో లభిస్తున్న ఆదరణను అర్థం చేసుకోవల్సిన అవశ్యకత ఉంది.

పాత్రికేయ విలువలకు కట్టుబడి నిష్పాక్షికంగా వ్యవహరిస్తూ ప్రజల మన్ననలను అందుకొంటున్న యూట్యూబ్ చానళ్ళు కొన్ని ఉన్నా వీటి ముసుగులో సమాజాన్ని పట్టిపీడిస్తున్న వారి సంఖ్య అధికంగా ఉండడం బాధాకరం. అయితే ఇది వేరే విషయం. ప్రధాన ప్రసార మాధ్యమాలకు దీటుగా నిమిషాల వ్యవధిలో లక్షల ప్రేక్షకులు రవీష్ రాఠీల విడియోలను ఆదరిస్తున్నారంటే ప్రజా చైతన్యంలో వచ్చిన మార్పుగా భావించవచ్చా? నిజంగా అది అలాంటి మార్పు అయితే ప్రజా తీర్పులో కూడా అది ప్రతిబింబిస్తుందా?

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

విమర్శలో విశిష్ట తరంగం

తెలుగు సాహిత్యంలో మార్క్సిస్టు సాహిత్య విమర్శకు ఉత్తమమైన సంప్రదాయం ఉంది. అనేకమంది మార్క్సిస్టు విమర్శకులు తెలుగు సాహిత్య వికాసాన్ని అందులో అభివ్యక్తమైన రకరకాల సాహిత్య సామాజిక అంశాలను విశ్లేషించడానికి కృషి చేశారు. అభ్యుదయ సాహిత్య కాలంలో జీవీ కృష్ణారావు, తర్వాత మద్దుకూరి చంద్రశేఖర రావు, కొడవటిగంటి, కెవిఆర్, రారా, వెల్చేరు, చేకూరి రామారావు, బాలగోపాల్ లాంటివాళ్ళు తెలుగు మార్క్సిస్టు విమర్శకు కలిగించిన దోహదం ఎంతో విలువైనది.

పలువురు మార్క్సిస్టు విమర్శకులు ఆధునిక సాహిత్యానికి మాత్రమే పరిమితమైన కాలంలో సంప్రదాయ సాహిత్యాన్ని అధ్యయనం చేయాల్సిన అవసరాన్ని గుర్తించడంలో, అందుకు ఉపకరించే మార్గాలను అన్వేషించడంలో కేకేఆర్ చూపిన శ్రద్ధ అత్యంత ప్రశంసనీయమైంది. అంతేకాదు, భారతీయ లాక్షణిక గ్రంథాలను సైతం అధ్యయనం చేసే మార్గాన్ని ప్రవేశపెట్టడంలో వారి కృషి ఎంతో విలువైనది. ప్రాచీన సాహిత్య అధ్యయనానికి చరిత్రలో గాఢమైన అధ్యయనం, చరిత్ర పరిశోధన పట్ల గౌరవం ఉంటే తప్ప సాహిత్యానికి అనువర్తింపజేయడంలో సరియైన అవగాహన రూపొందదు. చారిత్రక అవగాహనకు సాహిత్యం ఎంతగా ఉపకరిస్తుందో, సాహిత్య అవగాహనకు చరిత్ర అంతగా దోహదపడుతుంది.



ఆధునిక సాహిత్యాన్ని అర్థం చేసుకోవాలంటే ఆధునిక సమాజ లక్షణాలు అర్థం కావాలని కేకేఆర్ చెబుతారు. ఆధునికత అనేది కాలవాచి కాదని, జీవన విధానంలోను సామాజిక సంబంధాల్లోను వచ్చే మార్పులను అర్థం చేసుకోగలిగితే సామాజిక స్వరూపాన్ని, ఆ సమాజంలో వచ్చే సాహిత్యాన్ని అర్థం చేసుకోగలమని కేకేఆర్ భావన.

భారతీయ చారిత్రక అంశాలను అధ్యయనం చేసిన పలువురు చరిత్రకారులు మార్క్సిస్టు సిద్ధాంతాన్ని ప్రధాన దృక్పథంగా స్వీకరించినా వారిలో చాలామంది ఏ పార్టీకి అనుబంధం కలిగిన వారు కాదు. అంతే కాదు, వారి రచనల్లో పదేపదే మార్క్స్ కొటేషన్స్ కూడా కనబడవు. అది చాలా తెలివిడిగా ఆయా చరిత్రకారులు అనుసరించిన పద్ధతిగా తదనంతర విశ్లేషకులు భావించారు. తమ సాహిత్య అవగాహనకు ఆయా చరిత్రకారుల రచనలను ఆకరంగా స్వీకరించిన కేకేఆర్ చరిత్రకారుల స్ఫూర్తిని స్వీకరించినట్లుగా మనం గుర్తించవచ్చు. కేకేఆర్ రచనల్లో సహితం పదేపదే ఆయా మూల రచయితల కొటేషన్స్ గానీ, చరిత్రకారుల ఉద్ధరణలు గాని అధికంగా కనిపించవు. కేకేఆర్ చారిత్రక అవగాహనను డిడి కోశాంబి, సాహిత్య అవగాహనను రెమెండ్ విలియమ్స్ లాంటి వారు ప్రభావితం చేశారు.

నన్నయ తెలుగు సాహిత్యంపై గాఢమైన ప్రభావాన్ని వేయడానికి కేవలం మహాభారతాన్ని అనువదించడం వల్ల కాక, తమ కాలం నాటికి అవసరమైన ఎన్నో మార్పులను కావ్య రచనలో ప్రవేశపెట్టారని కొన్ని సామాజిక అంశాల్లో సమకాలీన వైదిక ఆధిపత్యానికి సంబంధించిన భావనలను చాలా బలంగా ప్రతిపాదించారని, అందువల్లనే వైదిక సంప్రదాయాన్ని అనుసరించిన అనేకమంది కవులకు నన్నయ ఆదర్శమయ్యారని నన్నయ చారిత్రక భూమికలో చాలా విపులంగా విశ్లేషించారు కేకేఆర్. అలాగే తెలుగు సాహిత్యం మరో చూపు, తెలుగులో తొలి సమాజ కవులు అనే గ్రంథాలకు కేకేఆర్ వేసిన ప్రణాళిక కూడా చాలా విలక్షణమైనది.

ఆస్థాన సాహిత్యానికి, ఆస్థానేతర సాహిత్యానికి, ప్రజా సాహిత్యానికి మధ్య అనేక అంతరాలు ఉంటాయని, ఆయా కవులు ఏ సామాజిక రాజకీయ నేపథ్యం నుంచి తమ సాహిత్యాన్ని వెలువరించారో ప్రత్యేకంగా విశ్లేషించడం ద్వారానే వారి రచనలకున్న ప్రాసంగికతను అర్థం చేసుకోవడానికి వీలవుతుందని కేకేఆర్ ఆ గ్రంథాల్లో విపులంగా చర్చించారు. భారతీయ సాహిత్యాన్ని అధ్యయనం చేసే సమయంలో భక్తి సాహిత్యాన్ని గురించి ఎంతో విశేషమైన సమాచారం ఉంది కానీ తెలుగులో చాలా పరిమితంగా మాత్రమే అధ్యయనాలు జరిగాయి. అందుకు ప్రధాన కారణం తెలుగులో అదొక ప్రధాన స్రవంతి కాకపోవడం. అయినా అది అందించిన చైతన్యాన్ని గూర్చి అధ్యయనం చేయాల్సిన అవసరాన్ని ఈ పుస్తకాలలో చాలా వివరంగా చర్చించి, భక్తి భావనకున్న సాహిత్య సామాజిక నేపథ్యాన్ని ప్రామాణికంగా నిరూపించగలిగారు.

కేకేఆర్ చాలా విలువైన వ్యాసాల్లో 'భాష, సాహిత్యం, కవిత్వంలో అలంకారాలు' అనేది ఒకటి. భారతీయ అలంకార శాస్త్రం పట్ల మార్క్సిస్టు విమర్శకులలో చాలా పరిమితమైన అవగాహన ఉంది. తెలుగు వారిలో ఒకరకంగా దాని పట్ల తీవ్ర అసహిష్ణుత కూడా ఉంది. కానీ కేకేఆర్ భారతీయ అలంకార శాస్త్రాన్ని చాలా సానుకూల దృక్పథంతో అధ్యయనం చేయాల్సిన పద్ధతిని గూర్చి ఎంతో వివరంగా ఈ వ్యాసంలో చర్చించారు. రసం, ధ్వని, అలంకారం, వక్రోక్తి, ప్రతీకాత్మక అంశాలను పాశ్చాత్యులు ప్రతిపాదించిన రకరకాల సిద్ధాంతాలతో సమన్వయం చేస్తూ జరిపిన అధ్యయనం కేకేఆర్‌కి ప్రాచీన సాహిత్యం పట్ల ఉన్న గాఢమైన అభినివేశానికి తార్కాణంగా నిలుస్తుంది.

ఆధునిక సాహిత్యాన్ని అర్థం చేసుకోవాలంటే ఆధునిక సమాజ లక్షణాలు అర్థం కావాలని కేకేఆర్ చెబుతారు. ఆధునికత అనేది కాలవాచి కాదని, జీవన విధానంలోను సామాజిక సంబంధాల్లోను వచ్చే మార్పులను అర్థం చేసుకోగలిగితే సామాజిక స్వరూపాన్ని, ఆ సమాజంలో వచ్చే సాహిత్యాన్ని అర్థం చేసుకోగలమని కేకేఆర్ భావన. ఆధునిక భావజాలానికి, ఉత్తమ రచనా సంప్రదాయానికి గురజాడ ప్రవేశపెట్టిన పద్ధతి ఎంతగానో దోహద పడిందని కేకేఆర్ అభిప్రాయం. గురజాడ కన్యాశుల్కంలో స్వీకరించిన వస్తువు, ఉపయోగించిన భాష, కథల్లో ఆయన చర్చించిన సామాజిక విషయాలు ఆధునికతకు బలీయమైన పునాదులు వేశాయని అభిప్రాయపడ్డారు. అలాగే గిడుగు రామ్మూర్తి పంతులు వ్యవహారిక భాషావాద అవసరాన్ని గుర్తింపచేయడంలో, ఎన్నో భాషా శాస్త్ర సిద్ధాంతాలను అధ్యయనం చేసి ఆధునిక వ్యవహార రూపాన్ని అందించడానికి దోహదపడ్డారని 'నూరేళ్ల తెలుగునాడు'లో చర్చించారు.

ఏ రచయిత జీవితాన్ని గూర్చి విడిగా రాసినా ఆ వ్యక్తి ఏ భావాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడో వాటి మీద మాత్రమే కేకేఆర్ దృష్టి ఉండేది. ఆ వ్యక్తికి సంబంధించిన వ్యక్తిగత అంశాలను, వివాదాస్పద విషయాలను స్పృశించడం ఆయనకు అంతగా ఇష్టం ఉండేది కాదు. అందుకే అనవసర చర్చల కంటే విస్తృత ప్రజానీకానికి ఉపకరించే భావనలను మాత్రమే అధికంగా చర్చించడం చూస్తాం. ఆధునిక కాలంలో ఎంతో వివాదాస్పదంగా ఉన్న సంబంధాలను సుకుమారంగా స్పృశించి వదిలి వేసేవారు. వాటికంటే మరింత విలువైన విషయాలు చర్చించడం సాహితీ ప్రియులకు ఉపయోగమని భావించేవారు.


దిగంబరకవులతో వ్యక్తిగతంగా కేకేఆర్ గారికి చాలా సాన్నిహిత్యం ఉండేది. ఆ కవిత్వం వస్తున్న సమయంలోనే దాన్ని తూర్పారబట్టిన రారా లాంటి సుప్రసిద్ధ విమర్శకులు ఉన్నారు, ఈసడించుకున్న కవులూ ఉన్నారు. కానీ ఏ సామాజిక సాహిత్య ప్రయోజనం కోసమై యువ రచయితలు సమాజంలో ఆ కవిత్వాన్ని రచించారో తెలపడానికి ఎంతో సంయమనంతో పరిశీలించినవారు వెల్చేరు నారాయణరావు, కేకేఆర్ లే.

కేకేఆర్ సంపాదకత్వం వహించిన 'ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు' అనే గ్రంథం కలిగించిన సంచలనం సాధారణమైనది కాదు. ఆధునిక సాహిత్యంలోని ఎన్నో వాదాలను గూర్చిన చర్చ ఆనాటి పరిశోధకులకు, విద్యార్థులకు ఎంతగానో ఉపకరించింది. ఈనాటికి అధ్యయన అధ్యాపనాల్లో అది సజీవంగా కొనసాగుతూనే ఉంది. అటువంటి ప్రామాణికమైన పుస్తకాలను రూపొందించడంలోనూ, ఎన్నో విలువైన వ్యాసాలను రాయడంలోనూ కేకేఆర్ ప్రదర్శించిన ప్రజ్ఞ ఈనాటికీ ఆశ్చర్యాన్ని ఎంతో ఆనందాన్ని కలగజేస్తాయి. వారి రచనలన్నీ తెలుగు మార్క్సిస్టు సాహిత్య విమర్శ గాఢతను పట్టి చూపుతాయి.

■ ఆచార్య పిల్లలమర్రి రాములు
(నేడు కేకేఆర్ తృతీయ వర్ధంతి)

నోట్లు, తిట్ల ఐపీఎల్


ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఆటగాళ్ళపై కోట్లకు కోట్లు కుమ్మరించిన ఓనర్లు ఇప్పుడు ఆటగాళ్ళ స్థాయిని, వ్యక్తిత్వాన్ని సైతం ప్రశ్నిస్తున్న దృశ్యాలు చూస్తున్నాం. డ్రెస్సింగ్ రూమ్‌లో కనిపించాల్సినవన్నీ మైదానంలోనే కనిపిస్తుండటం ఆటగాళ్ళకు ఓనర్లు ఇస్తున్న 'విలువ' ఏంటో చెప్పకనే చెబుతున్నాయి. ఆటగాళ్ళను అమితంగా ఆరాధించే భారత క్రికెట్ ఫ్యాన్స్‌కు గత బుధవారం కనిపించిన దృశ్యం మింగుడుపడటం లేదు. సన్‌రైజర్స్ చేతిలో ఓటమి తర్వాత కేఎల్ రాహుల్ లాంటి ఆటగాడిని సంజీవ్ గోయంకా ఒక అనామకుడిని నిలదీసినట్టు, తిడుతున్నట్టు కనిపించింది. అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు ఎన్నో మ్యాచ్‌లు ఆడిన క్రికెటర్ ఇదే టీమ్‌ను ప్రతి సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు తీసుకెళ్ళిన కెప్టెన్... 2022లో లక్నో సూపర్ జెయింట్స్ ఏర్పడినప్పటినుంచి అదే జట్టుతో ఉన్నాడు. 7వేల 90 కోట్ల రూపాయల బిడ్‌తో ఈ ఫ్రాంచైజీని సంజీవ్ గోయెంకా ఆధ్వర్యంలోని ఆర్‌పీఎస్‌జీ గ్రూప్ దక్కించుకుంది. 2022లో టాప్ -3లో నిలిచిన ఎల్ఎస్‌జీ ఎప్పుడూ ఫైనల్‌కు చేరుకోలేదు. కానీ అదే జట్టుతో కలిసి అదే ఏడాది తెరమీదకు వచ్చిన గుజరాత్ టైటాన్స్ మాత్రం ఒకసారి చాంపియన్‌గా, మరోసారి ఫైనలిస్టుగా రికార్డు సొంతం చేసుకుంది. ఏదైనా అసంతృప్తి ఉంటే డ్రెసింగ్ రూమ్‌లోనో, మరోచోటనో ఆటగాళ్ళతో మాట్లాడాలి. కానీ ఇలా చేయడం ద్వారా ఏం చెప్పదల్చుకున్నారు? క్రికెట్‌ను వ్యాపారం చేసి, క్రికెటర్లను సరుకుగా చూస్తామనా? సన్‌రైజర్స్‌పై రాహుల్ ఆడిన ఇన్నింగ్స్ బాలేదు. అతను సెల్ఫిష్ ప్లేయర్ అనే విమర్శలూ ఉండొచ్చు. బంతిని 30 యార్డ్స్ దాటించడానికి కష్టపడిన ఇదే రాహుల్ ఒకప్పుడు 14 బంతుల్లో 50 పరుగులు కొట్టిన విషయం తెలియదా? ఇదే రాహుల్ ఒకప్పుడు బుమ్రాకు చుక్కలు చూపించలేదా? అతడు ఘోరంగా ఆడి ఉండొచ్చు, కానీ ఎవరూ చెత్తగా ఆడాలని కోరుకోరు. మరి ఇదే సీజన్‌లో 260 రన్స్ కొట్టి ఓడిన తర్వాత కేకేఆర్ ప్లేయర్స్‌తో షారుక్ ఓ రోజు మాట్లాడలేదు. తర్వాతి రోజు కూడా బౌలర్లతో 'సెపరేట్' సెషన్ పెట్టుకున్నాడు. 2025 సీజన్‌కు ఈ ఏడాదే ఆటగాళ్ళ వేలం జరగనుంది. సంజీవ్ గోయెంకా గురించి తెలిసినవాళ్ళు కచ్చితంగా ఈసారి ఈ జట్టు రాహుల్‌ను వదిలేసుకుంటుందని అంచనా వేస్తున్నారు. 2017లో ఇదే సంజీవ్ గోయెంకా రైజింగ్ పుణె సూపర్ జెయింట్ ఓనర్. అప్పట్లో పుణె టీమ్ కెప్టెన్‌గా ఉన్న ధోనీని తీసివేసి, స్మిత్‌కు కెప్టెన్సీ ఇచ్చాడు. అలాంటి గోయెంకా ఇప్పుడు రాహుల్‌ను తప్పించినా ఆశ్చర్యం లేదు. అటు ముంబై ఇండియన్స్‌ను రోహిత్ వదిలేస్తాడనే వార్తలు కూడా ఉన్నాయి. ఈ టోర్నీ ప్రారంభ దశలో మ్యాచ్‌ల ఫలితాల కంటే రోహిత్ వర్సెస్ హార్దిక్ పాండ్యా వర్సెస్ నీతూ అంబానీ వివాదమే పెద్ద వార్త అయిపోయింది. చివరి దశకు వచ్చేసరికి ముంబై ఇండియన్స్‌ను వదిలేయడానికే సిద్ధమైనట్టు రోహిత్ వ్యాఖ్యానించాడనే వార్త వైరల్ అయింది. ఈ వివాదాలతోపాటు అసలు ఐపీఎల్‌లో క్రికెట్ స్ఫూర్తి, మజా ఏ మాత్రం కనిపించలేదు. అంపైర్ల పుణ్యమా అని ఈ ఐపీఎల్ కళ కోల్పోయింది. అలాగే ఆటగాళ్ళు -కామెంటేటర్ల వివాదం కూడా తొలిసారిగా తెరపైకి వచ్చింది. అలాగే ఆటగాళ్ళపై ఓనర్లు నోరు పారేసుకోవడమూ సాధారణమైపోయింది. చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మినహా మిగిలిన జట్లకు ఎలాంటి పర్మినెంట్ ఫ్యాన్ బేస్ లేదు. ఈ మూడు జట్లకు అలా మాస్ ఫ్యాన్స్ ఉన్నారంటే అందుకు ఓనర్లు, -క్రికెటర్ల మధ్య ఉన్న సత్సంబంధాలు, వాళ్ళను మేనేజ్‌మెంట్ చూసుకునే విధానం కూడా కూడా కారణం.



ఇప్పటికే చూసేవాడికి ఆడేవాడు లోకువయ్యాడు. వీటికితోడు నట్టింట కూర్చుని చూసే వాళ్ళు ఆటగాడి గురించి నెట్టింట బూతులు. ఇప్పుడు వీరికితోడు ఓనర్లు తయారయ్యారు. పండుగలాంటి క్రికెట్, గల్లీ-సిల్లీ గేమ్‌గా మారడం ఎంతో దూరంలో లేదు. ఇలాంటి వాతావరణం ఇలాగే కొనసాగితే క్రికెట్ సూపర్ స్టార్లు అవతరించరు. జంటిల్‌మాన్ గేమ్‌ను అమ్మేసిన ఐపీఎల్‌లో నికార్సయిన క్రీడా స్ఫూర్తిని ఆశించడం కూడా వృథాయేమో!.

– కేవీఎస్ తేజ

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు
బుధవారం 15 మే 2024



జిల్లాలో పోలింగ్ కేంద్రాల వద్ద అర్ధరాత్రి వరకూ బారులుతీరిన ఓటర్లు

పోలింగ్ @ 79.36%

- అత్యధికంగా జగ్గయ్యపేటలో 89.88 శాతం
- అత్యల్పంగా విజయవాడ పశ్చిమలో 66.46 శాతం
- సెంట్రల్, తూర్పు నియోజకవర్గాల్లో ఓటింగ్ శాతం భారీ పెరుగుదల

కసి తీరా పోట్లాడటం చూసి ఉంటారు. కొట్లాడటం చూసి ఉంటారు. కసి తీరా పోరాడటం కూడా చూసి ఉంటారు. కానీ కసి తీరా ఓట్లు వేయడం చూశారా? ఈ ఎన్నికల్లో అదే జరిగింది. ఓటర్లు ఎండకు భయపడలేదు. వానకు వెరవలేదు. చాంతాడంత క్యూలు ఉన్నా వెనుదిరగలేదు. సమయంతో పనిలేదు. ఆకలి దప్పులు తెలియలేదు. ఒకటే లక్ష్యం. ఎంతసేపు అయినా సరే ఓటు వేసి వెళ్లాలనే పట్టుదలే కనిపించింది. పొరుగు రాష్ట్రాల నుంచి వెల్లువలా తరలివచ్చి కొందరు.. ఖర్చుకు వెనుకాడకుండా ఖండాంతరాలు దాటి వచ్చి మరికొందరు.. ఇలా ఎక్కువ మంది ఓటు వేయడంతో జిల్లా వ్యాప్తంగా 79.36 శాతం పోలింగ్ నమోదు అయింది. 2019 కన్నా 0.42 శాతం పెరిగింది. అత్యధికంగా జగ్గయ్యపేట నియోజకవర్గంలో 89.88 శాతం పోలింగ్ నమోదు కాగా, అత్యల్పంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో 66.46 శాతం పోలింగ్ నమోదైంది. పెరిగిన పోలింగ్ ఎటువైపు మొగ్గిందో తెలియాలంటే 19 రోజుల వరకు ఆగాల్సిందే.


(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సార్వత్రిక ఎన్నికలు - 2024లో పోలింగ్ శాతం పెంచాలని జిల్లా ఎన్నికల యంత్రాంగం నిర్దేశించుకుంది. సోమవారం పోలింగ్ కేంద్రాల దగ్గర రద్దీ, అర్ధరాత్రి వరకు ఓటర్లు బారులు తీరడంతో గతం కంటే స్వల్పంగా ఓటింగ్ శాతం పెరిగింది. దూర ప్రాంతాల నుంచి వెల్లువలా తరలివచ్చారు. విదేశాలు, పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన వారంతా విజయవాడ నగరంతో పాటు జిల్లా నలుమూలలా సొంత ప్రాంతాలను కలిగి ఉన్నారు.

నగరంలో 11.35 శాతం పెరుగుదల

గ్రామీణ ప్రాంతంలో ఉన్న నియోజకవర్గాల కంటే విజయవాడ నగరంలో తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాలలో పోలింగ్ శాతం అనూహ్యంగా పెరిగింది. విజయవాడలోని మూడు నియోజకవర్గాలు కలిపితే మొత్తంగా విజయవాడ నగరంలో 11.35 శాతం మేర పోలింగ్ పెరిగింది.

గ్రామీణ ప్రాంతంలో తగ్గిన పోలింగ్

గత రెండు ఎన్నికలకు భిన్నంగా ఈసారి గ్రామీణ ప్రాంతంలోని నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం తగ్గింది. ఎన్టీఆర్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో మైలవరం, తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాలు ఉన్నాయి. మైలవరం నియోజకవర్గంలో 4.24 శాతం మేర పోలింగ్ తగ్గింది. నందిగామ నియోజకవర్గంలో స్వల్పంగా 0.45 శాతం, జగ్గయ్యపేట నియోజకవర్గంలో కూడా స్వల్పంగా 0.35 శాతం తగ్గింది. ఒక్క తిరువూరు నియోజకవర్గంలో మాత్రమే పోలింగ్ శాతం 1.56 శాతం మేర పెరిగింది. తిరువూరు మినహాయిస్తే మిగిలిన 3 నియోజకవర్గాల్లో 2.04 శాతం మేర పోలింగ్ నమోదు తగ్గింది.





కాయ్ రాజా కాయ్..!

పార్టీల గెలుపోటములపై జోరుగా పందేలు

- ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలో రూ.100 కోట్ల మేర బెట్టింగ్‌లు
- జూన్ 4 నాటికి రూ.500 కోట్లు దాటే చాన్స్
- గన్నవరం, గుడివాడలపై రూపాయికి రెండు రూపాయలు
- విజయవాడ తూర్పు, మైలవరం, పెనమలూరు, మచిలీపట్నంలలో టీడీపీ కచ్చితంగా గెలుస్తుందని పందేలు
- మచిలీపట్నం ఎంపీ, అవనిగడ్డ జనసేన అభ్యర్థుల గెలుపుపైనా అంతే

గన్నవరం, గుడివాడ, విజయవాడ తూర్పు, మైలవరం, పెనమలూరు, మచిలీపట్నం అసెంబ్లీ స్థానాలలో టీడీపీ అభ్యర్థుల గెలుపుపై విజయవాడలోని ఓ ప్రైవేటు ఉద్యోగి రూ.3 లక్షలు పందెం కాశాడు. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలలో టీడీపీకి 12 అసెంబ్లీ స్థానాలు దాటుతాయని పెనమలూరుకు చెందిన ఓ మోతుబరి రైతు రూ.5 లక్షలు పందెం కాశాడు. ఈ మోతుబరి 2014 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ కూటమికి జిల్లాలో 10కిపైగా స్థానాలు వస్తాయని పందెం కట్టి రూ.10 లక్షల వరకు సంపాదించాడు. అదే జోరుతో ఈసారి లక్షల్లో పందెం కట్టేందుకు సిద్ధమయ్యారు. జిల్లాలో పోలింగ్ ముగిసిన తర్వాత ప్రధాన పార్టీల గెలుపోటములపై ఏ స్థాయిలో బెట్టింగ్‌లు జరుగుతున్నాయో తెలిపేందుకు ఈ రెండు ఉదంతాలే ఉదాహరణలు.

(విజయవాడ, ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఇప్పుడు బెట్టింగ్ సీజన్ నడుస్తోంది. ఎన్నికల బెట్టింగ్‌కు భారీగా తెర లేచింది. ఎలక్షన్ ముగియటంతోనే పనిలోపనిగా బెట్టింగ్ బాబులు జోరు పెంచారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయి మూడు నాలుగు రోజులు కూడా కాకముందే కాయ్ రాజా కాయ్ అంటూ పందెం రాయుళ్లను వెర్రెక్కిస్తున్నారు. రెండు జిల్లాల్లో 14 అసెంబ్లీ, రెండు పార్ల మెంటు స్థానాల్లో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయన్న అంశాన్ని మొదలుకుని కీలకమైన అభ్యర్థులు సాధించే మెజారిటీల వరకు అన్నింటిపైనా బెట్టింగ్‌లు నడుస్తున్నాయి.

- విజయవాడ తూర్పు, మైలవరం, గన్నవరం, పెనమలూరు, మచిలీపట్నం అసెంబ్లీ స్థానాల్లో కూటమి తరపున టీడీపీ అభ్యర్థులు బలంగా ఉన్నారు. దీంతో ఆయా స్థానాల్లో వారు గెలుపొందే అవకాశాలను బెట్టింగ్ రాయుళ్లు పరిగణనలోకి తీసుకుంటున్నారు.
- మచిలీపట్నం పార్లమెంట్, అవనిగడ్డ అసెంబ్లీ స్థానాలు కచ్చితంగా కూటమి తరఫున జనసేన అభ్యర్థులు గెలుస్తారన్న దానిపై బెట్టింగులు జోరందుకున్నాయి.
- విజయవాడ నగరంలోని మూడు అసెంబ్లీ స్థానాల్లో ఏ పార్టీకి ఎన్నిసీట్లు వస్తాయన్న దానిపైనా లక్షల్లో బెట్టింగ్‌లు జరుగుతున్నాయి.
- తిరువూరు నియోజకవర్గంలో కూటమి, వైసీపీ అభ్యర్థులు ఇద్దరి పైనా బెట్టింగులు జోరుగా జరుగుతున్నాయి.
- కృష్ణాజిల్లాలో మాజీ మంత్రులు ఇద్దరు పోటీ చేస్తున్నారు. గుడివాడ, పెనమలూరు అసెంబ్లీ స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు ఓడిపోతారని బెట్టింగ్‌లు జరుగుతున్నాయి.
- విజయవాడ తూర్పు, మైలవరం నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థుల మెజారిటీపైనా బెట్టింగులు జరుగుతున్నాయి. జగ్గయ్యపేట, నందిగామలో రెండు పార్టీల అభ్యర్థుల ఓట్ల శాతం, గెలుపోటములపై బెట్టింగులు జరుగుతున్నాయి.

● రాజకీయ విశ్లేషణల ఆధారంగా బెట్టింగులు


ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో ప్రధాన పార్టీల గెలుపోటములను విశ్లేషించేందుకు ఆయా పార్టీల వారీగా రాజకీయ నిపుణులు రంగంలోకి దిగారు. వీరు బూత్‌లవారీగా పోలైన ఓట్ల వివరాలు సేకరించి పార్టీలకు ఓట్లు ఎలా పడి ఉంటాయన్న అంచనాకు వస్తున్నారు. ఆయా బూత్‌ల్లో పార్టీలకు ఉన్న పట్టును కూడా పరిగణనలోకి తీసుకుని గెలుపోటములను అంచనా వేస్తున్నారు. తర్వాత బెట్టింగ్ కోసం సమాచారాన్ని పంపుతున్నారు. బెట్టింగ్ బాబుల్లో అధికశాతం ప్రధాన పార్టీల ద్వితీయశ్రేణి నాయకులే ఉండటం గమనార్హం. జిల్లా స్థాయిలో ఆయా పార్టీల్లో ముఖ్య నేతలుగా ఉన్నవారు కూడా బెట్టింగ్ నిర్వాహకులుగా వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా రాజకీయాల చుట్టూ ఉన్న పందేలు కావటంతో నేతలే కీలకంగా వ్యవహరిస్తున్నారు. కేవలం విజయవాడ నగర పరిధిలోనే టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి, వైసీపీకి చెందిన సుమారు వంద మందికిపైగా నేతలు బెట్టింగ్ వ్యవహారానికి కేంద్రంగా మారడం గమనార్హం.

● మధ్యవర్తులకు మంచి గిరాకీ

ఈసారి బెట్టింగ్ కాసేవారు పక్కాగా వ్యవహరిస్తున్నారు. బెట్టింగ్‌కు ముందుకు వచ్చిన వారు ముందుగా ఓ ఒప్పందం పత్రం రాసుకుంటున్నారు. ఇద్దరూ కలిసి ఒక నమ్మకమైన వ్యక్తి దగ్గర బెట్టింగ్ మొత్తాన్ని ఉంచుతున్నారు. ఫలితం తేలిన తర్వాత ఆ వ్యక్తి ఒప్పందం ఆధారంగా నగదును ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా మధ్యవర్తులుగా ఉన్నవారికీ భారీగానే గిట్టుబాటు అవుతోంది. పందెం మొత్తంలో 5 నుంచి 10 శాతం కమీషన్ రూపేణా మధ్యవర్తులకు అందజేస్తున్నారు. రెండు జిల్లాల్లో ఇప్పటికే సుమారు రూ.100 కోట్ల మేర బెట్టింగ్ జరుగుతున్నట్లు అంచనా. ఫలితాలు వెలువడే తేదీ అయిన జూన్ 4 నాటికి ఈ బెట్టింగ్‌ల మొత్తం రూ.500 కోట్లకు చేరే అవకాశం ఉందని సమాచారం.

ఎవరి లెక్కల్లో వారు!

ఓట్ల లెక్కల్లో తలమునకలైన ప్రధాన పార్టీల అభ్యర్థులు



ఎన్నికల ఘట్టంలో కీలకమైన పోలింగ్ ప్రక్రియ ముగిసింది. తుది అంకమైన కౌంటింగ్‌కు 19 రోజులు ఉంది. జూన్ 4న ఓట్ల లెక్కింపు పూర్తయితే కానీ ఎవరి భవిష్యత్తు ఏమిటనేది తేటతెల్లమవ్వదు. అయితే పోలింగ్ సరళి.. ఓటర్ల అభిప్రాయాలను ఆధారంగా చేసుకుని ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరి లెక్కల్లో వారు మునిగితేలుతున్నారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని 2 పార్లమెంటు, 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల తరపున పోటీ చేసిన అభ్యర్థులు మండలాలు.. గ్రామాల వారీగా ఓటింగ్ సరళిని తెప్పించుకుని ఎవరెవరికి ఎన్ని ఓట్లు పడ్డాయనే విశ్లేషణ చేసుకుంటున్నారు. పోలింగ్ శాతం గత ఎన్నికల కన్నా పెరిగిన నేపథ్యంలో పెరిగిన ఓట్లు ఎవరికి పడ్డాయన్న అంచనాలు వేసుకుంటున్నారు.

- మండలాలు.. గ్రామాల వారీగా విశ్లేషణ
- విజయవాడలో పెరిగిన పోలింగ్ శాతం
- టీడీపీ వైపు మొగ్గిన ఎన్ఆర్ఐలు, పొరుగు రాష్ట్రాల ఓటర్లు
- మెజారిటీలపైనా అభ్యర్థుల మల్లగుల్లాలు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడ పార్లమెంటు పరిధిలో 79.36 శాతం ఓటింగ్ నమోదైంది. కృష్ణా జిల్లాలో 84.45 శాతం ఓటింగ్ నమోదైంది. ఈసారి విదేశాల్లో ఉన్న వారు, పొరుగు రాష్ట్రాల్లో ఉన్నవారు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వీరి ఓట్లతోపాటు ప్రభుత్వ వ్యతిరేక ఓటు కలిసి పోలింగ్ శాతం గణనీయంగా పెరిగిందని భావిస్తున్నారు. తొలి సారి ఓటు వినియోగించుకున్న వారి సంఖ్య కూడా ఈసారి బాగా పెరిగింది. ఇవన్నీ ఎవరికి కలిసి వస్తాయన్న విశ్లేషణలు జోరుగా సాగుతున్నాయి. విజయవాడ నగరంలో మూడు నియోజకవర్గాలు ఉండగా సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో ఓటింగ్ శాతం గతంలో కన్నా గణనీయంగా పెరిగింది. ఇక్కడ వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన వెలంపల్లి శ్రీనివాసరావు.. పెరిగిన ఓటింగ్ తమ ప్రభుత్వ పథకాలకు మెచ్చి వచ్చిందని లెక్కలు వేసుకుంటున్నారు. మహిళలు పెద్ద ఎత్తున జగన్ ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారని అందుకే ఓటింగ్ శాతం ఈ స్థాయిలో పెరిగిందని వైసీపీ శిబిరం భావిస్తోంది. అయితే ప్రభుత్వంపై వ్యతిరేకతతో గతంలో ఓటు వేయడానికి బయటకు రాని మధ్య, ఎగువ మధ్యతరగతి వర్గాలు భారీగా రావడం వల్లే ఓటింగ్ శాతం పెరిగిందని టీడీపీ అభ్యర్థి బొండా ఉమా శిబిరం లెక్కలు వేస్తోంది. మహిళల్లో కూడా ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రస్థాయిలో ఉందని తప్పకుండా పెరిగిన ఓట్లు తమకే పడతాయని టీడీపీ నాయకులు చెబుతున్నారు.

- విజయవాడ పశ్చిమలో ముస్లిం ఓటర్లు కీలకంగా ఉంటారు. ఈసారి వారంతా పార్టీలకతీతంగా వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆసిఫ్‌ను బలపర్చారన్న ప్రచారం జరుగుతోంది. దీంతో మిగిలిన ఓటర్లలో కీలకంగా ఉన్న బీసీల ఓట్లు ఎటువైపు పడ్డాయన్న దానిపై ఇక్కడ గెలుపు ఆధారపడి ఉంది. బీసీ ఓట్లతోపాటు మిగిలిన సామాజికవర్గాల ఓట్లలో అధికశాతం తమకే పడ్డాయని గెలుపు పక్కా అని బీజేపీ నాయకులు విశ్లేషిస్తున్నారు.
- రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షిస్తున్న విజయవాడ తూర్పులో గత ఎన్నికల్లో 67.50 శాతం ఓట్లు పోలవ్వగా ఈసారి గణనీయంగా పెరిగి 71.33 శాతం పోలయ్యాయి. విజయవాడ తూర్పులో.. ఎన్ఆర్ఐ ఓటర్లు, పొరుగురాష్ట్రాల నుంచి వచ్చిన వారు, తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్న వారు గణనీయంగా ఉన్నారు. వీరంతా టీడీపీ ఓటర్లేనని టీడీపీ నాయకులు విశ్లేషిస్తున్నారు. గతంలో వైసీపీకి కొమ్ముకాసిన కృష్ణలంక, గుణదల వంటి ప్రాంతాల్లోనూ ఈసారి టీడీపీ ఆధిక్యం సాధిస్తుందని లెక్కలు వేస్తున్నారు.
- పామర్రు నియోజకవర్గంలోని పెదపారుపూడి, మొవ్వ మండలాలకు ఈసారి ఎన్ఆర్ఐ ఓటర్లు, పొరుగు రాష్ట్రాల్లో ఉన్న ఓటర్లు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వీరంతా టీడీపీ ఓటర్లని, వీరితోపాటు ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో తమ గెలుపు ఖాయమని టీడీపీ నాయకులు విశ్లేషిస్తున్నారు. అయితే తోట్లవల్లూరు, పామర్రు పట్టణం, మొవ్వ తదితర మండలాల్లో వైసీపీకి మంచి పట్టు ఉందని, ఆయా మండలాల్లో తిరుగులేని ఆధిక్యాన్ని సాధిస్తామని, పెదపారుపూడి, పమిడిముక్కల్లో గతంలో కన్నా మెజారిటీ తగ్గినా మొత్తం మీద గెలుపు తమదేనని వైసీపీ నాయకులు లెక్కలు వేస్తున్నారు.
- గుడివాడ, గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో వార్ వన్‌సైడ్ జరిగిందని టీడీపీ నాయకులు భావిస్తున్నారు. ఈ మూడు నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్థులుగా నిలబడిన కొడాలి నాని, వల్లభనేని వంశీ, జోగి రమేశ్ వ్యక్తిగతంగా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకున్నారు. దీంతో వైసీపీ ప్రభుత్వ పథకాలు కూడా వీరిని గట్టెక్కించలేవన్నది విశ్లేషకుల అభిప్రాయం.
- మచిలీపట్నం నియోజకవర్గంలో మహిళలు గంపగుత్తగా తమకే వేశారని వైసీపీ నాయకుడు ఒకరు వ్యాఖ్యానించారు. ఈసారి మహిళలే తము గెలిపించనున్నారని ఆయన వ్యాఖ్యానించారు. అయితే ఈ వాదనను టీడీపీ నాయకులు కొట్టేస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు సైలెంట్ ఓటింగ్‌గా మారి వైసీపీ పునాదులు కూల్చేయనుందని వారు చెబుతున్నారు.
- అవనిగడ్డలో గతంలో కన్నా ఓటింగ్ శాతం తగ్గింది. ఇది దేనికి సంకేతమన్నదానిపై ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. 2019లో 88.11 శాతం ఓట్లు పోలవ్వగా ఈసారి కేవలం 86 శాతమే పోలయ్యాయి. జనసేన ఇక్కడ సునామీ సృష్టించబోతోందన్నది ఆ పార్టీ నాయకుల అంచనా.
- మైలవరంలో కూడా గతంలో కన్నా ఓటింగ్ తగ్గింది. గత ఎన్నికల్లో 89.60 శాతం ఓట్లు పోలవ్వగా ఈసారి 85.36కి పడిపోయింది. గత ఎన్నికల్లో వైసీపీకి వేసిన వారు ఈసారి అంతగా ఆసక్తి చూపకపోవడం వల్లే పోలింగ్ శాతం తగ్గిందని ఇక్కడ టీడీపీ నాయకులు విశ్లేషిస్తున్నారు. సోమవారం ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు పోటెత్తిన ఓటర్లంతా ప్రభుత్వ వ్యతిరేక ఓటర్లేనని గెలుపు తమదేనని టీడీపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



బస్టాండ్‌లో నిరీక్షణ

కిటకిట!



సీటు లేక నిలబడి



సీటు పాట్లు



రైలు కోసం ఎదురుచూపులు

ఓట్ల పండుగ ముగిసింది. బెంగళూరు, చెన్నయ్, హైదరాబాద్‌లతోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్ల తిరుగు పయనమయ్యారు. బస్సులు, రైళ్లలో వెళ్లే ప్రయాణికులతో నగరంలోని ప్రధాన బస్టాండ్, రైల్వేస్టేషన్ మంగళవారం కిక్కిరిసిపోయాయి. బస్సులు సరిపోక ప్రయాణికులు బస్టాండ్ ఆవరణలో నిరీక్షించాల్సి వచ్చింది. రైళ్లు కూడా ప్రయాణికులతో కిటకిటాలడాయి. బోగీలో నిలబడే చోటు కూడా లేక నానా అవస్థలు పడుతూ గమ్య స్థానాలకు చేరారు.



నిందితులకే కొమ్ముకాస్తారా..

- బాలికపై అత్యాచార యత్నం కేసులో పోలీసుల తీరుపై టీడీపీ నేతల ఆగ్రహం
- స్టేషన్ ఎదుట బాలిక బంధువుల ఆందోళన

- 6లో..



దుకాణం వద్ద ఏర్పాటు చేసిన బ్యానర్

ఓటు అమ్ముకున్న వారికి వస్తువులు అమ్మబడవు

» గుడివాడలో వెలిసిన వినూత్న బ్యానర్

గుడివాడ : ఓటు అమ్ముకోగా వచ్చిన సొమ్ముతో తన షాపులో వస్తువులు అమ్మబడవని గుడివాడకు చెందిన శ్రీసీతారామ రేడియో స్టోర్స్ అధినేత, భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపకులు వై.వి మురళీకృష్ణ తన దుకాణం వద్ద బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. ఓటర్లను చైతన్యపరుస్తూ ఆయన పట్టణంలో అనేక కార్యక్రమాలను చేపట్టారు. అవినీతి సొమ్ముతో రాజకీయ నేతలు పంచిన సొమ్ములతో తన వద్దకు వస్తువులు కొనడానికి రావద్దని ఏర్పాటు చేశారు. కష్టపడి సంపాదించిన సొమ్ముతోను తన దుకాణంలో కొనాలని కోరారు. ఇలాంటి వారికి ఎటువంటి లాభాపేక్ష లేకుండా వస్తువులను అమ్ముతానని మురళీకృష్ణ పేర్కొన్నారు.



కుటుంబసభ్యులతో గుడివాడ టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము

కుటుంబసభ్యులతో వెనిగండ్ల..

100 రోజులకు పైగా నిర్విరామంగా ఎన్నికల సంగ్రామంలో తలమునకలై ప్రజాబాహుళ్యంలో ఉంటూ ప్రశాంతంగా ఎన్నికలు పూర్తిచేసుకొని మంగళవారం కుటుంబ సభ్యులతో వెనిగండ్ల రాము కాస్త సేదతీరారు. గుడివాడలో తనకు సహకరించిన పార్టీ శ్రేణులతో కాసేపు ముచ్చటించిన తర్వాత కుటుంబ సభ్యులతో సహపంక్తి భోజనం చేసి సరదాగా గడిపారు.

జిల్లాలో క్లీన్ స్వీప్ సాధిస్తాం : నెట్టెం రఘురాం



జగ్గయ్యపేట : ఎన్టీఆర్ జిల్లా అసెంబ్లీ స్థానాలతో పాటు, విజయవాడ పార్లమెంట్‌ను గెలుచుకుంటామని పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం ధీమా వ్యక్తం చేశారు. ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభంజనం కనబడిందని, ప్రజా వ్యతిరేకత స్పష్టంగా గోచరించిందని, సోమవారం ఉదయం నుంచి ప్రజలు బారులు తీరటం, మహిళలు పోలింగ్ లో పురుషులతో దీటుగా పాల్గొనటం శుభపరిణామమన్నారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి 150కి పైగా స్థానాలు గెలుచుకుని చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేయటం ఖాయమన్నారు.



పెడన ఉమ్మడి అభ్యర్థి కాగితకు అభినందనలు తెలుపుతున్న అభిమానులు

కాగిత ఇంట అభిమానుల సందడి..

బంటుమిల్లి: పెడన నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ ఇంటి వద్ద మంగళవారం ఉదయం నుండి అభిమానులు నాయకులు, కార్యకర్తలతో కోలాహలంగా ఉంది. పెడనకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు ఊటుకూరు మోహనరావు, పోతలంక నాగేశ్వరరావులు కాగితను ఘనంగా సన్మానించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎలాంటి భయం లేదని నిర్భయంగా ఉండమని తెలిపారు. అదే విధంగా నాలుగు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎన్నికల సరళిని వివరించారు. ఎన్డీఏకు మద్దతుగా వస్తున్న సర్వేలపై చర్చించారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో విశ్వభారతి వైజ్‌వుడ్స్ ప్రభంజనం



ఎ.జాహ్నవి



జి.వర్షిణి

గుడివాడ : సీబీఎస్ఈ-2024 పదో తరగతి, ప్లస్ టూ ఫలితాల్లో విశ్వభారతి వైజ్‌వుడ్స్ పాఠశాల అద్భుత ఫలితాలను సాధించినట్లు పాఠశాల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి ఫలితాల్లో జి.వర్షిణి 487/500 మార్కులు, ప్లస్ టూ ఫలితాల్లో ఆలపాటి జాహ్నవి 475/500 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ఉపాధ్యాయుల కృషితో విద్యార్థులు ఇంతటి ఘనవిజయాన్ని సాధించారని పొట్లూరి కొనియాడారు.

» జూన్ 4 వరకు స్ట్రాంగ్ రూముల్లో మూడంచెల భద్రత

» ఇబ్రహీంపట్నం, జూపూడిలోని నోవా, నిమ్రా కళాశాలలకు తరలింపు

» నాలుగు భవనాల్లో 27 స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలు నిక్షిప్తం

» పర్యవేక్షించిన జనరల్ అబ్జర్వర్ మంజూ రాజ్‌పాల్, కలెక్టర్ ఢిల్లీరావు



స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు



అధికారుల సమక్షంలో స్ట్రాంగ్ రూములకు సీలు వేస్తున్న ఎన్నికల సిబ్బంది



స్ట్రాంగ్ రూముల వద్ద సాయుధ బలగాల పహారా

ప్రజా తీర్పు భద్రం

విజయవాడ/ఇబ్రహీంపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికలు-2024 నిర్ణయాత్మక ప్రజా తీర్పును స్ట్రాంగ్ రూముల్లో ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల యంత్రాంగం భద్రపరిచింది. ఇబ్రహీంపట్నం, జూపూడిలోని నిమ్రా, నోవా కళాశాలల్లో మొత్తం నాలుగు భవనాల్లో 27 స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలను భద్రపరిచారు. ప్రజా తీర్పు నిక్షిప్తమై ఉన్న ఈవీఎంలను అత్యంత భద్రత నడుమ సోమవారం పోలింగ్ ముగిసిన తర్వాత రిసెప్షన్ సెంటర్లకు తరలించారు. అక్కడి నుంచి ప్రధాన స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. సోమవారం అర్ధరాత్రి వరకు పలు నియోజకవర్గాలలో పోలింగ్ కొనసాగటం వల్ల ఈవీఎంలను రిసెప్షన్ సెంటర్లలో ఉన్న స్ట్రాంగ్ రూమ్‌లలోనే అత్యంత భద్రత నడుమ ఉంచారు. మంగళవారం మధ్యాహ్నం వరకు ఆయా రిసెప్షన్ సెంటర్ల నుంచి ప్రధాన స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంలను తరలించారు. నియోజకవర్గాల వారీగా చూస్తే తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నోవా ఇంజనీరింగ్ కాలేజీలోని ఇంజనీరింగ్ బ్లాక్, బిల్డింగ్-2లోని స్ట్రాంగ్ రూములో ఈవీఎంలను భద్రపరిచారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ఈవీఎంలను నోవా కాలేజీలోని ఇంజనీరింగ్ బ్లాక్ , బిల్డింగ్-2లో భద్ర పరిచారు. సెంట్రల్ నియోజకవర్గంలోని ఈవీఎంలను నోవా ఇంజనీరింగ్ కాలేజీలోని మెకానికల్ బ్లాక్, బిల్డింగ్-1 లో భద్రపరిచారు. తూర్పు నియోజకవర్గానికి చెందిన ఈవీఎంలను నిమ్రా ఇంజనీరింగ్ కాలేజీలోని బిల్డింగ్-3 లో భద్రపరిచారు. మైలవరం నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను నిమ్రా మెడికల్ కాలేజీలో మెడికల్ బ్లాక్‌లోని బిల్డింగ్-4లో భద్రపరిచారు. జగ్గయ్యపేట నియోజకవర్గానికి చెందిన ఈవీఎంలను నిమ్రా ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన బిల్డింగ్-3లో భద్రపరిచారు. ఆయా స్ట్రాంగ్‌రూముల్లో ఈవీఎంలను భద్రపరిచే కార్యక్రమాన్ని జిల్లా జనరల్ అబ్జర్వర్ మంజూ రాజ్‌పాల్, జిల్లా ఎన్నికల అధికారి ఢిల్లీరావులు పర్యవేక్షించారు. స్ట్రాంగ్ రూములకు సింగిల్ డోర్, సింగిల్ కిటికీలు, సింగిల్ వెంటిలేటర్లు ఉన్న రూములనే ఎంచుకున్నారు. ప్రతి స్ట్రాంగ్ రూముకు కూడా డబుల్ లాకింగ్ ఉండేలా చర్యలు తీసుకున్నారు. షార్ట్ సర్క్యూట్ వంటివి జరగకుండా ఉండటానికి చర్యలు తీసుకున్నారు. వర్షాలు కురిస్తే లీకేజీల కారణంగా సమస్యలు రాకుండా చర్యలు చేపట్టారు. ప్రతి స్ట్రాంగ్ రూమ్‌కు వేసే తాళాల చెవులలో ఒకటి కలెక్టర్ ప్రతినిధి దగ్గర, ఒకటి ఆర్వో వద్ద ఉండేలా చర్యలు చేపట్టారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాల మేరకు తరచూ ఈవీఎంలు నిక్షిప్తం చేసిన స్ట్రాంగ్ రూములను రిటర్నింగ్ అధికారులు పరిశీలిస్తుంటారు.

విజయవాడ సెంట్రల్‌లో 7.23శాతం పెరిగిన ఓటింగ్

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : పోలింగ్ పూర్తయింది.. అభ్యర్థులు లెక్కలే తేల్చే పనిలో పడ్డారు. పోలింగ్‌కు ముందు ఒకలా.. పోలింగ్ తర్వాత మరోలా అంచనాలు ఉంటాయి. మంగళవారం నియోజకవర్గాల్లో బూత్‌ల వారీగా జరిగిన పోలింగ్ శాతం వివరాలు వెల్లడికావడంతో అభ్యర్థులు ఆయా బూత్ ఏజెంట్లు, వారికి సారధ్యం వ్యవహించిన నేతలతో సమావేశమయ్యారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో అనూహ్యంగా పోలింగ్ శాతం పెరిగింది. ఇది ఎవరికి లాభిస్తుందో అన్న విషయం చర్చనీయాంశంగా మారింది. సెంట్రల్‌లో 2019 ఎన్నికల్లో 65.73శాతం ఓట్లు పోలయ్యాయి. ఈసారి 72.96శాతం నమోదై 7.23శాతం పోలింగ్ పెరిగింది.

ఎవరి లెక్కలు వారివి..

సెంట్రల్ నియోజకవర్గంలో అభ్యర్థులు స్వల్ప ఓట్లతో గట్టెక్కడం ఆనవాయితీగా వస్తోంది. 2019లో వైసీపీ తరపున మల్లాది విష్ణువర్ధన్, టీడీపీ తరపున బొండా ఉమామహేశ్వరరావు పోటీచేయగా ఉమాపై విష్ణు 25ఓట్ల తేడాతో విజయం సాధించారు. ప్రస్తుతం వైసీపీ నుంచి మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, టీడీపీ నుంచి బొండా ఉమామహేశ్వరరావు పోటీ చేశారు. ఇండియా కూటమి అభ్యర్థిగా సీహెచ్ బాబూరావు (సీపీఎం) పోటీలో ఉన్నారు. ప్రధాన పోటీ వైసీపీ, టీడీపీ మధ్య ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. అభ్యర్థుల గెలుపు విషయంలో ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన ఓటింగ్ శాతం తమకే అనుకూలంగా ఉంటుందని నేతలు భావిస్తున్నారు. విజయవాడ సెంట్రల్ క్లిష్టతరమైన నియోజకవర్గం కావడంతో ఈసీ అన్ని పోలింగ్ కేంద్రాల్లోను వెబ్‌క్యాస్టింగ్ ఏర్పాటు చేసింది. 2014లో 65.20శాతం నమోదు కాగా, 2019లో 65.73శాతం నమోదైంది. ఈసారి 72.96శాతం పోలింగ్ నమోదైంది. ప్రభుత్వంపై వ్యతిరేత కారణంగానే ఓటర్లు ఈస్థాయిలో పోటెత్తారని టీడీపీ విశ్వసిస్తోంది. నియోజకవర్గ ఓటర్లు తమ మనసులోని భావన ఎక్కడా బయట పడకుండా జాగ్రత్త పడ్డారు. ఓటరు నాడి మరికొద్ది రోజుల్లో తేలిపోనుంది.

గెలుపెవరిది?



నందిగామలో మల్లగుల్లాలు!

» కూడికలు, తీసివేతల్లో నాయకులు

(కంచికచర్ల) : నందిగామ నియోజకవర్గంలో గెలుపు తమదేనంటూ ప్రధాన పార్టీల అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అన్నివర్గాల్లో మేజార్టీ ఓట్లు తమకే పడ్డాయని, సైలెంట్ ఓటింగ్ తమకే అనుకూలంగా ఉందని ఎవరికి వారే చెప్పుకుంటున్నారు. గ్రామ నాయకుల పోలింగ్ గణాంకాలు.. ముఖ్య నేతల కూడికలు, తీసివేతల్లో నిమగ్నమయ్యారు. నియోజకవర్గంలో 87.56 శాతం పోలింగ్ జరగ్గా.. మొత్తం 2,05,480 ఓట్లకుగాను 1,79,914 ఓట్లు పోలయ్యాయి. 2019 ఎన్నికల్లో 87.95 శాతం పోలింగ్ జరగ్గా, ఈసారి స్వల్పంగా 0.4 శాతం తగ్గింది. ఈ ఎన్నికల్లో అన్నివర్గాల ఓటర్లు ఉదయం ఆరు గంటలకే పోలింగ్ కేంద్రాలకు వెల్లువలా తరలివచ్చారు. పురుషులకు దీటుగా మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కంచికచర్ల సత్రంబడి, వీరులపాడు మండలం గూడెం మాధవరం, అనాసాగరం, నందిగామలో కొన్ని కేంద్రాల్లో రాత్రి పొద్దుపోయినప్పటికీ ఓటు వేశారు. తొలిసారిగా ఓటు హక్కు పొందిన యువత ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొన్నారు. మార్పు, అభివృద్ధి కోసం ఓటేసినట్టుగా యువ ఓటర్లు పేర్కొన్నారు.

ప్రధాన పార్టీల మధ్యే పోటీ..

నియోజకవర్గంలో తొమ్మిది మంది అభ్యర్థులు ఉన్నప్పటికీ ప్రధాన పార్టీలైన తెలుగుదేశం, వైసీపీ మధ్యే పోటీ నెలకొంది. టీడీపీ అభ్యర్థిగా తంగిరాల సౌమ్య, వైసీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు గెలుపుపై గట్టి ధీమాతో ఉన్నారు. కనిష్ఠంగా ఐదువేలకు తగ్గకుండా మెజార్టీ వస్తుందని ఇరు పార్టీల నేతలు చెబుతున్నారు.

ఎవరి ధీమా వారిదే..

నందిగామ, కంచికచర్ల, చందర్లపాడు మండలాల్లో అధిక్యత మెజారిటీ వస్తుందని, వీరులపాడు మండలంలో బ్యాలెన్స్ అవుతుందని టీడీపీ నేతలు లెక్కలు వేస్తున్నారు. రైతులు, మహిళలు, వృద్ధులు, అన్ని వర్గాల ఓటర్లు సైకిల్‌ను ఆదరించారని చెబుతున్నారు. దీంతో టీడీపీ శిబిరంలో రెట్టింపు ఉత్సాహం నెలకొంది. ఇదిలా ఉంటే గెలుపు ఖాయమని, మరోసారి ఓటర్లు తమనే ఆదరించారని వైసీపీ నాయకులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు కనపడలేదని చెపుతున్నారు. వీరులపాడు మండలంలో మెజారిటీ వస్తుందని, కంచికచర్ల, చందరర్లపాడు మండలాల్లో బ్యాలెన్స్ అవుతుందని, నందిగామ మండలంలో కొద్దిగా మైనస్ వచ్చినప్పటికీ గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

కృష్ణా జిల్లాలో ఈవీఎంలు భద్రం..

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృష్ణా జిల్లాలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమై ఉంది. ఫలితాలకు 19రోజుల వరకు వేచిచూడాలి. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ పూర్తయిన తరువాత ఈవీఎంలు, ఇతరత్రా పత్రాలను ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు. పోలీసులు భద్రంగా కృష్ణాయూనివర్సిటీకి తరలించారు. మంగళవారం ఉదయం ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచే కార్యక్రమం కొనసాగింది. కలెక్టర్ డీకే బాలాజీ పర్యవేక్షణలోఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌లకు వేసిన తాళాలపై సీళ్ల వేశారు. మిలటరీ దళాల పర్యవేక్షణలోకి వెళ్లింది.

జిల్లాలో పోలింగ్‌శాతం 84.45 నమోదు

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో తక్కువగా ఓటర్లు ఉన్న పెడన నియోజకవర్గంలో 88.57 అత్యధికంగా పోలింగ్‌శాతం నమోదైంది. అధికంగా ఓటర్లు ఉన్న పెనమలూరు నియోజకవర్గంలో 79.14శాతం మేర పోలింగ్ నమోదైంది.

ఎన్టీఆర్ జిల్లాలో ఓటు వేయని వారు 3,51,666 మంది

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 17,04,077 మంది ఓటర్లకు గాను సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు-2024లో 13,52,411 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 3,51,666 మంది ఓటుకు దూరంగా ఉన్నారు. ఈ ఎన్నికలలో 85శాతం మేర పోలింగ్ నమోదవుతుందనుకుంటే.. 79.36 శాతం మాత్రమే నమోదైంది. ఈసారి బయటి నుంచి వచ్చిన వారి ఓటింగ్ శాతం పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో గణనీయంగా ఓటర్ల అనాసక్తి వల్ల కూడా ఈ ప్రభావం కనిపిస్తోంది.

ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా పోలింగ్ శాతం

నియోజకవర్గం	2019	2024	వ్యత్యాసం
తిరువూరు	86.07	87.63	+ 1.56
విజయవాడ వెస్ట్	66.17	66.46	+ 0.29
విజయవాడ సెంట్రల్	65.73	72.96	+ 7.23
విజయవాడ ఈస్ట్	67.50	71.33	+ 3.83
మైలవరం	89.60	85.36	- 4.24
నందిగామ	88.01	87.56	- 0.45
జగ్గయ్యపేట	89.53	89.88	- 0.35
మొత్తం	78.94	79.36	+ 0.42

కృష్ణా జిల్లా వ్యాప్తంగా పోలింగ్ శాతం

గన్నవరం	85.57	84.88	- 0.69
గుడివాడ	80.57	82.51	+ 1.94
పెడన	87.74	88.57	+ 0.83
మచిలీపట్నం	80.78	81.91	+ 1.13
అవనిగడ్డ	88.92	86	- 2.92
పామర్రు	87.16	88.11	+ 0.95
పెనమలూరు	79.88	79.14	- 0.74
మొత్తం	84.36	84.45	+ 0.09



పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న బాలిక బంధువులు, కొలికపూడి శ్రీనివాసరావు

నిందితులకే కొమ్ముకాస్తారా..


» బాలికపై అత్యాచార యత్నం కేసులో

పోలీసుల తీరుపై టీడీపీ నేతల ఆగ్రహం

» స్టేషన్ ఎదుట బాలిక బంధువుల ఆందోళన

ఎ.కొండూరు, మే 14 : బాలికపై అత్యాచార యత్నం చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేయకపోగా అతడ్ని ఆసుపత్రికి వెళ్లమని సలహా ఇచ్చి కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహించి తిరువూరు కూటమి అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు బాధితులతో కలిసి మంగళవారం రాత్రి ఎ.కొండూరు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. రామచంద్రాపురానికి చెందిన బాలిక (11) స్థానిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. సోమవారం సాయంత్రం కుటుంబసభ్యులు ఓటు వేసేందుకు వెళ్లగా ఇంటి పక్కనే ఉంటున్న మల్లాది చిలకారావు (22) బాలికను చేయిపట్టుకొని పక్కనే ఉన్న ఇంట్లోకి లాకెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. బాలిక పెద్దగా కేకలు వేయడంతో అక్కడ్నుంచి పరారయ్యాడు. జరిగిన విషయం బాలిక తల్లికి తెలపగా వారు చిలకారావును ప్రశ్నించారు. నిందితుడి కుటుంబసభ్యులు బాధితురాలి కుటుంబసభ్యులతో కర్రలతో దాడి పాల్పడ్డారు. దాడిలో తిరుపతిరావు, దుర్గారావు, సాయికుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారు. ఘటన జరిగి 24 గంటలైనా సకాలంలో పోలీసులు స్పందించకపోవడంతో స్థానిక టీడీపీ నేత కొలికపూడి శ్రీనివాసరావు బాధితులతో కలిసి పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు నిందితునిపైన, దాడి చేసిన వారిపైన కేసులు నమోదు చేసి చర్యలు తీసుకునేందుకు పూనుకున్నారు. కార్యక్రమంలో పిట్టా చైతన్య, హరిబాబు, డేవిడ్‌రాజు, చందు, పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లింగగూడెంలో యువకుడిపై దాడి



జగ్గయ్యపేట/పెనుగంచిప్రోలు, మే 14 : పెనుగంచిప్రోలు మండలం లింగ గూడెంలో గ్రామానికి చెందిన రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ మంగళవారం ఉద్రిక్తతకు దారితీసింది. వెంటనే స్పందించిన పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొప్పి ఆకాశ్ (25)పెనుగంచిప్రోలు వెళ్లి తిరిగి బైక్‌పై వస్తుండగా, అదే దారిలో వస్తున్న గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త గాదె పాండురంగారావు (27) హారన్ కొట్టాడు. దారివ్వకపోవడంతో దుర్భాషలాడాడు. ఆకాశ్ ప్రతిఘటించడంతో పాండురంగారావు తన సామాజికవర్గానికి చెందిన వ్యక్తులను పిలిపించి ఆకాశ్‌పై సామూహికంగా దాడి చేశారు. ఆకాశ్ బంధువులు అక్కడకు చేరుకుని పాండు రంగారావు వర్గీయులపై దాడికి ప్రయత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు రెండు వర్గాలవారిని చెదరగొట్టారు. ఆకాశ్ ఫిర్యాదుపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

కూటమి అభ్యర్థుల విజయం తథ్యం

» వల్లభనేని బాలశౌరి, కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మే 14 : వైసీపీ నేతలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా, కూటమి కార్యకర్తలపై దాడులకు పాల్పడినా ఎన్నికలు సజావుగా జరిగాయని, దీనికి పార్టీశ్రేణుల సహకారం అభినందనీయమని మచిలీపట్నం పార్లమెంటు నియోజక ఉమ్మడి అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, అసెంబ్లీ నియోజక వర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఓటమి భయంతో జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలపై పేర్ని నాని అనుయాయులు దాడులు జరిపించారని వల్లభనేని బాలశౌరి ఆరోపించారు. వైసీపీ నాయకులు రెచ్చగొడుతున్నా కూటమి శ్రేణులు ఏ విధమైన వాగ్వివాదాలకు దిగకుండా పోలింగ్ ప్రశాతంగా జరిగేందుకు సహకరించారన్నారు. ఓటర్లు కసితో కూటమి అభ్యర్థులకు ఓటు వేసారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకిచ్చిన వాగ్దానాలను నెరవేరుస్తామన్నారు. పార్లమెంటు పరిధిలో 83 పోలింగ్ శాతం నమోదుకావడం ఉమ్మడి అభ్యర్థుల విజయానికి సంకేతమన్నారు. కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, పోలింగ్ ప్రారంభానికి గంట ముందు వచ్చి, రాత్రి 11 గంటల వరకు కొన్ని కేంద్రాల్లో ఓటర్లు ఓటు వేశారన్నారు. రాష్ట్రాలు దాటి ఉమ్మడి అభ్యర్థులకు ఓటు వేసేందుకు యువత పెద్ద సంఖ్యలో తరలి వచ్చారన్నారు. సుదూర ప్రాంతాల నుంచి లక్షలు ఖర్చు పెట్టి వచ్చారన్నారు. ఎన్ఆర్ఐ కటకం విజయమణి ఓటు వేసేందుకు వచ్చి గుండెపోటుతో మృతిచెందడం బాధాకరమన్నారు. గొడుగుపేట తదితర ప్రాంతాల్లో ఓటు వేసేందుకు మహిళలు రాత్రి 11 గంటల వరకు వేచి ఉండటం అభినందించదగ్గ విషయమన్నారు. పేర్ని కిట్టు అనుచరులు పోలింగ్ కేంద్రాల వద్ద అల్లర్లు చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారన్నారు. ప్రలోభాలకు తలొగ్గకుండా ప్రజలు స్వచ్ఛమైన తీర్పు ఇచ్చారని, జూన్ 4వ తేదీన ఉమ్మడి అభ్యర్థులు రాష్ట్ర వ్యాప్తంగా అధికారంలోకి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో కొనకళ్ల బుల్లయ్య, జనసేన ఇన్‌చార్జి బండి రామకృష్ణ, గోపు సత్యనారాయణ, మోటమర్రి బాబాప్రసాద్, లంకే నారాయణ ప్రసాద్, పిప్పళ్ల కాంతారావు, గుమ్మడి విద్యాసాగర్, వేము కోటేశ్వరరావు, వాలిశెట్టి తిరుమలరావు, జనసేన నాయకులు మాదివాడ రాము, వంపుగడల చౌదరి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కూటమి నేతలు

కేడీసీఏ క్రికెట్ సెలక్షన్స్‌కు అనూహ్య స్పందన



భవానీపురం, మే 14 : నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో మంగళవారం జరిగిన ఉమ్మడి కృష్ణా క్రికెట్ సెలక్షన్స్‌కు క్రీడాకారుల నుంచి అనూహ్య స్పందన లభించింది. అడహాక్ కమిటీ ఛైర్మన్ టి. త్రినాథ్‌రాజు ఆధ్వర్యంలో జరిగిన అండర్-19 సెలక్షన్స్‌కు 138 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అందుల్లోంచి 65 మందితో షార్ట్ లిస్ట్ తీశారు. వీర్ని నాలుగు టీమ్‌లుగా విభజించి మ్యాచ్‌లు నిర్వహించి వారి నుంచి ఫైనల్ జట్టును ఎంపిక చేస్తామని త్రినాథ్‌రాజు తెలిపారు. కన్వీనర్ శంకర్, కేడీసీఏ హెడ్ విజయ సారథి, కోచ్‌లు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌తో పెరిగిన ఓటింగ్

- సెంట్రల్‌లో అదే కారణమంటున్న రాజకీయ విశ్లేషకులు
- బొండా ఉమా గెలుపుపై నడుస్తున్న పందేలు

అజిత్‌సింగ్‌నగర్, మే 14 : తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రకటించిన 'సూపర్ సిక్స్' ఎన్నికల మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకున్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో పెరిగిన పోలింగ్ శాతాలే దీనికి నిదర్శనమని, ఖచ్చితంగా కూటమి గెలుపు తథ్యమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక సెంట్రల్ నియోజకవర్గానికి వస్తే కూటమి అభ్యర్థి బొండా ఉమా విజయం ఖాయమైనట్లుగా నిర్ధారించుకుంటూ పందెం రాయుళ్లు ఏకంగా కూటమి మెజార్టీ గురించే మాట్లాడుకోవడం ప్రస్తుతం నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా వినిపిస్తోంది.

● నియోజకవర్గ చరిత్రలో ఇదే అధికం

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం 2009లో ఏర్పడింది. తొలిసారి జరిగిన ఎన్నికల్లో మొత్తం 2,23,822 ఓట్లు ఉండగా వాటిలో 70.71 శాతం అంటే 1,58,267 ఓట్లు పోలయ్యాయి. 2014 ఎన్నికల్లో మొత్తం 2,59,001 ఓట్లకు గాను 1,78,013 ఓట్లు పోలై 65.95 శాతం వచ్చింది. 2019 ఎన్నికల్లో 2,69,912 ఓట్లకు గాను 1,78,013 ఓట్లు పోలై 65.95 శాతం వచ్చింది. తాజాగా జరిగిన ఎన్నికల్లో 2,77,724 ఓట్లకు గాను ఏకంగా 2,02,635 ఓట్లు పోలై 72.96 శాతం నమోదైంది.

గతంలో పోల్చుకుంటే దాదాపు 7 శాతానికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల సమయం ప్రారంభమైన ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు క్యూలైన్లలో ఓటర్లు బారులు తీరే కనిపించారు. నియోజకవర్గంలోని దాదాపు అన్ని బూతుల్లో రాత్రి 8 నుంచి 11 గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

● రాక్షస పాలనపై తిరగబడిన ఓటర్లు

వైసీపీ పాలనపై విసుగు చెందిన ఓటర్లంతా జగన్ ప్రభుత్వంపై ఉన్న అసహనంతో కసిగా ఓటు హక్కుని వినియోగించుకుని ఉంటారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. స్వతహాగా ఓటింగ్ శాతం పెరిగిన ప్రతి రాష్ట్రంలోను అధికార పార్టీపై వ్యతిరేకత ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో ఇలా నమోదైన రాష్ట్రంలో అక్కడ వచ్చిన ఫలితాలే దీనికి నిదర్శనంగా కనిపిస్తున్నాయి. అలాగే ఏపీలో కూడా ప్రజలు వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత ఉండటం, చంద్రబాబు, జనసేన, బీజేపీ కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్‌లోని పథకాలు ప్రజలను ఆకర్షించి ఉంటాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా కూటమి పథకాలలో ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, ప్రతి మహిళకు ఏటా రూ. 15 వేలు, ప్రతి విద్యార్థి తల్లికి రూ. 15 వేలు వంటి పథకాలు అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకున్నట్లు తెలుస్తోంది.

● లక్షల్లో నడుస్తున్న బెట్టింగ్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, సెంట్రల్‌లో బొండా ఉమాకు భారీ మెజారిటీ వస్తుందంటూ జోరుగా బెట్టింగులు జరుగుతున్నాయి. బొండా ఉమా గెలుపును కొంత మంది పందెం రాయుళ్లు ఖరారు చేసి మెజార్టీపై బెట్టింగ్‌లు అడుగుతున్నట్లు తెలుస్తుంది. ఖచ్చితంగా కూటమి భారీ విజయాన్ని సాధిస్తుందని, రాష్ట్రానికి, నియోజకవర్గానికి మంచి రోజులు రాబోతున్నాయని ప్రజలు సంపూర్ణ విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

మహమ్మదాలీపురం ఘటనలపై ఎన్నికల ముఖ్య అధికారికి టీడీపీ ఫిర్యాదు

వన్‌టౌన్, మే 14: పశ్చిమలో పోలింగ్ సందర్భంగా సోమవారం వించిపేటలోని మహమ్మదాలీపురం ఉర్దూ స్కూల్ పోలింగ్ కేంద్రంలో చోటు చేసుకున్న పరిణామాలపై టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మీర్జా ముజాఫర్ బేగ్ మంగళవారం రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారికి ఫిర్యాదు చేశారు. బూత్ 208లో సాయంత్రం 6గంటల సమయాన వైసీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ తన మందీమార్బలంతో భీతావహం సృష్టించారన్నారు. కోడ్ నిబంధనలకు విరుద్ధంగా ఆయన వ్యవహరించారని ఆరోపించారు. కూటమి అభ్యర్థికి చీఫ్ ఎలక్షన్ ఏజెంట్‌గా పనిచేస్తున్న ఎంఎస్ బేగ్ ఆసిఫ్‌ను ప్రశ్నించబోగా ఆయన అనుచరులు బేగ్ పైకి దూసుకువెళ్లారన్నారు. పోలీసులు మౌనంగా ఉండడం అనుమానాలకు తావిచ్చిందని చెప్పారు. దీనిపై సత్వరమే విచారణ జరపాలని బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఆసిఫ్, అనుచరులపై చర్యలు తీసుకోవాలి

● టీడీపీ మహిళల డిమాండ్

వన్‌టౌన్, మే 14: మహమ్మదాలీపురం స్కూల్ పోలింగ్ బూత్‌లో సోమవారం సాయంత్రం జరిగిన గొడవలో వైసీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్, అతని అనుచరగణం బ్లేడ్ బ్యాచ్‌పై చర్యలు తీసుకోవాలని టీడీపీ మహిళలు డిమాండ్ చేశారు. మంగళవారం టీడీపీ పశ్చిమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారంతా మాట్లాడారు. ప్రజాతీర్పు తమకు అనుకూలంగా లేదని ఓడిపోతున్నామనే విషయాన్ని గ్రహించిన వైసీపీ పశ్చిమ అభ్యర్థి ఆసిఫ్ మధ్యాహ్నం నుంచే నానాయాగీ చేయడం నీచాతినీచమైన చర్య అని వారన్నారు. ఆర్‌సీఎం స్కూల్ పోలింగ్ కేంద్రంలోకి ఆసిఫ్ అల్లుడు దూసుకువెళ్ళేందుకు ప్రయత్నించారన్నారు. అతని వెంట పంజాసెంటర్‌లో బిర్యానీ హోటల్ నిర్వహిస్తున్న మాజీ రౌడీషీటర్ కూడా ఉన్నారన్నారు. వించిపేట ఉర్దూ స్కూల్‌లో ఆసిఫ్ అనుచరులతో హంగామా చేయడం, ఎంఎస్ బేగ్‌పై దాడి చేయడానికి ప్రయత్నించారన్నారు. ఇందుకు బాధ్యులైన వారిపై ఎన్నికల ముఖ్య అధికారి చర్యలు తీసుకోవాలని కోరారు.

కామన్‌సైట్‌కు రక్షణ గోడ నిర్మాణం పూర్తి

● ఊర్మిళానగర్ ప్రజల హర్షం

భవానీపురం, మే 14 : 43వ డివిజన్‌లోని ఊర్మిళానగర్ కామన్‌సైట్‌కు రక్షణ గోడ నిర్మాణం ఎట్టకేలకు ఇటీవల పూర్తయ్యింది. ఇక్కడ ఐరన్‌యార్డు ఏర్పాటుతో రెండెకరాలపై వీఎంసీకి కామన్‌సైట్ దాఖలు పడింది. ఈ స్థలంపై కొద్దికాలంగా కబ్జాదారుల కన్నుపడింది. పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ అనుచరులు శత విధాలా ఈ స్థలంలో పాగా వేసేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకొన్నారు. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలతో స్పందించిన వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ రక్షణ గోడ(ప్రహరి నిర్మాణం)కు రూ.45 లక్షలు నిధులు మంజూరు చేశారు. దీంతో నాలుగు వైపులా అందంగా గోడ నిర్మాణం చేసి గేటు ఏర్పాటు చేసి వీఎంసీ సింబల్‌ను ముద్రించి, ఇది కార్పొరేషన్ స్థలం అంటూ పలుచోట్ల రాయించారు. కబ్జా నుంచి కోట్ల విలువైన స్థలాన్ని ప్రజల అవసరాలకు వినియోగపడేలా కమిషనర్ తుది నిర్ణయం తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఓటమి భయంతోనే దాడులు

● లుక్కా సాయిరాం గౌడ్

విద్యాధరపురం, మే 14: ఓటింగ్ సరళితోనే జగన్‌రెడ్డి ప్రభుత్వం చిత్తుగా ఓడిపోతుందన్నది స్పష్టమైందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కాసాయి రాం ప్రసాద్ గౌడ్ అన్నారు. ఆటోనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులవర్తినానిపై జరిగిన దాడిని ఆయన ఖండించారు. రాష్ట్రంలోని ప్రజలు పోలింగ్ బూత్‌ల వద్దకు పోటెత్తి ఓట్లు వేశారని 81.5శాతం మేరకు పోలింగ్ నమోదు కావడంతో జగన్‌రెడ్డి ప్రభుత్వం చిత్తుచిత్తుగా ఓడిపోతుందని తెలుసుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకులపైన, కార్యకర్తలపైన దాడులు చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో బీసీ నాయకుడు పామర్తి కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న పలువురు ప్రముఖులు



ద్వారకా తిరుమలరావుకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

వన్‌టౌన్, మే 14: దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో కనకదుర్గమ్మ దర్శనార్థం మంగళవారం ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు విచ్చేశారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. ఈవో కేఎస్ రామారావు ఆయనకు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు.

దేవదాయ కమిషనర్ సత్యనారాయణ



దుర్గమ్మను దర్శించుకున్న దేవదాయ కమిషనర్ సత్యనారాయణ

దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో దుర్గమ్మను మంగళవారం రాత్రి దేవదాయ కమిషనర్ సత్యనారాయణ దర్శించుకున్నారు. అధికారులు, అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దుర్గమ్మ దర్శనం అనంతరం ఆయనకు పండితులు ఆశీస్సులు అందచేశారు. ఈవో రామరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం శేషవస్త్రం అందచేశారు.

రేపు కానుకల లెక్కింపు

దుర్గగుడిలో భక్తులు హుండీల ద్వారా అమ్మవారికి సమర్పించిన కానుకలను గురువారం లెక్కించనున్నట్లు ఆలయ ఈవో కేఎస్ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం8 గంటలకు మహామండపంలోని ఆరవ అంతస్థులో లెక్కింపు జరుగుతుందన్నారు.

అత్యధిక మెజారిటీతో గెలుస్తా: సుజనా చౌదరి



సుజనా చౌదరిని సత్కరిస్తున్న కొణిజేటి రమేష్

విద్యాధరపురం, మే 14: పశ్చిమ నియోజకవర్గం నుంచి తాను అత్యధిక మెజారిటీతో గెలుస్తానని నియోజకవర్గం నుంచి కూటమి బలపరచిన బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన సుజనా చౌదరి అన్నారు. మంగళవారం భవానీపురంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతం కంటే నాలుగు నుంచి ఐదు శాతం ఓటింగ్ పెరిగిందని చెప్పారు. ప్రభుత్వం పట్ల ప్రజలలో వ్యతిరేకత ఉండడం వల్లే పోలింగ్ శాతం పెరిగిందని చెప్పారు. ఎక్కువ మంది ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని చెప్పారు. జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపులో తనకు భారీ మెజారిటీ లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ వేసవి తీక్షణత ఎక్కువగా ఉన్నప్పటికీ ఓటర్లు లెక్కచేయకుండా క్యూలలో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. ప్రజలు వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు గొడ్డలిపెట్టుగా తీర్పు ఇచ్చారని ఆయన అభిప్రాయపడ్డారు. పశ్చిమ నియోజకవర్గంలో కమలం వికసిస్తుందని సుజనా చౌదరి గెలవబోతున్నారని పేర్కొన్నారు. వాణిజ్య ప్రముకుడు కొణిజేటి రమేష్ మాట్లాడుతూ వైసీపీ పతనానికి ప్రజలు తీర్పు చెప్పారన్నారు. ఈ సందర్భంగా ఆయన సుజనా చౌదరికి దుశ్శాలువా కప్పి సత్కరించారు.

సత్వర పరిష్కారానికి మధ్యవర్తిత్వ కేంద్రాలు

మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ ఛైర్మన్ సత్యానంద్



చట్ట వివరణ చేస్తున్న మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానంద్

విజయవాడ లీగల్, మే 14 : కోర్టులో వున్న వివాదాలు సత్వరమే పరిష్కరించటానికి మధ్యవర్తిత్వ కేంద్రాలు ఏర్పాటు చేశామని, దీనివల్ల కక్షిదారులు వారి సమస్యలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవచ్చని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ ఛైర్మన్ ఎ.సత్యానంద్ తెలిపారు. ఇందుకోసమే సివిల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 89 ప్రకారం ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. మాజీ బార్ అధ్యక్షుడు, మధ్యవర్తిత్వ కేంద్ర కృష్ణాజిల్లా తొలి సభ్యులు వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితంలో ఎదురయ్యే సమస్యలకు సమాధానం దొరుకుతుందని, ఇరుపార్టీలు వారి మిత్రత్వాన్ని పోగొట్టుకోకుండా చూడబడుతుందని తెలిపారు. ఎన్నో కాపురాలు నిలబెట్టే అవకాశం ఈ కేంద్రం ద్వారా తనకు లభించిందని అన్నారు. మీడియేటర్ సాక్షిగా పరిగణించబడని వివిధ అంశాలను గుప్తా వివరించారు. మరో సభ్యుడు రాజారత్నం వారి అనుభవాలను తెలియజేశారు. సభకు బార్ అధ్యక్షుడు కొత్త చంద్రమౌళి అధ్యక్షత వహించగా సహాయ కార్యదర్శి కలతోటి క్రాంతికుమార్ స్వాగతం పలికి వందన సమర్పణ చేశారు.

ఏషియన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణ పతక విజేత భరత్‌కుమార్‌కు ఘనస్వాగతం



భరత్‌కుమార్‌కు ఘనస్వాగతం పలికిన కేబీఎన్ కాలేజీ నిర్వాహకులు, ప్రిన్సిపాల్ తదితరులు

వన్‌టౌన్, మే 14: చైనాలో జరిగిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణ పతక విజేత భరత్ కుమార్‌కు మంగళ వారం నగరంలో కేబీఎన్ కాలేజీ నిర్వాహకులు, అధ్యాపకులు విద్యార్థులు, సిబ్బంది భారీ స్వాగతం పలికారు. రైల్వే స్టేషన్ వద్ద నుంచి అతనిని కాలేజీ వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. కాలేజీ వద్ద కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ హేమచంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్‌లు ఆయనకు పుష్పగుచ్ఛం అందచేసి దుశ్శాలువా కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నారాయణరావు మాట్లాడుతూ, తమ కళాశాల విద్యార్థి పీ భరత్ కుమార్ ఈనెల 9న చైనాలోని హాంకాంగ్‌లో జరిగిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని స్వర్ణపతకాన్ని సాధించి కళాశాల కీర్తిని, రాష్ట్ర కీర్తిని, దేశకీర్తిని ఇనుమడింప చేశారన్నారు. భరత్ కుమార్‌ను తీర్చి దిద్దిన ఫిజికల్ డైరెక్టర్లను కూడా ఈ సందర్భంగా అభినందించారు.

దాడులకు పాల్పడ్డ వైసీపీ నాయకులపై కేసు

విద్యాధరపురం, మే 14: పోలింగ్ సందర్భంగా దాడులకు పాల్పడిన వైసీపీ నాయకులపై భవానీపురం పోలీసులకు మంగళవారం రెండు ఫిర్యాదులు అందాయి. హత్యాయత్నం, బెదిరింపులు, కొట్టడం వంటి సంఘటనలకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు. పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్పొరేటర్ భర్తపై ఫిర్యాదు

కార్పొరేటర్ భర్త ప్రసాద్‌రెడ్డి అతని అనుచరుడు ఫరూక్, మరికొందరు తన కుమారుడిపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారని గడ్డం ప్రసన్నాంజనేయులు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమారుడు గుర్రం జయచంద్ర సోమవారం 36వ నెంబరు బూత్‌లో ఓటు హక్కు వినియోగించడానికి వెళ్లగా, కార్పొరేటర్ భర్త ప్రసాదరెడ్డి వచ్చి జయచంద్ర చొక్కా పట్టుకుని బయటకు తీసుకువచ్చి టీడీపీకి సపోర్టు చేస్తావా అంటూ దుర్భాషలాడుతూ కొట్టాడన్నారు. బూత్ ఏజెంట్ మైనంపాటి శ్రీకాంత్ అడ్డురాగా, అతనిని కూడా కొట్టాడని, జయచంద్రపై హత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. తీవ్రంగా గాయపడిన అతనిని అక్కడున్న వారు ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారని చెప్పారు. ఈ ఘటనలో పాల్గొన్న ప్రసాద్‌రెడ్డి, ఫరూక్ ఇంకా మరికొందరిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు

కార్పొరేటర్ భర్త, అనుచరుల దాష్టీకంపై ఫిర్యాదు

కార్పొరేటర్ చైతన్యరెడ్డి భర్త ప్రసాదరెడ్డి అతని అనుచరుల దాష్టీకంపై భవానీపురం శివాలయం ప్రాంతానికి చెందిన ఎం విజయశ్రీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలింగ్ రోజున తాను 8 వ నెంబరు బూత్‌లో ఏజెంట్‌గా ఉన్నానని, తన భర్త కూడా రిలీవింగ్ ఏజెంటుగా ఉన్నాడని తెలిపారు అయితే పోలింగ్ సమయం ముగుస్తుందనగా ప్రసాదరెడ్డి అతని అనుచరులు వచ్చి తనను జుట్టుపట్టుకుని లాక్కొచ్చి కొట్టారని, కులం పేరుతో దుర్భాషలాడారని, తన పట్ల అసభ్యంగా ప్రవర్తించారన్నారు. తన భర్తను కూడా అసభ్యంగా దూషించి, దాడికి పాల్పడ్డారని చెప్పారు. ప్రసాదరెడ్డి, చైతన్యరెడ్డి పీఏ సాయి, ముస్లిం యువకుడు ఇంకా మరికొందరు దాడికి పాల్పడ్డారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడికి పాల్పడిన వెలంపల్లి అనుచరులపై చర్యలు తీసుకోండి

పోలీసులకు జనసేన పార్టీ నాయకుడు కామల్ల సోమనాథం విజ్ఞప్తి



పోలీసుకు ఫిర్యాదు చేస్తున్న జనసేన నాయకుడు సోమనాథం

పాయకాపురం, మే 14 : ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసిన కారణానికి తనపై వెలంపల్లి అనుచరులు దాడికి పాల్పడ్డారని జనసేన పార్టీ నగర ఉపాధ్యక్షుడు కామల్ల సోమనాథం మంగళవారం పాయకాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక 60వ డివిజన్ వాంబే కాలనీలోని జంధ్యాల దక్షిణామూర్తి హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో సోమవారం వైసీపీ కార్యకర్తలు ఓటర్లను ప్రభావితం చేస్తుండటంతో అక్కడే ఉన్న కామల్ల సోమనాథం ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశాడు. వెలంపల్లి అనుచరులు, సస్పెక్ట్‌షీట్ ఉన్న గంధశిరి బాలాజీ, గంధశిరి ప్రకాష్, గంధశిరి ప్రభు, బండ శ్రీను, ఫాతిమ, చిన్నా మరికొంత మంది అదును చూసి సాయంత్రం 6.30 గంటలకు పోలింగ్ జరుగుతుండగా గోడదూకి పోలింగ్ కేంద్రంలోకి వచ్చి తనపై దాడికి పాల్పడినట్లు సోమనాథం ఫిర్యాదులో పేర్కొన్నాడు. తనపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులకు ఫిర్యాదు ద్వారా విజ్ఞప్తి చేశాడు.

పోలింగ్‌లో రంగన్న, సింగన్నగూడేలు రికార్డు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 14 : బాపులపాడు మండలంలోని రంగన్నగూడెంలో గల (పోలింగ్ స్టేషన్) పీఎస్ నెంబర్ 183 అత్యధికంగా 96.10శాతం ఓట్లు వినియోగించుకుని గన్నవరం నియోజకవర్గంలోనే అత్యధికశాతం పోలింగ్ రికార్డు సృష్టించారు. అధికారిక గణాంకాల ప్రకారం ఈ పీఎస్‌లో 616 ఓటర్లు ఉండగా 592మంది ఓటుహక్కు వినియోగించుకున్నట్లు సమాచారం. బాపులపాడు మండలంలోనే అత్యధిక ఓట్లు వినియోగించుకున్న గ్రామంగా సింగన్నగూడెం నమోదైంది. సింగన్నగూడెంలోని పోలింగ్ స్టేషన్ నెంబర్ 184లో అత్యధికంగా 95.52శాతం ఓట్లు వినియోగించుకున్నారు. అధికారిక గణాంకాల ప్రకారం ఈ పీఎస్‌లో 1005 మంది ఓటర్లు కుగాను 960 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు.



రైల్వే క్యాటరింగ్ విక్రేతలు, లైసెన్స్‌దారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న రైల్వే అధికారులు

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

● విజయవాడ రైల్వే డివిజన్ కమర్షియల్ మేనేజర్ మహమ్మద్ అలీఖాన్

రైల్వేస్టేషన్, మే 14: రైల్వేస్టేషన్‌లో తయారు చేస్తున్న ఆహార పదార్థాల నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి అని విజయవాడ రైల్వే డివిజన్ కమర్షియల్ మేనేజర్ మహమ్మద్ అలీఖాన్ అన్నారు. మంగళవారం విజయవాడ రైల్వేస్టేషన్ డైరెక్టర్ కార్యాలయం వీఐపీ లాంజ్‌లో క్యాటరింగ్ విక్రేతలు, లైసెన్స్‌దారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రామాణికంలో గాని పరిమాణంలో గాని రాజీ పడకూడదని, అధిక చార్జీలు వసూలు చేయడం, అక్రమ విధానాలకు పాల్పడకూడదని ఆయన పేర్కొన్నారు. సీనియర్ అధికారులు తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ సమయంలో ఎక్కడైనా అధిక చార్జీలు వసూలు చేయడం, ప్యాక్ చేసిన ఆహార పదార్థాల విక్రయాలలో అవకతవకలు, గడువు ముగిసిన ఆహార పదార్థాలను అమ్మడం వంటివి గుర్తించినట్లయితే భారీ జరిమానాలు విధిస్తున్నట్లు ఆయన తెలిపారు. రైల్వేస్టేషన్ ఆవరణలో అనధికార హాకర్లను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, టికెట్ తనిఖీ సిబ్బందికి ఆయన ఆదేశాలు జారీ చేశారు. వాటర్ వెండింగ్ మెషీన్ ఆపరేటర్లు కూడా చక్కని ప్రమాణాలు పాటించాలని కోరారు. విజయవాడ డివిజన్ ఫుడ్‌సేఫ్టీ అధికారి రహమతుల్లా మాట్లాడుతూ విక్రయ సమయంలో అపరిశుభ్ర చర్యలకు దూరంగా ఉండాలని సూచించి, డ్రెస్ కోడ్‌ను అమలు చేయాలని కోరారు. స్టేషన్ డైరెక్టర్ ఎంశైలజ, సీసీఐ ఎంఎస్‌పి శ్రీనివాస్,క్యాటరింగ్ సీసీఐ ఎస్‌పి సుభాని పాల్గొన్నారు.

పశ్చిమలో పోలైన ఓట్లు 1,70,104

వన్‌టౌన్, మే 14: పశ్చిమ నియోజకవర్గంలో సాధారణ ఎన్నికలకు జరిగిన పోలింగ్‌లో సోమవారం రాత్రి వరకు కొన్ని చోట్ల ఓటు వేశారు. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కిరణ్మయి బూత్‌ల వారీగా ఎన్నెన్ని ఓట్లు పడ్డాయన్న దానిపై నోటిఫికేషన్ జారీ చేశారు. దీని ప్రకారం పశ్చిమలో మొత్తం 2,55,963 మందికి 1,70,104 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం పురుష ఓటర్లు 1,26,634 మందికి 85,255 మంది, 1,29,296 మంది మహిళా ఓటర్లకు 84,833 మంది, ఇతరులు 33 మందికి 16 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తంగా 85,859 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోలేదు. వీరిలో ఒక సామాజికవర్గం వారికి ఇక్కడ ఓట్లు ఉన్నప్పటికీ సొంత ప్రదేశాలకు వెళ్లారని చెబుతున్నారు. ఇంకొకవైపు కొందరు ఓటర్లకు డబ్బు పంపిణీ జరిగింది. కానీ ఆ పక్కనే ఉన్న కుటుంబానికి డబ్బులివ్వలేదు. దీంతో వారంతా తమకు డబ్బులివ్వంది ఎందుకు ఓటు వేయాలని నిరాసక్తత చూపించారు. ఇంకొకవైపు ఎంత చెప్పినా గాని ఓటర్ టర్నవుట్ పెరిగేందుకు పార్టీల పరంగా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్న వాదన కూడా వినిపిస్తోంది. ఇంత పెద్ద ఎత్తున ఓటర్లు రాకపోవడానికి ఇంకా అనేక కారణాలు చెబుతున్నారు.


ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
బుధవారం • 15 మే 2024
cinema@andhrajyothy.com

ఎదురుచూపులు ఫలించేలా



'హరిహర వీరమల్లు' సినిమా రిలీజ్ కోసం పవన్ అభిమానులే కాదు నేను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని నిధి అగర్వాల్ అన్నారు. ఆకట్టుకునే అందంతో కుర్రకారు హృదయాలను కొల్లగొడుతున్నారు ఈ ఇస్మార్ట్ బ్యూటీ. కెరీర్ ఆరంభంలోనే వరుస అపజయాలు చవిచూసినా తన అందాల ఆరబోతతో అవకాశాలను దక్కించుకుంటున్నారు. 'ఇస్మార్ట్ శంకర్' లాంటి సూపర్ హిట్ తర్వాత వరుసగా సినిమాలు చేసినా, ఓ మంచి విజయం మాత్రం ఈ అమ్మడుకి అందలేదు. అయితే పవన్ కల్యాణ్ సరసన నటిస్తున్న 'హరిహర వీరమల్లు' తనకు ఆ లోటు తీరుస్తుందంటున్నారు నిధి. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించడం తన కెరీర్‌కు ఊపు తెస్తుందని ఆమె చెబుతున్నారు. ఈ సినిమా రిలీజైన తర్వాత మరిన్ని మంచి పాత్రలు తనను వెతుక్కుంటూ వస్తాయనే నమ్మకం ఉందన్నారు నిధి.

భారీ సెట్‌లో నాని పోరాటాలు



ఇంతకుముందెన్నడూ పోషించని పవర్ ప్యాక్డ్ పాత్రలో నాని నటిస్తున్న 'సరిపోదా శనివారం' షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ శివార్లలో ఉన్న అల్యూమినియం ఫ్యాక్టరీలో జరుగుతోంది, హై బడ్జెట్‌తో రూపొందిస్తున్న ఈ సినిమాకు వివేక్ ఆత్రేయ దర్శకుడు. ప్రస్తుతం చిత్రీకరిస్తున్న పతాక సన్నివేశాల కోసం ఓ భారీ సెట్ వేశారు. ప్రియాంక మోహన్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాలో ఎస్ జె సూర్య కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆగస్టు 29న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు నిర్మాతలు డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి చెప్పారు.

వర్క్ పూర్తి చేసుకున్న తలైవా



తమిళ చిత్రరంగ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న 'వేట్టయాన్' చిత్రం షూటింగ్ దాదాపు పూర్తి కావొచ్చింది. ఈ సినిమా తెలుగు టైటిల్ ఏవిటన్నది ఇంకా వెల్లడించలేదు. 'జై భీమ్' సినిమాకు దర్శకత్వం వహించిన టీజే జ్ఞానవేల్ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ బేనరుపై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. అమితాబ్ బచ్చన్, ఫహద్ ఫాసిల్, రానా, మంజు వారియర్ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. తన పాత్రకు సంబంధించిన వర్క్‌ను రజనీకాంత్ పూర్తి చేసుకోవడంతో చిత్ర యూనిట్ ఆయనకు వీడ్కోలు పలికింది. భారీ స్థాయిలో అంచనాలు కలిగిన ఈ సినిమాను అక్టోబర్‌లో విడుదల చేయనున్నట్లు నిర్మాత ప్రకటించారు. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతాన్ని అందిస్తుండగా, ఎస్.ఆర్.కతీర్ సినిమాటోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు.

లవ్ బడ్డీ



'ఊర్వశివో రాక్షసివో' చిత్రం తర్వాత అల్లు శిరీష్ నటిస్తున్న చిత్రం 'బడ్డీ'. యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకుంది. శామ్ ఆంటోన్ దర్శకత్వంలో జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోని తొలి పాట 'ఆ పిల్ల కనులే..'ను బుధవారం విడుదల చేస్తున్నారు. హిప్ హాప్ తమిళ స్వరపరిచిన పాట ఇది. గాయత్రి భరద్వాజ్ కథానాయికగా నటించిన ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తామని నిర్మాత చెప్పారు.

మన సినిమాలకంటే కొరియన్ ఫిల్మ్స్ బెస్ట్



భారతీయ సినిమాల మీద తనకున్న అసంతృప్తిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు నటుడు నసీరుద్దీన్ షా. 'మన సినిమాకంటే కొరియన్ ఫిల్మ్స్ బెస్ట్' అని కూడా ఆయన కామెంట్ చేశారు. ఇటీవల ముంబైలో జరిగిన ఓ వేడుకలో నసీరుద్దీన్ షా మాట్లాడుతూ 'ఎందుకనో 'బాలీవుడ్' అనే పదమే నాకు నచ్చదు. భారతీయ ఫుడ్‌కు ప్రపంచ వ్యాప్తంగా పేరు ఉన్నట్లే గత వైభవాన్ని గౌరవిస్తూ మన సినిమాలను కూడా ఇప్పటికీ ప్రపంచ ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. నిజానికి మన చిత్రాలకంటే దక్షిణ కొరియా చిత్రాలు, థాయ్ సినిమాలు బాగుంటున్నాయి. ఆ సినిమాల నుంచి స్ఫూర్తి పొంది మన వాళ్లు సినిమాలు తీస్తున్నారని చెప్పడానికి సిగ్గు పడనక్కర్లేదు. అయితే ఇకనైనా జాగ్రత్త పడకపోతే ఏదో ఒక రోజు మన సినిమాలకు ఉన్న 'ఫేమ్ గాలి బుడగలా పేలిపోవచ్చు' అని ఆయన హెచ్చరించారు. ప్రస్తుతం నసీరుద్దీన్ షా సినిమాలు ఏమీ చేయడం లేదు. వెబ్ సిరీస్‌లో మాత్రం అప్పుడప్పుడు కనిపిస్తున్నారు.

రియలిస్టిక్ ఎంటర్‌టైనర్



పాపులర్ కమెడియన్ గెటప్ శీను లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'రాజు యాదవ్'. కృష్ణమాచారి దర్శకత్వం వహించారు. కె.ప్రశాంత్ రెడ్డి, రాజేశ్ కల్లేపల్లి సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 17న 'రాజు యాదవ్' విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు కృష్ణమాచారి మీడియాతో చిత్ర విశేషాలను పంచుకున్నారు.

"దాదాపు 90 శాతం మంది మనుషుల్లో ఏదో ఒక చిన్న లోపం ఉంటుంది. ఇండియన్ మాజీ క్రికెటర్ లక్ష్మీపతి బాలాజీకి చిన్నప్పుడు ఏదో సర్జరీ జరిగింది. దాని కారణంగా ఆయన ఎప్పుడూ నవ్వుతున్నట్లే కనిపిస్తారు. ఈ స్ఫూర్తితో కథ రాసుకుంటే బాగుంటుంది అనిపించింది. నాకు సహజత్వం అంటే ఇష్టం. అందుకే ఈ సినిమాను ఓ రియలిస్టిక్ ఎంటర్‌టైనర్‌లా తెరకెక్కించాను. ఈ పాత్రకు జీవం పోసే నటుల కోసం వెతికే క్రమంలో గెటప్ శీను ఈ రోల్‌కు యాప్ట్ అనిపించింది. ఆయన చాలా ప్రతిభావంతుడు. ఈ సినిమా ఆయనకు గుర్తుండిపోయే సినిమా అవుతుంది. హర్షవర్ధన్ రామేశ్వర్ కంపోజ్ చేసిన పాటలు, సురేశ్ బొబ్బిలి నేపథ్య సంగీతం ఈ సినిమాకు స్పెషల్ అట్రాక్షన్. ఈ సినిమాలో ప్రేక్షకులు ఆశించిన దాని కంటే ఎక్కువ వినోదం, భావోద్వేగం కూడిన సన్నివేశాలు ఉంటాయి" అని చెప్పారు.

కోటి రూపాయల విరాళం అందించిన ధనుశ్



తమిళ నటుడు ధనుశ్ తన సహృదయాన్ని చాటుకున్నారు. సౌత్ ఇండియన్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ నూతన భవన నిర్మాణం కోసం కోటి రూపాయల విరాళం అందించారు. నడిగర్ సంఘానికి అధ్యక్షుడైన నాజర్ ఈ కోటి రూపాయల చెక్‌ను అందుకున్నారు. ధనుశ్‌కు కృతజ్ఞతతో అసోసియేషన్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ అసోసియేషన్‌లో నటుడు విశాల్ ప్రధాన కార్యదర్శి కాగా, నటుడు కార్తి కోశాధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కాగా, ఈ అసోసియేషన్‌కు ఇప్పటికే పలువురు కోలీవుడ్ స్టార్స్ భారీ విరాళాలు ఇచ్చారు. కమల్ హాసన్, విజయ్ కోటి రూపాయల విరాళం అందివ్వగా, శివ కార్తికేయన్ 50 లక్షలు ఇచ్చారు.

రూ.835 కోట్లతో రామాయణ



ప్రస్తుతం అందరి దృష్టి బాలీవుడ్‌లో రూపొందుతున్న భారీ పౌరాణిక చిత్రం 'రామాయణ' మీదే ఉంది. రణబీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ కొనసాగుతోంది. చరిత్రలో నిలిచిపోయే విధంగా ఈ సినిమాను రూపొందించడానికి దర్శకుడు నితీశ్ తివారి కృషి చేస్తున్నారు. రెండు భాగాలుగా తయారవుతున్న ఈ సినిమా బడ్జెట్ ఎంతో తెలుసా? రూ. 835 కోట్లు. అది కూడా కేవలం తొలి భాగం కోసమే. నిర్మాణ పరంగా ఎక్కడా రాజీ పడకుండా నిర్మాత నమిత్ మల్హోత్రా ఖర్చు పెడుతూ, భారతీయ భాషలన్నింటిలోకి సినిమాను విడుదల చేయాలనే ప్లాన్‌లో ఉన్నారు. సినిమా షూటింగ్ ఒక ఎత్తు అయితే, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా ఎంతో కీలకం. అందుకే 600 రోజులు కేవలం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కోసం కేటాయించనున్నారు. విమర్శలకు ఎక్కడా తావు లేకుండా, భారతీయ సినిమా ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా మరోసారి చాటే విధంగా 'రామాయణ' నిర్మాణం జరుగుతోంది. మరి ఈ పినిమా విడుదల ఎప్పుడు? ఆ విషయంలో కూడా క్లారిటీ ఇచ్చారు ట్రేడ్ ఎనలిస్ట్ సుమిత్ కడెల్. ' 2027 అక్టోబర్‌లో 'రామాయణ' చిత్రం తొలి భాగం విడుదలవుతుంది' అంటూ ఎక్స్ ఖాతా ద్వారా ఆయన వెల్లడించారు.

యాక్షన్ రోల్‌లో...



'కేజీఎఫ్' సిరీస్‌తో దేశవ్యాప్తంగా రాఖీ భాయ్‌గా పాపులరయిన కన్నడ నటుడు యశ్ నటిస్తున్న తాజా చిత్రం 'టాక్సిక్. ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' అనేది ఉపశీర్షిక. మలయాళ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. కె. వెంకట్ నారాయణ నిర్మిస్తున్న ఈ సినిమాను రెండు వెర్షన్స్‌లో తెరకెక్కిస్తున్నారు. ఒకటి పాన్ ఇండియా వెర్షన్ కాగా, ఇంకోటి ఇంటర్నేషనల్ వెర్షన్. తాజాగా ఈ సినిమాలో బాలీవుడ్ కథానాయిక హ్యూమా ఖురేషి మరో కీలక పాత్రను పోషిస్తున్నారని తెలిసింది. ఆమె పోషించే పాత్ర పూర్తి యాక్షన్ కోణంలో సాగుతుందని సమాచారం. ఈ సినిమాను వచ్చే ఏడాది ఏప్రిల్ 10న విడుదల చేయడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

విడిపోవడమే మా ఇద్దరికీ మంచిది

జీవీ ప్రకాశ్ కుమార్

తమిళ సంగీత దర్శకుడు, హీరో జీవీ ప్రకాశ్ కుమార్, గాయని సైంధవి దంపతులు తమ వైవాహిక బంధానికి ముగింపు పలికారు. విడాకులు తీసుకొన్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిద్దరూ సోషల్ మీడియాలో ఓ ప్రకటన విడుదల చేశారు. 'మేమిద్దరం ఎంతో ఆలోచించిన మీదటనే విడిపోవాలనే నిర్ణయం తీసుకున్నాం. ఇది మా ఇద్దరికీ మంచిదని నమ్ముతున్నాం. ఇకపై ప్రశాంతంగా జీవితాన్ని కొనసాగిస్తాం. మా కెరీర్‌లో మరింత రాణించేందుకు ఈ మార్పు దోహదం చేస్తుందనుకుంటున్నాం. మా నిర్ణయాన్ని అందరూ అర్థం చేసుకుంటారని భావిస్తున్నాం' అని జీవీ, సైంధవి



ప్రకటనలో పేర్కొన్నారు. వారిద్దరూ 2013లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి కూతురు అన్వీ ఉంది. ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్‌కు జీవీ మేనల్లుడు అవుతాడు. 'అసురన్, సూరారైపొట్రు, రాజారాణి, ఒంగోలు గిత్త' తదితర చిత్రాలకు జీవీ సంగీతం అందించారు. హీరోగానూ పలు చిత్రాల్లో నటించారు.

హాలీవుడ్ సిరీస్‌లో



వయసు పెరుగుతున్నా వన్నె తరగని అందంతో అభిమానుల హృదయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని పదిలపరుచుకున్నారు టబు. హీరోయిన్‌గానే కాకుండా కథాబలం ఉన్న చిత్రాల్లో సైతం ప్రాధాన్యమున్న పాత్రలు పోషిస్తూ అభిమానులను అలరిస్తున్నారు. ఇటీవలే 'ది క్రూ' చిత్రంతో ఘన విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ఇప్పుడు ఆమె మరో అరుదైన అవకాశాన్ని అందుకున్నారు. ప్రముఖ హాలీవుడ్ వెబ్‌సిరీస్‌లో టబు చాన్స్ దక్కించుకున్నారు. 'డ్యూన్: ప్రాఫెసీ' సిరీస్‌లో ఆమె కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇందులో సిస్టర్ ఫ్రాన్సెస్కా అనే పాత్రలో టబు కనిపించనున్నారు. ఓ హాలీవుడ్ మీడియా సంస్థ ఈ విషయాన్ని తెలిపింది. ఈ సిరీస్‌లో టబు పాత్ర చాలా కీలకంగా ఉండబోతోందని తెలుస్తోంది. అతీంద్రియ శక్తుల నేపథ్యంలో సాగే ఈ సిరీస్‌కు సంబంధించిన ఇతర వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

ఆ మాస్క్ కథ ఏమిటి?



'ప్రేమిస్తే' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు. తమిళ నటుడు భరత్ నటించిన 'విరల్' సినిమా ఈ నెల 17న విడుదల కానుంది. వాణి భోజన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రానికి ఎం.శక్తి వేల్ దర్శకత్వం వహించారు. సీహెచ్ సతీశ్‌కుమార్ నిర్మించారు. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్ అందరినీ భయపెట్టింది. తాజాగా రిలీజ్ డేట్ వెల్లడిస్తూ ఓ పోస్టర్ విడుదల చేశారు. ట్రైలర్‌లో ఓ వింత మాస్క్ హైలైట్ అయింది. పోస్టర్‌లోనూ ఆ మాస్క్ కనిపించింది. ఆ మాస్క్ కథ ఏమిటన్నది చిత్రం చూస్తే కానీ తెలియదని దర్శకుడు అంటున్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఎస్.ఎన్.ప్రసాద్, సినిమాటోగ్రాఫర్: సురేశ్ బాలా, సమర్పణ: జగన్మోహిని, ఢిల్లీ బాబు.

థియేటర్లు పెంచుతున్నాం



గుంట మల్లేశం కథానాయకుడిగా నటించిన చిత్రం 'బ్రహ్మచారి'. నర్సింగ్ దర్శకత్వం వహించగా, రామ్‌భూపాల్ రెడ్డి నిర్మించారు. తెలంగాణ యాసలో సాగే కామెడీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కిన 'బ్రహ్మచారి' ఈ నెల 10న విడుదలై మంచి టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా నిర్మాత మీడియాతో మాట్లాడారు. "ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా ఈ సినిమాను రూపొందించాం. రిలీజైన ప్రతీ చోటా విశేష ప్రేక్షకాదరణ దక్కుతోంది. పాజిటివ్ టాక్ వస్తుండడంతో ఈ సినిమాకు థియేటర్లు పెంచుతున్నాం. పెళ్లి కాని బ్రహ్మచారులు ఎదుర్కొనే సమస్యలను ఇందులో వినోదాత్మకంగా చూపించాము" అని చెప్పారు.

ప్రేమ, కుటుంబ బాంధవ్యాలతో...

నిఖిల్ విజయేంద్రసింహా, తేజు అశ్విని జంటగా నటిస్తున్న చిత్రం 'సంగీత్'. సాద్ ఖాన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని నవీన్ మనోహరన్, మాజ్ ఖాన్ నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ చిత్రాన్ని ప్రారంభించారు. నిహారిక కొణిదెల చిత్ర బృందానికి స్క్రిప్ట్ అందించగా, శౌర్య కెమెరా స్విచ్చాన్ చేశారు. ముహూర్తపు షాట్‌కు ఎస్.ఎస్.కార్తికేయ క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా దర్శకుడు సాద్ ఖాన్ మాట్లాడుతూ "ప్రేమ, కుటుంబ బాంధవ్యాలతో సాగే కథ ఇది. ఓ పెళ్లి వేడుకలో జరిగే సంఘటనలను వినోదభరితంగా తెరకెక్కిస్తున్నాము" అని అన్నారు. హీరో నిఖిల్ విజయేంద్ర మాట్లాడుతూ "ఈ సినిమా కథ నా హృదయానికి దగ్గరగా ఉంది. ఇందులో కథానాయకుడు సమర్థ్ పాత్రలో నేను, స్వర పాత్రలో తేజు అశ్విని నటిస్తున్నారు" అని చెప్పారు.





బుధవారం ● 15 మే 2024

ఉండాలా? వద్దా?

పిల్లలు యుక్తవయస్సు వచ్చిన తర్వాత బయటకు వెళ్లి స్వతంత్రంగా జీవిస్తే మంచిదా? తల్లితండ్రుల వద్దే ఉండి వారి సాయం తీసుకుంటే మంచిదా? ఈ విషయంలో అనేక సార్లు చర్చ జరుగుతూనే ఉంటుంది. పాశ్చాత్య దేశాల్లో టీనేజ్ వచ్చిన తర్వాత పిల్లలు బయటకు వెళ్లి సంపాదించుకొని స్వతంత్రంగా జీవిస్తూ ఉంటారు. మన దేశంలో మాత్రం పిల్లలు తల్లితండ్రుల వద్దే ఉంటారు. తాజాగా ప్రముఖ బాలీవుడ్ నటి ఆలియా భట్ తన కుమార్తె రాహను 20 ఏళ్లు దాటిన తర్వాత కూడా బయటకు వెళ్లనివ్వనని పేర్కొనటంతో ఇంటర్నెట్ ప్రపంచంలో ఒక పెద్ద చర్చ ప్రారంభమయింది. తనకు 23 ఏళ్లు ఉండగా బయటకు వచ్చేశానని.. ఎప్పుడూ షూటింగ్‌లతో బిజీగా ఉండే దానినని.. తాను ఎక్కడున్నానో తల్లితండ్రులకు తెలియదని.. తన కుమార్తెకు అలాంటి పరిస్థితి రాకూడదని భావిస్తున్నానని ఆలియా పేర్కొన్నారు. కొందరు మానసిక నిపుణులు ఆలియాతో ఏకీభవిస్తున్నారు. వారేమంటున్నారో చూద్దాం..

ఎమోషనల్ సపోర్ట్

సుమారు 21 ఏళ్లకు చదువు పూర్తవుతుంది. పిల్లలు తమ కెరీర్‌ను ప్రారంభిస్తారు. అదే సమయంలో వారు తమ వ్యక్తిగత జీవితంపై కూడా దృష్టి పెడతారు. ఈ సమయంలో వారికి ఎదురయ్యే వృత్తిపరమైన, వ్యక్తిగతమైన సవాళ్లను ఎదుర్కోవటానికి తల్లితండ్రుల మద్దతు ఉంటే మంచిది. తల్లితండ్రులు, కుటుంబంలోని ఇతర సభ్యులు వారిని ఎప్పటికప్పుడు వారిని మోటివేట్ చేయటానికి వీలవుతుంది.

బాధ్యతల బరువు


చిన్నప్పుడే బయటకు వచ్చేసి కుటుంబ బాధ్యతలను అందుకోగలిగితే మంచిదే! కానీ కొందరికి బాధ్యతలు చేపట్టే పరిణితి ఉండదు. వారికి బాధ్యతలు చాలా బరువుగా అనిపిస్తాయి. అలాంటి వారికి కుటుంబ మద్దతు అవసరం.

కుటుంబ విలువలు

ఒక వ్యక్తి కుటుంబంతో కలిసి జీవిస్తుంటే- కుటుంబ విలువలు, ఆచార సాంప్రదాయాలు అర్థమవుతాయి. ఉదాహరణకు ఒక పండగ వచ్చినప్పుడు ఒంటరిగా ఉండటానికి కుటుంబంతో కలిసి ఉండటానికి మధ్య చాలా తేడా ఉంటుంది. కుటుంబంతో కలిసి ఉంటే ఆచార వ్యవహారాలు తెలుసుకోవటానికి వీలుంటుంది.

జీవిత సలహాలు

20లలో చాలా మంది రకరకాల భావోద్వేగాలతో కొట్టుకుపోతూ ఉంటారు. కొందరు మంచి, చెడులను బేరీజు వేసుకోలేని స్థితిలో ఉంటారు. అలాంటి సమయాలలో కుటుంబ వ్యవస్థ మద్దతు ఇస్తుంది. వారు జీవితంలో ఎదిగేలా చేస్తుంది.



ముఖంపై చారలు కనిపించకుండా..

ఎక్కువ సేపు ఒక వైపు పడుక్కొంటే- ముఖంపై చారలు పడతాయి. ఉదయాన్నే లేచి బయటకు వెళ్లాలంటే ఈ చారలు ఇబ్బందిగా అనిపిస్తాయి. వీటిని చిన్న చిన్న చిట్కాల ద్వారా ఎలా నివారించవచ్చో చూద్దాం

- వెల్లకిలా కాకుండా నడుం పరుపువైపు ఉండేలా పడుకోవడం అలవాటు చేసుకోవాలి. దీని వల్ల తరగడాపై ముఖం ఒత్తుకుపోదు. దీని వల్ల ముఖంపై చారలు పడవు.
- చాలా మంది కాటన్ గలేబులను వాడతారు. కాటన్ కాకుండా శాటిన్, సిల్క్, మెత్తటి సిల్క్ కాటన్ గలేబులను వాడితే మంచిది.
- ప్రతి రోజు పడుక్కొనే ముందు మాయిశ్చరైజర్ రాయాలి. దీని వల్ల చర్మం మృదువుగా తయారవుతుంది. ముఖంపై చారలు పడినా అవి వెంటనే తొలగిపోతాయి.
- ఈ మధ్యకాలంలో రకరకాల షేపుల్లో ఉన్న తలగడాలు వస్తున్నాయి. వీటిని ఉపయోగించటం వల్ల ఒత్తిడి తగ్గుతుంది.
- నిగనిగలాడే చర్మం కావాలంటే ఆరోగ్యవంతమైన ఆహారం తీసుకోవాలి. అప్పుడే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. ముఖంపై చారలు ఎక్కువగా కనిపించవు.

అనన్య సామర్థ్యం



ఒక సాధారణ అమ్మాయిలా కెరీర్ ప్రారంభించారు. కానీ... అనతికాలంలోనే బడా కంపెనీల అత్యున్నత స్థానాన్ని అధిరోహించారు. ఉన్నత చదువు... వ్యాపారాన్ని పరుగులు పెట్టించే అసాధారణ ప్రతిభా పాటవాలు... ఇవే ఆమె విజయానికి సోపానాలు అయ్యాయి. 'ఫోర్బ్స్ ఇండియా' మ్యాగజైన్ 'సెల్ఫ్‌మేడ్ ఉమెన్-2024' జాబితాలో స్థానం దక్కించుకున్న ప్రముఖ రియల్‌ఎస్టేట్ కంపెనీ 'బ్రూక్ ఫీల్డ్' మేనేజింగ్ డైరెక్టర్ అనన్యా త్రిపాఠి జైత్ర యాత్ర ఇది.

భారత సైన్యంలో పని చేసే అధికారి కూతురు కావడంతో దేశంలోని చాలా ప్రాంతాలు తిరిగారు అనన్యా త్రిపాఠి. తండ్రికి బదిలీ అయినప్పుడల్లా ఆమె స్కూలు కూడా మారిపోయేది. అయితే దాన్ని అసౌకర్యంగానో... తన చదువుకు ప్రతిబంధకంగానో అనన్య ఎప్పుడూ భావించలేదు. పైగా 'అలా పలు ప్రాంతాల్లోని పాఠశాలల్లో చదవడంవల్లే... భిన్న పరిస్థితులను ఆకళింపు చేసుకోవడం, విభిన్న సంస్కృతులపై అవగాహన చిన్న వయసులోనే కలిగాయి. ఎదిగాక ఆ అంశాలే నా కెరీర్‌కు పునాదులయ్యాయి' అంటారు ఆమె.

2005లో కేరళ కొజికోడ్ 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్' (ఐఐఎం) నుంచి ఎంబీయే పట్టా అందుకున్న అనన్యా... అదే ఏడాది బెంగళూరు టీసీఎస్‌లో చేరారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఏడాది పాటు అందులో పని చేశారు. అదే సమయంలో కొంతమంది ఐఐఎం విద్యార్థులను ప్రతిష్ఠాత్మక 'మెకిన్సే అండ్ కంపెనీ' తమ ముంబయి కార్యాలయానికి ఆహ్వానించింది. ఆ ఏడాది కొజికోడ్ ఐఐఎం నుంచి ఒక్కరికే ఆ అవకాశం దక్కింది. ఆ ఒక్కరూ... అనన్య త్రిపాఠి. జూనియర్ అసోసియేట్ మేనేజర్‌గా అందులో ఉద్యోగం మొదలుపెట్టిన ఆమె... అసోసియేట్ పార్ట్‌నర్‌గా పదోన్నతి పొందారు. ఆరున్నర ఏళ్ల పాటు వివిధ హోదాల్లో పని చేశారు.

కోడర్‌గానే ఉండాలనుకోలేదు...

'జీవితమంతా కోడర్‌గానే ఉండలేననే విషయం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా కెరీర్ మొదలుపెట్టిన కొద్ది రోజులకే అర్థమైంది. ఇక అప్పటి నుంచి నా మనసు కుదురుగా లేదు. వ్యాపార రంగంపై సమగ్ర అవగాహన అవసరం అనుకున్నాను. ఆ దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టిన సమయంలో 'మెకిన్సే'లో అవకాశం లభించింది' అని నాటి రోజులు గుర్తు చేసుకున్నారు అనన్యా. అందులో కొలువు ఆమె ఎదుగుదలకు ఎంతో దోహదపడింది. అద్భుతమైన మార్గదర్శకులు అక్కడ లభించారు. వారి మార్గదర్శనంలో కంపెనీ నిర్వహణ, వ్యాపార అభివృద్ధికి సంబంధించి అనేక కీలక విషయాలు ఆకళింపు చేసుకున్నారు.

ఊహించని మలుపు...

"చెప్పాలంటే ఒక విధంగా ఆ కంపెనీలో నేను దూసుకుపోతున్నా. ఉన్నత హోదాలో కొనసాగుతున్నా. ఆ సమయంలో 'మింత్రా' నుంచి వచ్చిన కాల్ నా వృత్తిగత జీవితాన్ని ఊహించని మలుపు తిప్పింది. నాటికి ఇ-కామర్స్ రంగం భవిష్యత్తుపై ఎవరికీ సరైన అంచనాలు కానీ, భరోసా కానీ లేవు. అలాంటి పరిస్థితుల్లో మంచి ఉద్యోగం వదులుకొని అటువైపు వెళ్లడం అవసరమా అనిపించింది. అలాగని వెనకడుగు వేయదలుచుకోలేదు. అందివచ్చిన అవకాశాన్ని వదులుకోవాలని అనుకోలేదు. అందుకే ఓకే చెప్పాను. చీఫ్ స్ట్రేటజీ ఆఫీసర్‌గా 'మింత్రా'లో విధులు ప్రారంభించాను. ఆ నిర్ణయమే నా భవిష్యత్తును నిర్ణయిస్తుందని కొన్నాళ్లకు అర్థమైంది" అంటారు అనన్యా. ఆమె బాధ్యతలు చేపట్టాక ఆ కంపెనీ స్థూల వాణిజ్య విలువ 250 డాలర్ల నుంచి 1.7 బిలియన్ డాలర్లకు ఎగబాకింది.



మరో మెట్టు పైకి...

ఆరేళ్ల కిందట 'వాల్‌మార్ట్' సంస్థ 'ఫ్లిప్‌కార్ట్'ను సొంతం చేసుకున్న సమయంలో తమ కంపెనీ వదలవద్దని అనన్యాకు 'మింత్రా' భారీ ఆఫర్ ఇచ్చింది. కానీ ఆమె దాన్ని వదులుకుని... ముంబయి 'కేకేఆర్ క్యాప్‌స్టోన్ ఇండియా' నుంచి వచ్చిన ఆహ్వానాన్ని అందుకున్నారు. అందుకు కారణం... కెరీర్‌లో మరో మెట్టు ఎక్కే అరుదైన అవకాశం లభించడం. 'కేకేఆర్'లో మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అక్కడ 'మ్యాక్స్ హెల్త్‌కేర్, విని కాస్మోటిక్స్' వంటి కంపెనీలతో కలిసి పని చేసే అవకాశం దక్కింది. అంతేకాదు, సదరు కంపెనీల మార్కెట్‌ను రెట్టింపు చేయడంలో కూడా ఆమె కీలక పాత్ర పోషించారు. దీంతోపాటు మరికొన్ని కంపెనీలకు బోర్డ్ మెంబర్‌గా వ్యవహరించారు.

మరో అరుదైన అవకాశం...

నాలుగున్నరేళ్లు 'కేకేఆర్'లో పని చేసిన అనన్యా త్రిపాఠి... ఆ తరువాత 'బైజూస్'కు చెందిన 'వైట్‌హ్యాట్ జూనియర్'కు సీఈఓగా వెళ్లారు. గర్భవతిగా ఉన్న ఆమె తొమ్మిది నెలలు పూర్తిగా విశ్రాంతి తీసుకున్నారు. బిడ్డకు జన్మనిచ్చాక తిరిగి విధుల్లో చేరారు. ఆ సమయంలోనే ప్రముఖ రియల్‌ఎస్టేట్ కంపెనీ బెంగళూరులోని 'బ్రూక్ ఫీల్డ్' నుంచి పిలుపు వచ్చింది. తాను మెటర్నటీ లీవ్‌లో ఉన్నాని ఆమె చెప్పారు. అయితే సెలవు ముగిసేవరకు వేచివుంటామని సంస్థ తెలిపింది. దాంతో 'వైట్‌హ్యాట్'కు రాజీనామా చేసి 'బ్రూక్‌ఫీల్డ్'కు ఓకే చెప్పారు అనన్యా. ఈ ఏడాది జనవరిలో ఆ కంపెనీ ఆసియా పసిఫిక్ ప్రాంత మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. 'అప్పుడే బిడ్డకు జన్మనిచ్చిన తల్లిగా నా అవసరాలు, బాధ్యతలను కంపెనీ అర్థం చేసుకుంది. నా కోసం వేచివుండేందుకు సిద్ధపడింది. ఇది నన్ను ఆకట్టుకుంది. అందుకే వారి ఆఫర్‌ను కాదనలేకపోయాను' అంటారు అనన్యా త్రిపాఠి.

బాధ్యత పెద్దది...

ఆఫీస్ స్పేస్‌కు సంబంధించి మెగా వెంచర్లు నడిపించే సదరు కంపెనీని ముందుకు నడిపించడం అంత సులువు కాదు. తనపై ఉన్నది ఎంతో పెద్ద బాధ్యత అంటారు అనన్య. దేశంలోని ఏడు నగరాల్లో సంస్థ కార్యకలాపాలు సాగుతున్నాయి. రియల్‌ఎస్టేట్ రంగంలో వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో సాగుతున్న భారీ కంపెనీ బాధ్యతను అనన్య భారంగా భావించడంలేదు. ఒత్తిడికి లోనుకావడంలేదు. సంస్థకు లాభాలు ఆర్జించిపెట్టడంతో పాటు, సంస్థను నమ్మి పెట్టుబడి పెట్టినవారికి కూడా అది ఒక మంచి ఆదాయ మార్గంగా నిలిచేలా ప్రణాళికలు రచిస్తున్నారు. అదేవిధంగా సరికొత్త ఆదాయ వనరులను అన్వేషిస్తున్నారు. ఇవే ఆమెను 'ఫోర్బ్స్ ఇండియా' మ్యాగజైన్ 'సెల్ఫ్‌మేడ్ ఉమెన్-2024' జాబితాలో ఏడో స్థానంలో నిలిపాయి. మరికొన్ని ప్రతిష్ఠాత్మక అవార్డులనూ తెచ్చిపెట్టాయి.

కిస్మిస్ నీళ్లతో ప్రయోజనాలెన్నో!

కొందరు ఉదయాన్నే లేచిన వెంటనే గోరువెచ్చని నిమ్మకాయ నీళ్లు తాగుతారు. మరికొందరు మెంతులు నానపెట్టిన నీళ్లు తాగుతారు. ఈ మధ్యకాలంలో కిస్మిస్‌లను నానపెట్టి వాటిని తాగే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది.

ఎలా తయారుచేయాలి?

ఒక పది కిస్‌మిస్‌లను తీసుకోవాలి. వాటిని ఒక గ్లాసు నీళ్లలో వేసి నానబెట్టాలి. ఆ నీళ్లను ఉదయాన్నే లేచి ఎటువంటి ఆహారం తీసుకోకుండా తాగాలి.

ప్రయోజనాలేమిటి?



- ఈ నీళ్లలో ఫైబర్ ఉంటుంది. దీని వల్ల అజీర్తి తొలగిపోతుంది.
- దీనిలో ఉండే ఐరన్, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్స్ శరీరంలోని కణాలకు ఎంతో ఉపకరిస్తాయి.
- పొటాషియం వల్ల రక్తపోటు నియంత్రణ జరుగుతుంది. హృద్రోగ సమస్యలు తొలగిపోతాయి.
- ఈ నీళ్లలో ఉండే యాంటీ రాడికల్స్ వల్ల కణాలు ఆరోగ్యంగా తయారవుతాయి
- కిస్‌మిస్‌లలో సహజసిద్ధమైన సుగర్ ఉంటుంది. కార్బోహైడ్రేడ్స్ కూడా ఉంటాయి. వీటి వల్ల శరీరానికి తక్షణమే శక్తి కలుగుతుంది.
- ఉదయాన్నే ఈ నీళ్లు తాగటం వల్ల ఆకలి తగ్గుతుంది. దీని వల్ల తినే ఆహార పరిమాణం తగ్గుతుంది. బరువు తగ్గటానికి వీలవుతుంది.

డిన్నర్ తర్వాత కాఫీ తాగద్దు!

డిన్నర్ చేసిన తర్వాత కాఫీ తాగటం పాశ్చాత్యుల పద్ధతి. ఈ మధ్యకాలంలో మన దేశంలో కూడా డిన్నర్ తర్వాత కాఫీ లేదా టీ తాగే వారి సంఖ్య పెరుగుతోంది. అయితే ఇలా తాగటం వల్ల అనారోగ్యం కలుగుతుందని ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) హెచ్చరిస్తోంది.

ఐసీఎంఆర్ శాస్త్రవేత్తల అధ్యయనం ప్రకారం- కాఫీ లేదా టీలో ఉండే కెఫైన్ మన శరీరంలోని



నాడీ వ్యవస్థపై ప్రభావం చూపిస్తుంది. 150 మిల్లీలీటర్ల కాఫీలో 80 నుంచి 120 మిల్లీగ్రాముల కెఫైన్ ఉంటుంది. 150 మిల్లీలీటర్ల ఇన్‌స్టెంట్ కాఫీలో 50 నుంచి 65 మిల్లీగ్రాముల కెఫైన్ ఉంటుంది. 150 మిల్లీలీటర్ల టీలో 30 నుంచి 65 మిల్లీగ్రాముల కెఫైన్ ఉంటుంది. శాస్త్రవేత్తల లెక్కల ప్రకారం- ప్రతి రోజు ఒక ఆరోగ్యవంతుడైన వ్యక్తి 300 మిల్లీగ్రాముల కెఫైన్ తీసుకోవచ్చు. అంత కన్నా ఎక్కువ

అయితే అనేక రకాల సమస్యలు ఏర్పడతాయి. అంతే కాకుండా కాఫీ లేదా టీలలో టేనిన్ అనే ఒక రసాయనం ఉంటుంది. ఇది మన శరీరంలోకి ఐరెన్ వెళ్లకుండా అడ్డుపడుతుంది. మన శరీరంలో హిమోగ్లోబిన్ తయారీలో ఐరెన్‌ది ప్రధానమైన పాత్ర. హిమోగ్లోబిన్ తగ్గితే శరీరంలో కణాలు శక్తిమంతంగా పనిచేయలేవు. ఆహారం తిన్న గంట సేపులో పులో టీ లేదా కాఫీ తాగితే టేనిన్ ప్రభావం మన శరీరంపై పడుతుంది. అందువల్ల ఆహారం తిన్న గంట సేపు తర్వాత మాత్రమే కాఫీ లేదా టీని తాగమని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

లీలమ్మ డ్యాన్స్... వేరే లెవెల్



మూడు వారాల క్రితం సాధారణ గృహిణిగా ఉన్న ఆమె రాత్రికి రాత్రి సెలబ్రిటీ అయిపోయారు. ఒక పెళ్ళిలో ఆమె చేసిన నృత్యం రెండ్రోజుల్లోనే దాదాపు అరవై లక్షల మంది వీక్షించారు. ఇలాంటి గుర్తింపును ఊహించలేదంటున్నారు అరవై నాలుగేళ్ళ లీలమ్మ. ప్రముఖుల ప్రశంసలందుకుంటున్న ఈ కేరళ బామ్మను సినిమా అవకాశాలు కూడా వెతుక్కుంటూ వస్తున్నాయ్.

"నా పిల్లలు 'వైరల్ అవుతోంది' అని మాట్లాడుకుంటూ ఉంటే ఆ మాటకు అర్థం తెలిసేది కాదు. ఇప్పుడు అదేంటో బాగా అర్థమైపోయింది" అని నవ్వుతూ అన్నారు లీలమ్మ. ఇరుగు పొరుగువారు, బంధువుల పలకరింపులతో, అభినందనలతో ఆమెకు తీరిక దొరకడం లేదు. మరోవైపు ఇంటర్వ్యూల కోసం మీడియా ప్రతినిధుల హడావిడి. లీలమ్మ కోసం పెద్ద సంఖ్యలో వస్తున్న ఫోన్ కాల్స్‌ను ఆమె పిల్లలు అటెండ్ అవుతున్నారు. కాల్ చేస్తున్నవారిలో సినీ, రాజకీయ ప్రముఖులు కూడా ఉన్నారు. "ఒక కాల్‌లో మాట్లాడమని మా అబ్బాయి సంతోష్ ఫోన్ నా చేతికి ఇచ్చాడు. "అమ్మా! నా పేరు శివన్ కుట్టి. నేను కేరళ విద్యాశాఖ మంత్రిని. మీరు డ్యాన్స్ అదరగొట్టారు. అభిరుచికి వయసుతో పని లేదని నిరూపించారు. కంగ్రాట్స్" అంటూ అవతల వ్యక్తి మాట్లాడినప్పుడు... ఎలా స్పందించాలో తెలియలేదు. ఉద్వేగంతో గొంతు పూడుకుపోయింది. "మీ అభిమానానికి థ్యాంక్స్" అని మాత్రం అనగలిగాను. ఎందుకో... పరిచయం లేని వాళ్ళతో... మనిషి ఎదురుగా లేకుండా మాట్లాడడం నాకు కాస్త ఇబ్బందిగా ఉంటుంది" అంటారామె.

'వాళ్ళ మధ్యలో నేనెందుకు?' అనుకున్నా...

లీలమ్మ కేరళ రాష్ట్రం ఎర్నాకుళంలోని పల్లిక్కరలో తన కుమారుడు అవ్వై సంతోష్, కోడలు, ఇద్దరు మనుమలతో కలిసి ఉంటున్నారు. ఆమె కుమార్తెల్లో ఒకరైన మినీ జాయ్ డ్యాన్స్ టీచర్. కాగా మరో కుమార్తె సినీ సుధీర్ విదేశాల్లో ఉంటున్నారు. "చిన్నప్పుడు స్కూల్ ఫంక్షన్లలో డ్యాన్స్ చేసే దాన్ని. ఆ తరువాత, పెళ్ళి, కుటుంబ బాధ్యతలు... అయినా నాట్యం అంటే ఆసక్తి పోలేదు. నా భర్త జాన్ కె. పల్లిక్కర రంగస్థల కళాకారుడు. దీంతో కళలకు అనువైన వాతావరణం మా ఇంట్లో ఎప్పుడూ ఉంటుంది. ఆయన అడుగుజాడల్లో మా అబ్బాయి సంతోష్ టీవీ నటుడయ్యాడు. డ్యాన్సర్ కావాలని మా అమ్మాయి మినీని నేనే ప్రోత్సహించాను" అని చెప్పారు లీలమ్మ. "నాట్యాన్ని నేను ఎక్కడా నేర్చుకోలేదు. కానీ మంచి సంగీతం వినిపిస్తే నా కాళ్ళు వాటంతట అవే కదుల్తాయి. వంట వండుతూ డ్యాన్స్ చేస్తుంటా. నాకు పాత పాటలంటే ఇష్టం. బంధువులు, స్నేహితుల ఇళ్ళలో ఏవైనా ఫంక్షన్లు జరిగితే... నాట్యం చెయ్యడానికి సంకోచించను" అంటారు లీలమ్మ. కిందటి నెల మూడో వారంలో పట్టాంబిలోని బంధువుల ఇంట్లో పెళ్ళికి కుటుంబంతో సహా ఆమె వెళ్ళారు. "అక్కడ పిల్లలందరూ స్టేజి మీద డ్యాన్స్ చేస్తున్నారు. నాకూ చెయ్యాలని ఉంది. కానీ పిల్లల మధ్యలో నేనేందుకు? అనుకున్నాను. ఇంతలో మా అబ్బాయి నన్ను స్టేజి మీదకు పిలిచాడు. "నువ్వు డ్యాన్స్ చెయ్యమ్మా! సరదాగా ఉంటుంది" అంటూ ప్రోత్సహించాడు. నలభయ్యేళ్ళ నాటి 'కనమరయతు' (మళయాళం) సినిమాలోని 'ఒరు మధురకినవిన్' అనే పాట పెట్టారు. నాకు చాలా ఇష్టమైన ఆ పాటలోని డ్యాన్స్ అంతా నా కళ్ళ ముందు కదిలింది. స్టేజి మీదకు వెళ్ళాక... నన్ను నేను మరచిపోయాను. నన్ను చూసి పిల్లలు కూడా ఉత్సాహంగా నాతో కలిశారు" అని గుర్తు చేసుకున్నారు లీలమ్మ.



అప్పుడు కుదరలేదు, కానీ...

ఆమె నృత్యాన్ని సంతోష్ వీడియో తీశారు. "మా అమ్మకు డ్యాన్సంటే చాలా ఇష్టం. ఎక్కడ ఏ వేడుక జరిగినా ఆమెను నాట్యం చెయ్యాలని ప్రోత్సహిస్తూ ఉంటాం. ప్రత్యేకంగా నేర్చుకోకపోయినా... ఏమాత్రం తడబడదు. మాతో కలిసి కూడా అమ్మ డ్యాన్స్ చేస్తూ ఉంటుంది. ఈసారి ఆమె నృత్యం మరింత ప్రత్యేకంగా కనిపించింది. అందుకే ఫేస్‌బుక్‌లో పెట్టాను. రెండు రోజుల్లోనే అరవై లక్షలకు పైగా వ్యూస్ వచ్చాయి. ఇంకా పెరుగుతూనే ఉన్నాయి ఇంత స్పందన వస్తుందని అనుకోలేదు. మా నాన్న జీవించి ఉంటే ఎంతో సంబరపడేవారు. రంగస్థల నటుడిగా ఆయనకూ, టీవీ నటుడిగా నాకూ రానంత ఫేమ్ ఒక్క వీడియోతో అమ్మ కొట్టేసింది" అంటున్నారు సంతోష్. లీలమ్మ వీడియో వైరల్ కాగానే... కుంచకో బోబన్, రహమాన్, సితారా కృష్ణకుమార్‌తో సహా అనేక మంది మలయాళ సెలబ్రిటీలు... ఆమెను అభినందిస్తూ... ఆ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. రాష్ట్ర మంత్రి శివన్‌కుట్టి స్వయంగా ఆమెతో మాట్లాడారు. మరోవైపు ఆమెకు మూడు సినిమాల్లో ఆఫర్లు కూడా వచ్చాయి. వాటిలో మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ సినిమా ఒకటి. "ఇదంతా ఆ దేవుడి దయ. "నాటకాల్లో నేను నటించవచ్చా?" అని నా భర్తను అడిగే దాన్ని. ఆయనకు ఇష్టమే అయినా... పలు కారణాల వల్ల అది కుదరలేదు. ఇప్పుడు సినిమా ఆఫర్లతో ఆ కల నిజం కాబోతోంది. ఒక్క నాటకంలోనైనా, సినిమాలోనైనా ఇంకా నటించకుండానే నాకు పేరొచ్చింది. ఇంతకన్నా ఇంకేం కావాలి?" అంటున్నారు లీలమ్మ.

ఎఫ్ అండ్ ఓ

రిటైల్ ఇన్వెస్టర్లను హెచ్చరించిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

పెట్టుబడులపై జాగ్రత్త!



ముంబై: ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) విభాగంలో రిటైల్ మదుపరుల పెట్టుబడులు పెరుగుతుండటంపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆందోళన వ్యక్తం చేశారు. "ఎఫ్ అండ్ ఓ విభాగంలో రిటైల్ మదుపరుల పెట్టుబడులు పోటెత్తితే మార్కెట్‌తో పాటు ఇన్వెస్టర్ల సెంటిమెంట్, గృహ ఆర్థిక వ్యవస్థకు భవిష్యత్‌లో సవాళ్లు ఏర్పడే ప్రమాదం ఉంద"ని మంగళవారం బీఎస్ఈలో నిర్వహించిన 'వికసిత్ భారత్ 2047' కార్యక్రమంలో సీతారామన్ హెచ్చరించారు. కుటుంబాల పొదుపులో గణనీయ మార్పులు చోటు చేసుకున్నాయని, ఈక్విటీల్లోకి వచ్చే పొదుపు సొమ్ము గడిచిన కొన్నేళ్లలో అనూహ్యంగా పెరిగిందని, మన స్టాక్ మార్కెట్‌పైన నమ్మకానికిది ప్రతీక అని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. స్టాక్ మార్కెట్లో కొంత రిస్క్ ఉన్నప్పటికీ, మెరుగైన రిటర్నులు లభించే అవకాశాలుండటంతో మధ్యతరగతి ప్రజలు తమ పొదుపు సొమ్మును షేర్లలో పెట్టుబడిగా పెడుతున్నారని అన్నారు. వారికి మార్కెట్‌పై ఉన్న నమ్మకాన్ని పరిరక్షిస్తామన్నారు. కొన్ని నెలల క్రితం క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఓ అధ్యయాన్ని చేపట్టింది. ఎఫ్ అండ్ ఓ మార్కెట్లో పెట్టుబడులు పెట్టిన ప్రతి 10 మందిలో 9 మంది నష్టపోయారని ఆ అధ్యయన నివేదిక వెల్లడించింది. అప్పటి నుంచి డెరివేటివ్ కాంట్రాక్టుల్లో రిటైల్ ఇన్వెస్టర్ల ట్రేడింగ్‌పై సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ సహా చాలా మంది ఆందోళన వ్యక్తం చేశారు.

ఇన్వెస్టర్లలో నమ్మకాన్ని పెంచాలి..

ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పోస్టాఫీస్ పథకాల్లోకి మళ్లే పొదుపు సొమ్ము తగ్గిందని, అదే సొమ్ము క్యాపిటల్ మార్కెట్లోకి వచ్చి చేరుతోందని ఆర్థిక మంత్రి అన్నారు. కఠిన నిబంధనలు, పటిష్ఠమైన నియంత్రణ ప్రమాణాల ద్వారా ఇన్వెస్టర్ల నమ్మకాన్ని పెంపొందించేందుకు సెబీతో కలిసి పనిచేయాలని బీఎస్ఈకి మంత్రి విజ్ఞప్తి చేశారు. స్టాక్ ఎక్స్ఛేంజీలైన బీఎస్ఈ, ఎన్ఎస్ఈ వ్యవస్థాగత ముప్పులను సమర్థవంతంగా ఎదుర్కోవడంతో పాటు మార్కెట్ స్థిరత్వాన్ని కాపాడాలన్నారు.

మూడోసారీ మోదీనే..

ఎన్నికల ఫలితాలపై అనిశ్చితి కారణంగా స్టాక్ మార్కెట్ సూచీలు గత కొన్ని రోజుల్లో తీవ్ర ఊగిసలాటలకు లోనవడంపై సీతారామన్ స్పందించారు. మూడోసారీ మోదీ ప్రభుత్వమే వస్తుందని, ఈసారీ స్థిరమైన ప్రభుత్వం ఏర్పాటవుతుందన్నారు. అంతేకాదు, ఈసారి తమ ప్రభుత్వం కనీస అధికారం..గరిష్ఠ పాలనపై దృష్టి సారించనున్నట్లు మంత్రి సంకేతాలిచ్చారు.

బ్లాక్‌స్టోన్ గూటికి హల్దీరామ్స్?

» ఏడీఐఏ, జీఐసీతో కలిసి కొనుగోలుకు ప్రపంచ పీఈ దిగ్గజం ప్రయత్నాలు
» రూ.66,400-70,500 కోట్ల స్థాయిలో హల్దీరామ్స్ మార్కెట్ విలువ!
» 76% వరకు వాటా కొనుగోలుకు చాన్స్

న్యూఢిల్లీ: ప్రపంచంలో అతిపెద్ద ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) కంపెనీ బ్లాక్‌స్టోన్.. భారత్‌కు చెందిన ప్రముఖ స్నాక్స్ తయారీ కంపెనీ హల్దీరామ్స్ స్నాక్స్ అండ్ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ (హెచ్ఎస్ఎఫ్‌పీఎల్)ను చేజిక్కించుకునే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిసింది. 87 ఏళ్ల చరిత్ర కలిగిన హల్దీరామ్స్‌లో మెజారిటీ (74-76 శాతం) వాటా కొనుగోలు చేసే అవకాశం ఉందని, ఇందులో భాగంగా కంపెనీ మార్కెట్ విలువను 800-850 కోట్ల డాలర్ల (రూ.66,400-70,500 కోట్లు) స్థాయిలో లెక్కగట్టవచ్చని సమాచారం. అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ), జీఐసీ సింగపూర్‌తో కన్సార్షియంగా ఏర్పడి బ్లాక్‌స్టోన్ ఈ కొనుగోలు జరపనుందని, హల్దీరామ్స్ ప్రమోటర్లకు ఇప్పటికే ఆఫర్ సమర్పించినట్లు తెలిసింది. ఈ ఒప్పందం ఖరారైతే గనుక భారత్‌లో పీఈ కంపెనీలు జరిపిన అతి పెద్ద కొనుగోళ్లలో ఒకటిగా నిలవనుంది.

87 ఏళ్ల చరిత్ర కలిగిన హల్దీరామ్స్ దేశంలోనే అతిపెద్ద ప్యాకేజ్డ్ స్నాక్ బ్రాండ్. 500 రకాల ప్యాకేజ్డ్ స్నాక్స్ ఇతర ఆహార ఉత్పత్తులను తయారీ చేయడంతోపాటు పంపిణీ చేస్తోంది. కంపెనీ ఉత్పత్తుల్లో నమ్‌కీన్, భుజియా, బిస్కెట్లు, స్వీట్లు, రెడీ టు ఈట్ మీల్స్, పాస్తా, నాన్ కార్బొనేటెడ్ బెవరేజెస్ ప్రముఖమైనవి. కంపెనీ భారత్‌లోనే కాకుండా 100 దేశాలకు తన ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ స్నాక్స్ వ్యాపార విక్రయాలు రూ.14,500 కోట్లుగా ఉన్నాయి.

మూడో రోజూ లాభాలొచ్చాయ్..

సెన్సెక్స్ 328 పాయింట్లు అప్

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు మూడో రోజూ లాభపడ్డాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు కొన్ని బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు మంగళవారం సూచీలను మరింత ముందుకు నడిపించాయి. గత నెలలో రిటైల్ ధరల ఆధారిత ద్రవ్యోల్బణం 11 నెలల కనిష్ఠ స్థాయికి తగ్గడం కూడా మార్కెట్‌కు కలిసివచ్చింది. ఒక దశలో 510 పాయింట్ల వరకు ఎగిసిన సెన్సెక్స్.. చివరికి 328.48 పాయింట్ల లాభంతో 73,104.61 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 113.80 పాయింట్ల వృద్ధితో 22,217.85 వద్ద క్లోజైంది.

అమెరికాలో ఐపీఓకు నోవెలిస్: హిందాల్కో ఇండస్ట్రీస్ అనుబంధ విభాగమైన నోవెలిస్ అమెరికాలో పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) కోసం అక్కడి క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ)కు దరఖాస్తు చేసుకుంది. ఐపీఓ అనంతరం నోవెలిస్ షేర్లను న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదు చేయనుంది.

అల్లైడ్ బ్లెండర్స్ ఐపీఓకు సెబీ ఆమోదం: ఆఫీసర్స్ చాయిస్ విస్కీ తయారీ సంస్థ అల్లైడ్ బ్లెండర్స్ రూ.1,500 కోట్ల ఐపీఓకు సెబీ ఆమోదం తెలిపింది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.1,000 కోట్ల తాజా ఈక్విటీ జారీతోపాటు ప్రమోటర్ల వాటాకు చెందిన రూ.500 కోట్ల విలువైన షేర్లను ఓఎఫ్ఎస్ పద్ధతిన విక్రయించనుంది.

పీఎస్‌బీల లాభాలు అదుర్స్

2023-24లో రూ.1.41 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) ఆర్థిక పరిస్థితి గణనీయంగా మెరుగుపడింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో దేశంలోని 12 పీఎస్‌బీలు రూ.1,41,203 కోట్ల నికర లాభం ఆర్జించాయి. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం (2022-23) సాధించిన రూ.1,04,609 కోట్లతో పోలిస్తే ఇది 35 శాతం ఎక్కువ. 2016-21 మధ్య కాలంలో ప్రభుత్వం సమకూర్చిన రూ.3,10,997 కోట్ల ఆర్థిక సాయంతో ఈ బ్యాంకుల ఆర్థిక పరిస్థితి గణనీయంగా మెరుగుపడింది. దీనికి తోడు పీఎస్‌బీల పనితీరు మెరుగు పరిచేందుకు ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు, పారదర్శకంగా మొండి బకాయిలు (ఎన్‌పీఏ) గుర్తించి వాటి వసూలుకు చర్యలు తీసుకోవడం కూడా ఇందుకు దోహదం చేసింది. గత ఆర్థిక సంవత్సరం పీఎస్‌బీలు నమోదు చేసిన రూ.1,41,203 కోట్ల లాభాల్లో 40 శాతం (రూ.71,077 కోట్లు) వాటా ఎస్‌బీఐదే కావటం విశేషం.

టోకు ద్రవ్యోల్బణం 13 నెలల గరిష్ఠం

న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) ఏప్రిల్‌లో 13 నెలల గరిష్ఠ స్థాయి 1.26 శాతంగా నమోదైంది. ఆహార వస్తువుల ధరలు ప్రత్యేకించి కూరగాయల ధరలు పెరగడం ఇందుకు కారణం. వరుసగా రెండు నెలలుగా డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం పెరుగుతూ వస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇది 0.20 శాతం ఉండగా మార్చిలో 0.53 శాతానికి పెరిగింది. కాగా గత ఏడాది ఏప్రిల్‌లో 0.79 శాతంగా ఉంది. గత ఏడాది మార్చిలో 1.41 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం తిరిగి 1.26 శాతానికి చేరడం ఇదే ప్రథమం.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,820 ▼	66,750 ▼	90,700 ▲
ముంబై	72,335 ▲	66,259 ▲	84,080 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

15వ తేదీ

హైదరాబాద్	545	విజయవాడ	540
వరంగల్	547	గోదావరి	540
చిత్తూరు	618	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	137	గోదావరి	147
వరంగల్	137	విజయవాడ	147
కరీంనగర్	137	గుంటూరు	147
మహబూబ్‌నగర్	137	ఒంగోలు	147
కర్నూలు	137	చిత్తూరు	152
విశాఖపట్నం	139		

ఈ ఏడాది చివరికి జొన్నగిరి గనుల్లో

పసిడి ఉత్పత్తి షురూ

దక్కన్ గోల్డ్ మైన్స్ వెల్లడి

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా జొన్నగిరి గనుల్లో ఈ ఏడాది చివరికల్లా పూర్తి స్థాయిలో పసిడి ఉత్పత్తి ప్రారంభం కానుంది. దక్కన్ గోల్డ్ మైన్స్ కంపెనీ ఈ గనుల్ని అభివృద్ధి చేస్తోంది. కంపెనీ ఇప్పటికే ఈ గనుల నుంచి ప్రయోగాత్మకంగా నెలకు కిలో చొప్పున బంగారం ఉత్పత్తి చేస్తోంది. పూర్తి స్థాయిలో ఉత్పత్తి ప్రారంభమైతే ఏటా 750 కిలోల వరకు ఈ గనుల నుంచి పసిడి వెలికి తీయవచ్చని అంచనా. దేశంలో ఒక ప్రైవేట్ కంపెనీ ఇంత పెద్ద మొత్తంలో పసిడి కోసం గనుల్ని అభివృద్ధి చేయడం ఇదే మొదటిసారి. జొన్నగిరితో పాటు ఆఫ్రికాలోని మొజాంబిక్ దేశంలోనూ దక్కన్ గోల్డ్ మైన్స్ అరుదైన లోహాల ఉత్పత్తికి సిద్ధమైంది. ఇందుకోసం అక్కడి ఒక కంపెనీతో జాయింట్ వెంచర్ (జేవీ) ఏర్పాటు చేసింది. ఈ జేవీలో దక్కన్ గోల్డ్ మైన్స్‌కి 51 శాతం వాటా ఉంది.

ఈ వారమే బిడ్డింగ్

రాజస్థాన్‌లోని రెండు పసిడి గనుల కోసం ఈ వారం బిడ్డింగ్ జరగనుంది. ఇప్పటికే వేదాంత గ్రూప్ కంపెనీ హిందుస్థాన్ జింక్, జిందాల్ పవర్, జేకే సిమెంట్‌తో సహా ఐదు కంపెనీలు ఇందు కోసం టెక్నికల్ బిడ్స్ సమర్పించాయి. ఈ ఐదు కంపెనీల టెక్నికల్ బిడ్స్‌ను అధికారులు ఆమోదించారు. ఈ వారం జరిగే వేలంలో ఈ ఐదు కంపెనీలు ఫైనాన్సియల్ బిడ్స్ సమర్పించాలి.

సాగర్ సిమెంట్ ఆదాయం రూ.752 కోట్లు

క్యూ4 లాభం రూ.11 కోట్లు
ఒక్కో షేరుకు 35% డివిడెండ్

హైదరాబాద్: గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24) మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో సాగర్ సిమెంట్ కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.752.45 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.11.58 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం (2022-23) ఇదే కాలంలో కంపెనీ రూ.802.58 కోట్ల ఆదాయంపై రూ.8.79 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ.2,558.73 కోట్ల ఆదాయంపై రూ.52.05 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.2,452.24 కోట్ల ఆదాయంపై రూ.9.61 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. కాగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు 35 శాతం (రూ.0.70) డివిడెండ్‌ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

రూ.470 కోట్ల పెట్టుబడులు: కార్యకలాపాల విస్తరణ కోసం 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాల్లో మొత్తం రూ.470 కోట్లు పెట్టుబడిగా పెట్టనున్నట్లు సాగర్ సిమెంట్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఇందులో రూ.255 కోట్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడులుగా పెట్టనుండగా మిగిలిన మొత్తాలను వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఇన్వెస్ట్ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు, పట్టణ రియల్ ఎస్టేట్ నుంచి ఆశించిన స్థాయిలో సిమెంట్‌కు డిమాండ్ ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ అంతగా లేదని పేర్కొన్నారు. కాగా, ఆంధ్రప్రదేశ్‌లోని గుడిపాడు, జీరాబాద్ సిమెంట్ ప్లాంట్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని 2025-26 ఆర్థిక సంవత్సరం నాటికి 0.25 మిలియన్ టన్నులు, 0.50 మిలియన్ టన్నులకు పెంచుతున్నట్లు ఆయన తెలిపారు. అలాగే దాచేపల్లి ప్లాంట్‌లో క్లింకర్ సామర్థ్యాన్ని 1.85 మిలియన్ టన్నుల నుంచి 2.31 మిలియన్ టన్నులకు, సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 2.25 మిలియన్ టన్నుల నుంచి 3 మిలియన్ టన్నులకు పెంచుతున్నట్లు శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు.

ఎయిర్‌టెల్ లాభంలో క్షీణత

న్యూఢిల్లీ: మార్చితో ముగిసిన త్రైమాసికంలో భారతి ఎయిర్‌టెల్ నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 31 శాతం క్షీణించి రూ.2,072 కోట్లకు దిగజారింది. నైజీరియాకు చెందిన నైరా విలువ తగ్గింపే ఇందుకు ప్రధాన కారణం. అంతకు ముందు ఏడాది ఇదే కాలంలో కంపెనీ లాభం రూ.3,005.6 కోట్లుంది. కాగా కంపెనీ కన్సాలిడేటెడ్ ఆదాయం మాత్రం 4.4 శాతం పెరిగి రూ.37,599.1 కోట్లుగా నమోదైంది. మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి కూడా భారతి ఎయిర్‌టెల్ లాభం 10.5 శాతం క్షీణించి రూ.7,467 కోట్లకు పరిమితం అయింది. అయితే ఆదాయం మాత్రం 7.7 శాతం వృద్ధితో రూ.1,39,144.8 కోట్ల నుంచి రూ.1,49,982.4 కోట్లకు పెరిగింది.



టీవీఎస్ మోటార్ తన ఎలక్ట్రిక్ స్కూటర్ టీవీఎస్ ఐక్యూబ్ పోర్టుఫోలియోలో సరికొత్త శ్రేణి స్కూటర్లను విడుదల చేసింది. ఈ కొత్త శ్రేణి ఎలక్ట్రిక్ స్కూటర్ల ప్రారంభ ధర రూ.94,999 (ఎక్స్‌షోరూమ్). మూడు బ్యాటరీ ఆప్షన్స్.. 2.2, 3.4, 5.1 కేడబ్ల్యూహెచ్‌తో ఐక్యూబ్ అందుబాటులో ఉండనున్నాయి.

1 బీఎల్ఎస్ ఈ-సర్వీసెస్ లిమిటెడ్ (బీఎల్ఎస్ఈ).. మార్చితో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.309.60 కోట్ల ఆదాయంపై రూ.33.5 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో రూ.246.30 కోట్ల ఆదాయంపై రూ.20.3 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. కాగా మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ.78.7 కోట్ల ఆదాయంపై రూ.14.4 కోట్ల పన్ను చెల్లింపునకు ముందు లాభాన్ని ఆర్జించింది.

1 ట్రెంట్ బ్రాండ్ కింద టాటా గ్రూప్ నిర్వహిస్తున్న అపారెల్ సంస్థ వెస్ట్‌సైడ్.. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరులో కొత్త స్టోర్‌ను ప్రారంభించింది. దేశవ్యాప్తంగా సంస్థకిది 243వ స్టోర్. ప్రథమ, ద్వితీయ శ్రేణి నగరాల్లో కార్యకలాపాల విస్తరణలో భాగంగా కంపెనీ ఈ స్టోర్‌ను ఏర్పాటు చేసింది.

స్పోర్ట్స్

నేటి మ్యాచ్ | రాత్రి 7.30 గం. | వేదిక: గువాహటి
రాజస్థాన్ X పంజాబ్

నోటిఫికేషన్ వచ్చేసింది

టీమిండియా కోచ్ పదవికి దరఖాస్తుల ఆహ్వానం

న్యూఢిల్లీ: మరో నెలన్నరలో కోచ్ ద్రవిడ్ పదవి ముగియనుంది. ఈనేపథ్యంలో టీమిండియా ప్రధాన కోచ్ పదవికి బీసీసీఐ దరఖాస్తులు ఆహ్వానించింది. మూడున్నర సంవత్సరాల పదవీకాలం కలిగిన ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకొనేందుకు ఈనెల 27 తుది గడువు. అప్లికేషన్లను పరిశీలించిన తర్వాత వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహించి ఆపై అభ్యర్థిని ఎంపిక చేస్తారు. ఎంపికైనవారు జూలై 1న బాధ్యతలు చేపట్టి 2027 వన్డే వరల్డ్ కప్ ముగిసే వరకు పదవిలో కొనసాగుతారని బోర్డు తెలిపింది. ఇక దరఖాస్తు చేసుకొనే వారి వయస్సు 60లోపు ఉండాలి. కనీసం 30 టెస్ట్‌లు లేదా 50 వన్డేలు ఆడి ఉండాలి. లేదా టెస్ట్‌లు ఆడుతున్న జట్టుకు కనీసం రెండేళ్లు ప్రధాన కోచ్‌గా వ్యవహరించి ఉండాలి. ఐసీసీ అనుబంధ దేశ/ఐపీఎల్/అందుకు సమానమైన ఇంటర్నేషనల్ లీగ్/ఫస్ట్‌క్లాస్/జాతీయ 'ఏ' జట్లకు కనీసం మూడు సంవత్సరాలు హెడ్ కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించి ఉండాలి. అనుభవం ఆధారంగా/చర్చల ద్వారా వేతనం ఉంటుందని పేర్కొంది. మూడు ఫార్మాట్లలో భారత జట్టు ప్రదర్శన, నిర్వహణ హెడ్ కోచ్‌దేనని స్పష్టంజేసింది. అతడికింద 14 నుంచి 16 మంది సహాయ సిబ్బంది పని చేస్తారని పేర్కొంది.

లఖ్‌నవూకు కష్టమే!

చివరి మ్యాచ్‌లో గెలిచిన ఢిల్లీ
చెలరేగిన పోరెల్, స్టబ్స్
ఈ ఫలితంతో ప్లేఆఫ్స్‌కు రాజస్థాన్



న్యూఢిల్లీ: గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో నిరాశపరిచిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ప్లేఆఫ్స్ ఆశలను దాదాపుగా దూరం చేసుకుంది. అటు తమ చివరి లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఆల్‌రౌండ్‌షోతో మురిపించింది. అభిషేక్ పోరెల్ (33 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 58), ట్రిస్టన్ స్టబ్స్ (25 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 57 నాటౌట్) మెరుపు అర్ధసెంచరీలతో ఆకట్టుకోగా, మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 19 పరుగులతో లఖ్‌నవూపై గెలిచింది. దీంతో 14 పాయింట్లతో ఐదో స్థానానికి చేరిన ఢిల్లీ సాంకేతికంగా రేసులో ఉన్నా.. నెట్‌రన్‌రేట్‌లో ఇతర జట్లకన్నా వెనుకంజలో ఉంది. అటు లఖ్‌నవూ తమ ఆఖరి మ్యాచ్ గెలిచి 14 పాయింట్లు సాధించినా ముందుకెళ్లడం దాదాపు అసాధ్యమే. ఇక ఢిల్లీ గెలుపుతో రాజస్థాన్ రాయల్స్ (16) ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా ఢిల్లీ 20 ఓవర్లలో 4 వికెట్లకు 208 పరుగులు చేసింది. హోప్ (38), కెప్టెన్ పంత్ (33) ఫర్వాలేదనిపించారు. నవీనుల్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో లఖ్‌నవూ 20 ఓవర్లలో 9 వికెట్లకు 189 రన్స్ చేసి ఓడింది. నికోలస్ పూరన్ (27 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్లతో 61), అర్షద్ ఖాన్ (33 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లతో 58 నాటౌట్) వేగంగా ఆడారు. 3 వికెట్లు తీసిన ఇషాంత్ శర్మ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

పూరన్, అర్షద్ పోరాటం: ఓ మాదిరి ఛేదనలో లఖ్‌నవూ తొలి ఓవర్ నుంచే తడబడింది. పూరన్, ఎనిమిదో నెంబర్ బ్యాటర్ అర్షద్ ఖాన్ పోరాటం ఆకట్టుకున్నా ఫలితం లేకపోయింది. ఇషాంత్ పదునైన బంతులకు రాహుల్ (5), డికాక్ (12), హుడా (0) వికెట్లను కోల్పోయింది. ఇక స్టొయినిస్ (5)ను అక్షర్ అవుట్ చేశాడు. 44 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన వేళ పూరన్ మాత్రం ఢిల్లీ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నాడు. నాలుగో ఓవర్‌లోనే అతను 4,6,4,6తో 20 రన్స్ రాబట్టాడు. ఆరో ఓవర్‌లోనూ 6,4 బాదడంతో జట్టు పవర్‌ప్లేలో 59/4తో నిలిచింది. ఆ తర్వాతా ఎడాపెడా బౌండరీలతో పూరన్ 20 బంతుల్లోనే ఫిఫ్టీ చేసినా.. మరోఎండ్‌లో అతడికి సహకారం అందలేదు. చివరకు 12వ ఓవర్‌లో నికోలస్‌ను ముకేశ్ అవుట్ చేశాడు. బదోని (6), క్రునాల్ (18) నిరాశపర్చగా, అర్షద్ గెలుపుపై ఆశలు రేపాడు. 16వ ఓవర్‌లో యుధ్‌వీర్ (14) 4,6తో ఆకట్టుకోగా.. తర్వాతి ఓవర్‌లో అర్షద్ 6,6,4తో 18 రన్స్ అందించాడు. అదే ఓవర్‌లో యుధ్ వీర్ నిష్క్రమించినా, అర్షద్ ఓ సిక్సర్‌తో 25 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. కానీ ఆఖరి ఓవర్‌లో 23 రన్స్ అవసరమవగా రసిఖ్ 3 పరుగులే ఇచ్చి లఖ్‌నవూకు ఓటమి రుచి చూపించాడు.

ఆరంభంలో అభిషేక్.. ఆఖర్లో స్టబ్స్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ జోరంతా పవర్‌ప్లే.. డెత్ ఓవర్లలోనే సాగింది. ఓపెనర్ అభిషేక్ పోరెల్ ధనాధన్ బ్యాటింగ్‌తో చెలరేగాడు. ఆ తర్వాత మధ్య ఓవర్లలో స్పిన్నర్లను ఎదుర్కోవడంలో జట్టు తడబాటుకు లోనైంది. కానీ ఆఖర్లో స్టబ్స్ ఇన్నింగ్స్‌తో కాస్త పుంజుకున్న ఢిల్లీ ఆశించిన స్కోరు చేయగలిగింది. తొలి ఓవర్‌లోనే ఫ్రేజర్‌ను పేసర్ అర్షద్ డకౌట్ చేసి ఢిల్లీకి గట్టి షాకిచ్చాడు. కానీ పోరెల్ మాత్రం అతడి లోటును భర్తీ చేస్తూ చెలరేగాడు. మూడో ఓవర్‌లో 4,4,6,4తో 21 పరుగులు రాబట్టాడు. తర్వాతి ఓవర్‌లోనే హోప్ సైతం 4,4,6తో 16 రన్స్ అందించడంతో జట్టు కుదురుకుంది. ఇక ఆరో ఓవర్‌లో పోరెల్ 6,6,4తో పవర్‌ప్లేలో జట్టు 73/1 పరుగులతో పటిష్ఠంగానే కనిపించింది. కానీ ఆ తర్వాత స్పిన్నర్లు బిష్ణోయ్, క్రునాల్ ఢిల్లీని కట్టడి చేశారు. దీంతో దూకుడు మీదున్న పోరెల్ సైతం రన్స్ చేసేందుకు ఇబ్బందిపడ్డాడు. 21 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేసిన పోరెల్ ఆ తర్వాత మరో 8 రన్స్ చేసేందుకు 12 బంతులు తీసుకున్నాడు. హోప్‌ను బిష్ణోయ్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 92 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే పేసర్ నవీనుల్.. పోరెల్‌ను వెనక్కిపంపాడు. ఈ దశలో కెప్టెన్ పంత్, స్టబ్స్ నాలుగో వికెట్‌కు 47 పరుగులు జత చేశారు. స్టబ్స్ డెత్ ఓవర్లలో మరింత చెలరేగాడు. 16వ ఓవర్‌లో 6,4,4తో 18 రన్స్.. 19వ ఓవర్‌లో 4,6,6తో 21 రన్స్ అందించి స్కోరు బోర్డును పరిగెత్తించడంతో పాటు 22 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. అలాగే ఆఖరి ఓవర్‌లో స్టబ్స్, అక్షర్ (14 నాటౌట్) ఇచ్చిన క్యాచ్‌లను బిష్ణోయ్ వదిలేయగా డీసీ స్కోరు 200 దాటింది.

స్కోరుబోర్డు

ఢిల్లీ: ఫ్రేజర్ (సి) నవీనుల్ (బి) అర్షద్ 0, అభిషేక్ పోరెల్ (సి) పూరన్ (బి) నవీనుల్ 58, హోప్ (సి) రాహుల్ (బి) బిష్ణోయ్ 38, పంత్ (సి) హుడా (బి) నవీనుల్ 33, స్టబ్స్ (నాటౌట్) 57, అక్షర్ (నాటౌట్) 14, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 208/4; వికెట్ల పతనం:** 1-2, 2-94, 3-111, 4-158; **బౌలింగ్:** అర్షద్ 3-0-45-1, మొహిసిన్ 4-0-29-0, యుధ్‌వీర్ 2-0-28-0, నవీనుల్ 4-0-51-2, బిష్ణోయ్ 4-0-26-1, క్రునాల్ 2-0-20-0, దీపక్ హుడా 1-0-9-0.

లఖ్‌నవూ: డికాక్ (సి) ముకేశ్ (బి) ఇషాంత్ 12, రాహుల్ (సి) ముకేశ్ (బి) ఇషాంత్ 5, స్టొయినిస్ (స్టంప్డ్) పంత్ (బి) అక్షర్ 5, దీపక్ హుడా (ఎల్బీ) ఇషాంత్ 0, పూరన్ (సి) అక్షర్ (బి) ముకేశ్ 61, బదోని (సి) గుల్బదిన్ (బి) స్టబ్స్ 6, క్రునాల్ (స్టంప్డ్) పంత్ (బి) కుల్దీప్ 18, అర్షద్ (నాటౌట్) 58, యుధ్‌వీర్ (సి) హోప్ (బి) ఖలీల్ 14, బిష్ణోయ్ (రనౌట్) 2, నవీనుల్ (నాటౌట్) 2, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 20 ఓవర్లలో 189/9; వికెట్ల పతనం:** 1-7, 2-24, 3-24, 4-44, 5-71, 6-101, 7-134, 8-167, 9-183; **బౌలింగ్:** ఇషాంత్ 4-0-34-3, ఖలీల్ 2-0-22-1, అక్షర్ 1-0-20-1, ముకేశ్ 4-0-33-1, కుల్దీప్ 4-0-33-1, స్టబ్స్ 1-0-4-1, గుల్బదిన్ 1-0-12-0, రసిఖ్ 3-0-30-0.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
కోల్‌కతా	13	9	3	1	19	1.428
రాజస్థాన్	12	8	4	0	16	0.349
చెన్నై	13	7	6	0	14	0.528
హైదరాబాద్	12	7	5	0	14	0.406
ఢిల్లీ	14	7	7	0	14	-0.377
బెంగళూరు	13	6	7	0	12	0.387
లఖ్‌నవూ	13	6	7	0	12	-0.787
గుజరాత్	13	5	7	1	11	-1.063
ముంబై	13	4	9	0	8	-0.271
పంజాబ్	12	4	8	0	8	-0.423

రేసులో లక్ష్మణ్?

లాంగర్, గంభీర్ కూడా!

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)





టీమిండియా కోచ్ పదవి మరోసారి చేపట్టేందుకు ద్రవిడ్ సుముఖంగా లేకపోతే..అతడి వారసుడు ఎవరన్న చర్చ బయల్దేరింది. అందులో ప్రముఖంగా వినిపిస్తున్న పేరు వీవీఎస్ లక్ష్మణ్. అలాగే గౌతమ్ గంభీర్, ఆసీస్ మాజీ కోచ్ జస్టిన్ లాంగర్ పేర్లు ప్రస్తావనకు వస్తున్నాయి. లక్ష్మణ్ కనుక దరఖాస్తు చేసుకొంటే..హాట్ ఫేవరెట్ అతడే అనొచ్చు. 49 ఏళ్ల లక్ష్మణ్ జాతీయ క్రికెట్ అకాడమీ చీఫ్‌గా మూడున్నరేళ్లుగా ఇండియా 'ఏ', అండర్-19 జట్ల రూపకల్పనలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాడు. ద్రవిడ్ విశ్రాంతి తీసుకున్న సమయాల్లో భారత జట్టు కోచింగ్ బాధ్యతలు నిర్వర్తించాడు. లక్ష్మణ్ కోచ్‌గా ఆసియా క్రీడలు, ఆసీస్‌తో మనదేశంలో, ఇంగ్లండ్‌తో ఆ దేశంలో, న్యూజిలాండ్, ఐర్లాండ్‌లలో ఆయా దేశాలలో ద్వైపాక్షిక టీ20 సిరీస్‌లలో భారత్ తలపడింది.

గంభీర్: కెప్టెన్‌గా కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు రెండు ఐపీఎల్ టైటిళ్లు అందించడంతో పాటు లఖ్‌నవూ మెంటార్‌గా ఆ జట్టును తొలి రెండేళ్ల ప్లేఆఫ్స్‌కు చేర్చడంలో గంభీర్‌ది కీలక పాత్ర. పైగా.. గంభీర్‌కు మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు అమోఘమన్న పేరుంది. ఈ ఐపీఎల్‌లో గంభీర్ మార్గదర్శనంలో కోల్‌కతా ఇప్పటికే ప్లేఆఫ్స్‌కు చేరింది కూడా. అయితే గంభీర్ వ్యక్తిత్వపరంగా చూస్తే.. బీసీసీఐ పెద్దలు అడగకుండా తనంతట తాను కోచ్ పదవికి అతడు దరఖాస్తు చేస్తాడా అన్నది డౌటే. కోల్‌కతా యజమాని షారుక్‌ఖాన్‌తో గంభీర్‌కున్న గాఢ అనుబంధం దృష్ట్యా..కోచ్ పదవికి గంభీర్ దరఖాస్తు చేయడనే మరో వాదన కూడా ఉంది. ఇంకా..తన పదవి విషయంలో గంభీర్ పూర్తి స్వేచ్ఛను కోరుకొనే మనస్తత్వం. మరోవైపు రాబోయే రెండేళ్లు విరాట్ కోహ్లీ జట్టులో ఉండడం ఖాయం. మరి..గంభీర్, కోహ్లీ గత సంబంధాల కోణంలో చూస్తే..గంభీర్ కోచ్‌గా వెళతాడా అనేది మరో ముఖ్యమైన అంశం. అయితే ప్రస్తుత కెప్టెన్ రోహిత్, గంభీర్ మధ్య చక్కటి అనుబంధం ఉండడం విశేషం.

లాంగర్: ఆస్ట్రేలియాకు యాషెస్, టీ20 వరల్డ్ కప్ అందించిన కోచ్ జస్టిన్ లాంగర్‌కు తిరుగులేని వ్యూహాత్మక నిపుణుడిగా పేరుంది. టీమిండియా కోచ్ పదవిని చేపట్టే అవకాశాన్ని పరిశీలిస్తానని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కూడా లాంగర్ చెప్పడం గమనార్హం.

మనిక@24



న్యూఢిల్లీ: భారత టేబుల్ టెన్నిస్ స్టార్ మనికా బాత్రా కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంక్‌కు చేరుకుంది. సింగిల్స్‌లో మనిక 24వ ర్యాంక్‌తో టాప్-25 ర్యాంకింగ్స్ జాబితాలో స్థానం సంపాదించిన తొలి భారత మహిళ ప్యాడ్లర్‌గా ఘనత సాధించింది. సౌదీలో ఇటీవల జరిగిన టోర్నీలో అద్భుత ప్రదర్శన కనబర్చిన మనిక ఏకంగా 15 స్థానాలు ఎగబాకింది.

గోయెంకా దిద్దుబాటు చర్యలు

» రాహుల్‌తో ప్రత్యేక విందు



న్యూఢిల్లీ: కెప్టెన్ కేఎల్ రాహుల్‌పై బహిరంగంగా ఆగ్రహం వ్యక్తం జేసి వివాదంలో కూరుకుపోయిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ యజమాని సంజీవ్ గోయెంకా దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఈక్రమంలో సోమవారం రాత్రి కేఎల్ రాహుల్‌ను ఆయన ప్రత్యేకంగా విందుకు ఆహ్వానించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గత బుధవారం సన్‌రైజర్స్ చేతిలో లఖ్‌నవూ 10 వికెట్లతో ఓడిన అనంతరం గ్రౌండ్‌లోకి వచ్చిన సంజీవ్ గోయెంకా కెప్టెన్ రాహుల్‌పై ఆగ్రహం వ్యక్తంజేయడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.

గౌరవ్‌కు పతకం ఖాయం

అస్తానా (కజకిస్థాన్): ఎలోర్డా కప్ టోర్నీలో భారత బాక్సర్ గౌరవ్ చౌహాన్ (+92 కిలోలు) సెమీఫైనల్ చేరి కనీసం కాంస్య పతకం ఖరారు చేసుకున్నాడు. మంగళవారం జరిగిన బౌట్‌లో గౌరవ్ 3-2తో స్థానిక బాక్సర్ డానియల్‌పై నెగ్గాడు. ఇక, వెటరన్ స్టార్ శివ థాపా (63.5 కి) ఆరంభ బౌట్‌లో 1-4తో కజకిస్థాన్‌కే చెందిన అబ్దులి అల్మత్ చేతిలో చిత్తయ్యాడు.

షార్జా చెస్‌లో

అర్జున్ శుభారంభం

షార్జా: తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేసి అర్జున్ షార్జా మాస్టర్స్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో శుభారంభం చేశాడు. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో ఎల్తాజ్ (అజర్‌బైజాన్)పై అర్జున్ 45వ ఎత్తుల్లో గెలిచాడు. ద్రోణవల్లి హారిక తొలి గేమ్‌ను డ్రా చేసుకోగా, ప్రణవ్ ఓటమి పాలయ్యాడు.

బంగ్లా వరల్డ్ కప్

జట్టులో టస్కిన్

ఢాకా: టీ20 ప్రపంచకప్‌లో పాల్గొనే బంగ్లాదేశ్ జట్టును మంగళవారం ప్రకటించారు. ప్రస్తుతం గాయంతో బాధపడుతున్న పేసర్ టస్కిన్ అహ్మద్‌ను జట్టుకు ఎంపిక చేయడం గమనార్హం. జట్టు కెప్టెన్‌గా నజ్ముల్ హొస్సేన్ షంటో వ్యవహరిస్తాడు. 2007 నుంచి ప్రతీ వరల్డ్‌కప్ ఆడుతున్న వెటరన్ షకీబ్ సైతం జట్టులో ఉన్నాడు.

సెమీస్‌కొస్తే.. భారత్ ఆడేది గయానాలో

టీ20 ప్రపంచ కప్

న్యూఢిల్లీ: అమెరికా, వెస్టిండీస్ సంయుక్తంగా ఆతిథ్యమిచ్చే టీ20 వరల్డ్ కప్ 'ప్లేయింగ్ కండీషన్స్'ను ఐసీసీ మంగళవారం విడుదలజేసింది. టీమిండియా కనుక నాకౌట్‌కు చేరితే రెండో సెమీఫైనల్ ఆడుతుంది. జూన్ 27న గయానాలో రెండో సెమీస్ జరుగుతుంది. కాగా, జూన్ 29న బార్బడోస్‌లో జరిగే ఫైనల్‌కు రిజర్వ్ డే (జూన్ 30)ను ఏర్పాటు చేశారు. ట్రినిడాడ్, గయానా సమయాలను ఆధారం చేసుకొని భారత్ రెండో సెమీఫైనల్ ఆడేలా ఐసీసీ నిర్ణయించింది. తొలి సెమీఫైనల్ జూన్ 26న ట్రినిడాడ్ సమయం ప్రకారం రాత్రి 8.30కి ప్రారంభమవుతుంది. అంటే జూన్ 27న భారత సమయం ప్రకారం ఉదయం 6.30కి ఈ మ్యాచ్ మొదలవుతుంది. ఇక గయానాలో నిర్వహించే రెండో సెమీస్ వారి సమయం ప్రకారం ఉదయం 10.30కి మొదలవుతుంది. అంటే..భారత కాలమానం ప్రకారం రాత్రి 8గం.కు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. భారత క్రికెట్ ఫ్యాన్స్‌కు సౌకర్యంగా ఉండేలా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఐసీసీ వివరించింది. వాతావరణ అవరోధాలను అధిగమించేందుకు.. రెండు సెమీఫైనల్స్‌కు 250 నిమిషాల చొప్పున అదనపు సమయం కేటాయించారు.



పిఠాపురం మండలం కత్తులగూడెంలో ఓటుహక్కు వినియోగించు కునేందుకు సోమవారం రాత్రి 10 గంటలకు బారులు తీరిన ఓటర్లు

81% పోలింగ్ నమోదు కావొచ్చు!

» పూర్తి వివరాలు రావాల్సి ఉంది.. సీఈవో ముఖేశ్ కుమార్ మీనా

అమరావతి, మే 14(ఆంధ్రజ్యోతి): "మా అంచనా ప్రకారం 81 శాతం పోలింగ్ నమోదు కావొచ్చు. పూర్తి వివరాలు రావాల్సి ఉంది" అని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్ కుమార్ మీనా అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో సోమవారం అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత కూడా పోలింగ్ జరిగిందన్నారు. మరికొన్ని చోట్ల 2 గంటల వరకు సాగిందని తెలిపారు. 2019 ఎన్నికల్లో 79.02 శాతంగా పోలింగ్ నమోదైందని, 0.6 శాతం పోస్టల్ బ్యాలెట్లతో కలిపి మొత్తం 79.8 శాతం నమోదైందన్నారు. ఈ ఎన్నికల్లో సోమవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 78.25 శాతంగా పోలింగ్ నమోదైనట్టు తెలిపారు. 1.2 శాతం పోస్టల్ బ్యాలెట్లతో కలిపి 79.4శాతంగా ఉందన్నారు. తమ అంచనా ప్రకారం రాష్ట్రంలో 81 శాతం పోలింగ్ నమోదు కావొచ్చని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 34 పోలింగ్ కేంద్రాల్లో అర్ధరాత్రి దాటాక కూడా పోలింగ్ ప్రక్రియ సాగింది. విశాఖపట్నం, శ్రీకాకుళం, సత్యసాయి, కృష్ణా, నెల్లూరు, తూర్పుగోదావరి, అనంతపురం జిల్లాల్లోని ఆయా పోలింగ్ కేంద్రాల్లో సోమవారం అర్ధరాత్రి 12 గంటల వరకు, మంగళవారం తెల్లవారు జామున 2 గంటల వరకు కూడా ఓటర్లు తమ హక్కును వినియోగించుకున్నారు.

పిఠాపురంలో రికార్డు స్థాయిలో 86.63% పోలింగ్

పిఠాపురం, మే 14: కాకినాడ జిల్లా పిఠాపురం అసెంబ్లీ స్థానంలో రికార్డు స్థాయి పోలింగ్ నమోదైంది. నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 86.63 శాతం ఓట్లు కురిశాయి. జనసేనాని పవన్ కల్యాణ్ ఇక్కడ పోటీచేసిన సంగతి తెలిసిందే. వైసీపీ అభ్యర్థిగా వంగా గీత బరిలో ఉన్నారు. ఇక్కడ గత ఎన్నికల్లో 81.1 శాతం పోలింగ్ నమోదైంది. ఈ దఫా ఐదున్నర శాతం ఎక్కువగా ఓట్లు పోలవడంతో ఇది ఎవరికి వరంగా మారుతుందోనన్న చర్చ జోరుగా సాగుతుంది. ఈ సారి నియోజకవర్గంలో అర్హులైన ఓటర్లు 2,36,409 మంది ఉండగా.. 2,04,811 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు.

జయం కూటమిదే: పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, మే 14: 'ధర్మం పక్షాన నిలబడి ఓటేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతాపూర్వక అభినందనలు' అంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం పార్లమెంటు అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఆమె మంగళవారం ఎక్స్‌లో స్పందించారు. "కౌరవులకు, గౌరవులకు మధ్య జరిగిన కురుక్షేత్ర మహా సంగ్రామంలో ధర్మం పక్షాన నిలచి కూటమికి ఓటు వేసిన మీ అందరికీ నా అభినందనలు. రాజమండ్రి నుంచి తెలుగుదేశం, జనసేన మద్దతుతో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన నన్ను ఆదరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియచేస్తున్నా. జయం మనదే... విజయం మనదే... ఘన విజయం మనందరిదీ..!' అని పేర్కొన్నారు. ఇక, వైసీపీ రాక్షస పాలనను అంతమొందించేందుకు ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లందరికీ కూటమి నేతలు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో కూటమి నేతలు వర్ల రామయ్య (టీడీపీ), చిల్లపల్లి శ్రీనివాసరావు (జనసేన), లంకా దినకర్ (బీజేపీ) మీడియాతో మాట్లాడారు. వైసీపీ ఎన్ని ఆటంకాలు సృష్టించినా మొక్కవోని దీక్షతో ఓటర్లు ఓట్లు వేశారు. మారణాయుధాలతో భయభ్రాంతులకు గురిచేసినా, బాధల్ని, బెదిరింపులను లెక్కచేయకుండా ఓట్లు వేయడం అభినందనీయం' అని అన్నారు.

నాతో నడిచినవారందరికీ కృతజ్ఞతలు: షర్మిల

అమరావతి, మే 14(ఆంధ్రజ్యోతి): గత కొన్నివారాలుగా రాత్రనకా పగలనకా నాతో నడిచిన వారికి, కడప లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం ఇచ్చిన రాహుల్‌గాంధీకి ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఈ మేరకు ఆమె ఎక్స్‌లో ట్వీట్ చేశారు. 'గత కొన్నివారాలుగా, పగలనకా, రేయనకా, కష్టాల కోర్చి, బాధలను మింగి, సవాళ్లకు ఎదురునిలిచి, నన్ను నమ్మి, రాజశేఖరరెడ్డి బిడ్డగా, మీ గొంతుగా నన్ను ఆదరించి, నా ఈ పోరాటంలో నాతో కలసి నడచిన కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు, రాహుల్‌గాంధీకీ అందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు' అని షర్మిలరెడ్డి ట్వీట్ చేశారు.

ప్రజాస్వామ్యాన్ని విజేతగా నిలిపిన ఓటర్లు

» ఓటరు చైతన్యంపై సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ హర్షం

అమరావతి, మే 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఓటర్లు ప్రజాస్వామ్యాన్ని విజేతగా నిలబెట్టారని సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ పేర్కొంది. రాష్ట్రంలో జరిగిన పోలింగ్‌లో మునుపెన్నడూ లేనివిధంగా తమ ఓటుహక్కును వినియోగించుకున్న ఓటర్ల వివేకాన్ని అభినందిస్తున్నామని సీఎఫ్‌డీ కార్యదర్శి నిమ్మగడ్డ రమేష్‌కుమార్, ఉపాధ్యక్షులు ఎల్వీ సుబ్రహ్మణ్యం, జస్టిస్ భవానీప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్ధరాత్రి వరకు ఓటర్లు క్యూలైన్లలో వేచి ఉండటం వారి చైతన్యానికి, ప్రజాస్వామ్య స్ఫూర్తికి సంతకేమని పేర్కొన్నారు.

వైసీపీ దాడులపై చర్యలు తీసుకోండి

» అదనపు బలగాలు పంపండి.. డీజీపీకి చంద్రబాబు ఫోన్

అమరావతి, మే 14(ఆంధ్రజ్యోతి): పోలింగ్ అనంతరం కొన్ని నియోజకవర్గాల్లో జరుగుతున్న వైసీపీ దాడులపై డీజీపీకి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు మంగళవారం ఫోన్ చేశారు. డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాతో ఆయన ఫోన్లో మాట్లాడారు. ఈ దాడులను ఆపడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 'పోలింగ్ తర్వాత మాచర్ల వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఒక ప్రణాళికతో దాడులకు పాల్పడుతున్నాడు. తాడిపత్రి, చంద్రగిరి నియోజకవర్గాల్లో కూడా ఇవే తరహా ఘటనలు జరుగుతున్నాయి. వీటిని అరికట్టడానికి ఆ నియోజకవర్గాలకు అదనపు బలగాలు పంపాలి' అని చంద్రబాబు డీజీపీకి విజ్ఞప్తి చేశారు. చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిపై వైసీపీ గూండాల దాడిని చంద్రబాబు తీవ్రంగా ఖండించారు. 'ఓటమికి భయపడిన పిరికిపందలే ఈ దాడులకు దిగుతున్నారు. పోలింగ్ అనంతరం జరుగుతున్న ఈ దాడులను నివారించడంలో... ప్రజలకు, ప్రతిపక్ష పార్టీల నాయకులకు రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలం అవుతున్నారు.ఈసీ, డీజీపీ, ఎస్పీలు దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాలి' అని కోరారు.

31 బూత్‌ల్లో రీ పోలింగ్ జరపాలి: టీడీపీ

అమరావతి, మే 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ అరాచకాలకు పాల్పడిన 31 బూత్‌ల్లో రీ పోలింగ్ జరపాలని టీడీపీ నేతలు కోరారు. సచివాలయంలో టీడీపీ నేతలు వర్ల రామయ్య, నన్నపనేని రాజకుమారి, మన్నవ సుబ్బారావు తదితరులు సీఈవో మీనాను కలిశారు. అనంతపురం అర్బన్ 7, సత్తెనపల్లి 6, దర్శి 5, ఒంగోలు 5, మాచర్ల 4, పుట్టపర్తి 2, శ్రీకాళహస్తి, మదనపల్లి, చిత్తూరు ఒక్కొక్క బూత్‌లో రీ పోలింగ్ కోరారు.

రికార్డు బద్దలైంది!

(మొదటి పేజీ తరువాయి)

ఏడాది	ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
1957	55,61,345	36,03,585	46.94
1962	1,90,07,856	1,21,65,283	64
1967	2,09,34,068	1,44,76,108	69.15
1972	2,46,07,903	1,46,93,030	59.71
1978	2,83,86,334	2,06,98,706	72.92
1983	3,18,46,694	2,15,60,642	67.7
1985	3,45,87,372	2,33,70,750	67.57
1989	4,24,48,805	2,98,99,530	70.44
1994	4,47,25,091	3,17,63,466	71.02
1999	4,96,54,389	3,43,34,842	69.15
2004	5,11,46,498	3,57,80,385	69.96
2009	5,78,92,259	4,20,96,866	72.72
2014	3,67,21,608	2,86,27,827	77.96
2019	3,93,45,717	3,13,33,163	79.88

అర్ధరాత్రి వరకు కొనసాగింది. వీటిలో 34 కేంద్రాల్లో అర్ధరాత్రి దాటిన తర్వాత మంగళవారం తెల్లవారు జామున 2 గంటల వరకు కూడా కొనసాగడం గమనార్హం. ఫలితంగా పోలింగ్ శాతం అంచనాలకు మించి నమోదైంది. మరోవైపు, 1957 నుంచి 2009 వరకు ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లోనూ, 2014, 2019లో విభజిత ఏపీలో జరిగిన ఎన్నికల్లోనూ ఈ స్థాయిలో పోలింగ్ నమోదు కాకపోవడం గమనార్హం. ఇక, పథకాలు పొందిన వారితోపాటు ఏపీ ఎన్నికల్లో ఓటేసేందుకు పొరుగు రాష్ట్రాల(తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు తదితర) నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా ఓటర్లు తరలి వచ్చారు. అదేవిధంగా కొత్తగా హక్కు పొందిన యువత కూడా పోలింగ్ బూతులకు పోటెత్తారు. ఈ కారణంగానే పోలింగ్ శాతం అంచనాలకుమించి నమోదైనట్టు తెలుస్తోంది.

లెక్క తేలుతోంది!

భారీ పోలింగ్‌పై టీడీపీలో సంతృప్తి

» ప్రభుత్వ వ్యతిరేకత ప్రతిఫలించిందని విశ్లేషణ

» సీట్లు, మెజారిటీపైనే ప్రధాన చర్చ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



ప్రధాని మోదీ నామినేషన్ సందర్భంగా ఆయనను సత్కరించి ముచ్చటిస్తున్న చంద్రబాబు, రాజ్‌నాథ్, నడ్డా, అమిత్ షా

అసెంబ్లీ ఎన్నికల్లో భారీ పోలింగ్ జరగడంపై టీడీపీలో సంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రజల్లో జగన్ ప్రభుత్వంపై నెలకొన్న తీవ్రవ్యతిరేకత ఓటింగ్‌లో ప్రతిఫలించిందని, అందుకే ఓట్ల సునామీ వచ్చిందని ఆ పార్టీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఎన్నికల కమిషన్ నుంచి తుది గణాంకాలు మంగళవారం సాయంత్రం వరకూ విడుదల కానప్పటికీ.. 81% వరకూ ఓటింగ్ జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నాయి. 'గత ఎన్నికల సమయానికి టీడీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత బలంగా ఉండడం వల్లే ఎక్కువగా పోలింగ్ జరిగిందని అప్పట్లో విశ్లేషణలు వెలువడ్డాయి. ఇప్పుడు వ్యతిరేకత దానిని మించి ఉంది. అందుకే పోలింగ్ ఇంకా పెరిగింది' అని టీడీపీ ముఖ్యనేతకరు పేర్కొన్నారు. తెలంగాణలో కూడా అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఇదే మాదిరి పోలింగ్ జరిగిందని, అక్కడ బీఆర్ఎస్ చిత్తుగా ఓడిపోయిందని టీడీపీ వర్గాలు ప్రస్తావిస్తున్నాయి. 'అత్యధిక నియోజకవర్గాల్లో గతంతో కంటే ఈసారి పోలింగ్ బాగా పెరిగింది. ప్రత్యేకించి బయటి రాష్ట్రాల్లో ఉంటున్నవారు పెద్దసంఖ్యలో తరలిరావడం ఓటింగ్ శాతాన్ని పెంచింది. యువత, మహిళలు భారీగా పాల్గొనడం వారిలో ప్రభుత్వ వ్యతిరేకత ఎక్కువగా ఉందన్న విషయాన్ని ధ్రువీకరించింది' అని ఆ వర్గాలు చెబుతున్నాయి. పోలింగ్ సమయంలో ఎగ్జిట్ పోల్ నిర్వహించిన కొన్ని సర్వే సంస్థల ప్రతినిధులు కొన్ని ఆసక్తికరమైన అంశాలు చెప్పారు. తాము తీసిన ఎగ్జిట్ పోల్‌లో పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల అభిప్రాయం ఒకే మాదిరిగా వ్యక్తమైందని ఒక ప్రతినిధి తెలిపారు. 'పట్టణాల్లో ప్రభుత్వ వ్యతిరేకత ఎక్కువగా ఉందని, గ్రామాల్లో తక్కువగా ఉందని అంతకు ముందు కొంతమంది అనేవారు. కానీ మా ఎగ్జిట్ పోల్‌లో రెండుచోట్లా ఒకే మాదిరి ఫలితాలు వచ్చాయి. పేద వర్గాల మహిళల్లో ప్రభుత్వ అనుకూలత ఎక్కువగా ఉందని, పథకాలు నేరుగా వారికి అందడంవల్ల వారు వైసీపీ వైపు మొగ్గుతో ఉన్నారనే వాదన కూడా నిజంకాదని తేలింది. మెజారిటీ ప్రాంతాల్లో పురుషులు, మహిళల్లో ఒకే తరహా రాజకీయ అభిప్రాయం వ్యక్తమైంది. అన్ని వర్గాలూ ప్రభుత్వం మారాలని కోరుకున్నాయి' అని ఆయన వివరించారు. కాగా, విజయం ఖాయమని గట్టి నమ్మకంతో ఉన్న టీడీపీ వర్గాలు.. తమకు లభించే సీట్ల సంఖ్య ఎంత ఉండొచ్చో కూడా అంతర్గతంగా అంచనాలు వేస్తున్నాయి. 'గత ఎన్నికల్లో వైసీపీకి 49% ఓట్లు లభిస్తే 151 అసెంబ్లీ సీట్లు లభించాయి. ఈసారి మా కూటమికి 50 శాతానికి మించి ఓట్లు వస్తాయని అంచనా. ఆ లెక్కన అంతకుమించిన సీట్లు మాకు రావాలి. ఏం జరుగుతుందో చూడాలి' అని ఒక మాజీ మంత్రి పేర్కొన్నారు. టీడీపీ నేతల్లో ఇప్పుడు విజయం పై కంటే ఎన్ని సీట్లు వస్తాయి.. ఏ జిల్లాలో ఎన్ని గెలుచుకోగలమన్న చర్చలు ఎక్కువగా జరుగుతున్నాయి. కిందిస్థాయి నేతలను పిలిపించి ఓటింగ్ సరళిపై సమాచారం సేకరిస్తున్నారు. ఓటింగ్‌ను ప్రభావితం చేసిన అంశాలేమిటి.. ఏ వర్గాలపై ఈ అంశాలు ఎలాంటి ప్రభావం చూపాయన్న అంశం కూడా చర్చల్లో వస్తున్నాయి. 'రాష్ట్రం దెబ్బతినిపోయింది... అభివృద్ధి లేకుండా పోవడం ఓటర్లను ఎక్కువ ప్రభావితం చేసినట్లు అనిపిస్తోంది. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకూ అనేక చోట్ల ఓటర్ల నుంచి ఈ అభిప్రాయమే ఎక్కువగా వినిపించింది. అందువల్ల ఓట్లు, సీట్లలో పెద్దగా తేడాలు ఉండకపోవచ్చు. కూటమి అభ్యర్థి ఎక్కడైనా మరీ బలహీనంగా ఉంటేనో లేదా ఇంతకు మించిన స్థానిక అంశాలు ప్రభావం చూపిస్తేనో మాత్రమే ఫలితం వేరుగా ఉంటుంది' అని అనేక ఎన్నికలు చూసిన ఒక సీనియర్ నేత విశ్లేషించారు.

ఏదో తేడా కొడుతోంది!

» ఒక్క పూటలోనే వైసీపీ మాట మారింది!!

» మహిళలు, వృద్ధులు తమకే ఓటేశారన్న సజ్జల

» తెల్లవారేసరికి టీడీపీపై రిగ్గింగ్ ఆరోపణలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మళ్లీ మేమే గెలుస్తున్నామన్నారు.. మహిళలు, వృద్ధులు, యువత పెద్దఎత్తున ఓట్లేశారని.. ఇవి మాకే పడ్డాయన్నారు.. సోమవారం పోలింగ్ ముగిసీ ముగియగానే.. వరుసగా రెండోసారీ అధికారంలోకి వచ్చేస్తున్నామని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ప్రకటించారు. సీఎం జగన్‌ను యువతకు ఐకాన్‌గా ఆకాశానికెత్తేశారు. వారంతా వైసీపీ వైపే నిలబడ్డారని అన్నారు. మంగళవారం ఉదయానికి మాట మారిపోయింది. టీడీపీ రిగ్గింగ్‌కు పాల్పడిందంటూ కొత్త పల్లవి అందుకున్నారు. దీంతో వారి మాటల్లో ఏదో తేడా కొడుతోందని రాజకీయ వర్గాలు అంటున్నాయి. గెలుపుపై ధీమా సడలిందా అన్న అనుమానాలూ వ్యక్తం చేస్తున్నాయి. పోలింగ్ ముగిసి 24గంటలు ముగియక ముందే.. సజ్జలతో పాటు కొందరు మంత్రులు, మాజీ మంత్రులు, సీనియర్‌నేతలు, అభ్యర్థులు మంగళవారం ఈసీపై దుమ్మెత్తిపోశారు. పోలీసులపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు వ్యవస్థను చెప్పుచేతల్లో పెట్టుకున్న వైసీపీ పెద్దలు.. నిన్నటిదాకా సింహం సింగిల్‌గా వస్తుందన్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని ఎద్దేవాచేశారు. ఎంతమంది కలిసినా తమను ఎదుర్కోలేరని తొడలు కొట్టారు. వైనాట్ 175 అని ఊదరగొట్టి.. పోలింగ్ ముగిశాక ఎంతలేదన్నా 130కి తగ్గవని కొందరు నేతలు అన్నారు. ఆ తర్వాత కొద్ది గంటల్లోనే సీనియర్ నేతలంతా కూడబలుక్కుని మాట్లాడినట్లు.. టీడీపీ రిగ్గింగ్ చేసిందని ఆక్రోశించడంలోని మర్మమేవిటా అని రాజకీయ వర్గాలు ఆరా తీస్తున్నాయి. భారీ పోలింగ్‌తో జగన్ అండ్ కో గుండెలు జారిపోయాయా.. కీడు శంకిస్తున్నారా అని ప్రశ్నిస్తున్నాయి. సోమవారం పోలింగ్ సందర్భంగా తమ అరాచకాలను కప్పిపుచ్చుకునేందుకు స్వరం మార్చారా అన్న సందేహం కూడా వ్యక్తంచేస్తున్నాయి. టీడీపీ నేతలు తనను కొట్టి చంపేశాలా ఉన్నారంటూ జమ్మలమడుగు వైసీపీ అభ్యర్థి సుధీర్‌రెడ్డి.. తమను కొట్టి తరిమేశారంటూ నరసరావుపేట ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్, గురజాల అసెంబ్లీ అభ్యర్థి కాసు మహేశ్‌రెడ్డి.. తనను బూత్‌లోకి రానివ్వలేదంటూ గంగాధర నెల్లూరు వైసీపీ అభ్యర్థి కృపాలక్ష్మి.. తమను కొట్టారని నరసరావుపేట అభ్యర్థి గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి.. ఊర్లోకి రానివ్వలేదని చంద్రగిరి అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి.. గృహనిర్బంధం చేశారని తాడిపత్రి అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి.. సత్తెనపల్లిలో పెద్దఎత్తున రిగ్గింగ్ జరిగిందని అక్కడి అభ్యర్థి, మంత్రి అంబటి రాంబాబు హాహాకారాలు చేశారు. నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి కూడా పోలీసులు టీడీపీకి పనిచేశారని ఆరోపించారు. ఈసీ వైసీపీకి వ్యతిరేకంగా పనిచేసిందని, ఏకపక్షంగా వ్యవహరించిందని సజ్జల ఆరోపించారు. సోమవారం పోలింగ్ సందర్భంగా వీరే దాడులకు పాల్పడ్డారు. కోడ్‌ను తుంగలో తొక్కి వీధుల్లో స్వైర్వవిహారం చేశారు. మంగళవారం ఇలా ఆరోపణలు చేస్తూనే ఊళ్లపై పడి టీడీపీ నేతలపై దాడులకు తెగబడ్డారు. కాసు మహేశ్‌రెడ్డి, పిన్నెల్లి సోదరులు, అనిల్‌కుమార్ యాదవ్ అనుచరులతో కలిసి వీరంగం సృష్టించడం గమనార్హం. ఓటమి భయంతోనే ఇలా హింసాకాండకు తెగించారా అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎమ్మెల్యేను దూషించలేదు

» శివకుమార్ ఆరోపణలు అవాస్తవం: సుధాకర్

» వైసీపీ దాడితో గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స



గుంటూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): తెనాలి వైసీపీ ఎమ్మెల్యే, అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని, తాను ఆయనను ఎలాంటి పరుష పదజాలంతో దూషించలేదని.. గొట్టిముక్కల సుధాకర్ మంగళవారం స్పష్టం చేశారు. పోలింగ్ సందర్భంగా సోమవారం తెనాలిలోని ఐతానగర్ బూత్‌లో సుధాకర్‌పై తొలుత ఎమ్మెల్యే శివకుమార్ చేయి చేసుకొన్నారు. దానికి ప్రతిస్పందనగా సుధాకర్ కూడా ఎమ్మెల్యే చెంప చెళ్లుమనిపించారు. దీంతో అక్కడే ఉన్న శివకుమార్ అనుచరులు ఆయనపై మూకుమ్మడిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఆయన గుంటూరు జీజీహెచ్‌లో చేరి చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి స్థిమితంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా సుధాకర్ మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే శివకుమార్ తన కుటుంబసభ్యులు, అనుచరులతో కలిసి పోలింగ్ బూత్‌లోకి వెళ్తున్నప్పుడు క్యూలైన్‌లో రావాలని తాను అడిగినందుకు తన చెంపపై కొట్టారని, దాంతో తాను కూడా ఆయనను కొట్టానని తెలిపారు. ఆ వెంటనే ఎమ్మెల్యే అనుచరులు తనపై విరుచుకుపడ్డారని చెప్పారు. తాను ఓటు వేసి వచ్చాక అప్పటికే బయట పెద్దఎత్తున వైసీపీ నేతలు, కార్యకర్తలు చేరి తనపై మరోసారి దాడి చేయడానికి సిద్ధపడ్డారని అన్నారు. దాంతో తాను ఈ విషయాన్ని పోలీసులకు చెప్పడంతో వాళ్లు భద్రత ఏర్పాటు చేసి పంపించారని చెప్పారు.

'ఈ-ఆఫీస్'లో కిరికిరి!?

(మొదటి పేజీ తరువాయి)

ఈ-ఆఫీస్‌లో సాఫ్ట్‌వేర్ మార్పులు చేపట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది.

తొలి నుంచీ దాపరికమే...

జగన్ అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత జీవో ఐఆర్ వెబ్‌సైట్‌ను పూర్తిగా మూసేశారు. 2008లోనే ఈ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల తాలూకు జీవోలన్నీ ఈ వెబ్‌సైట్‌లో పెడతారు. ప్రపంచవ్యాప్తంగా ఎవరైనా ఆ వెబ్‌సైట్లోకి వెళ్లి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను తెలుసుకునే అవకాశం ఉండేది. ప్రభుత్వం ఖర్చుపెట్టే ప్రతి రూపాయికి సంబంధించిన వివరాలూ ఇందులో ఉండేవి. అయితే... ఈ వెబ్‌సైట్ ద్వారా తమ చీకటి నిర్ణయాలు బయటకు వస్తున్నాయని భయపడి ఆ సైటు మూసేశారు. ఆ చీకటి నిర్ణయాల తాలూకు డేటా, ఫైళ్లన్నీ ఈ-ఆఫీస్‌లో ఉంటాయి. ఏ నిర్ణయాన్ని ఎవరు, ఎలా తీసుకున్నారు, నోట్ ఫైల్‌పై ఎవరు ఏం రాశారనే సమాచారం ఇందులో ఉంటుంది. ఇప్పుడు దీనినే సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్, విస్తరణ పేరిట మూసివేస్తున్నారు. ఇదే క్రమంలో.. పాలన ముసుగులో చేసిన దోపిడీకి సంబంధించిన సాక్ష్యాలను కూడా చెరిపేసే అవకాశాలను తోసిపుచ్చలేమని ఉద్యోగ వర్గాలే అనుమానిస్తున్నాయి.

ఎప్పుడిస్తారు..?

(మొదటిపేజీ తరువాయి)

రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, మార్చి 7న చేయూత, మార్చి 14న ఈబీసీ నేస్తం పథకాలకు 'బటన్' నొక్కారు. వీటన్నింటి విలువ రూ.14,165 కోట్లు. ఇవన్నీ డీబీటీ పథకాలే. అంటే, బటన్ నొక్కిన 24 గంటల్లో లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ కావాలి. ఏదైనా సమస్య వచ్చినా 48 గంటలు దాటొద్దు. కానీ... బటన్ నొక్కుడే తప్ప డబ్బులు జమ చేసిందే లేదు. సరిగ్గా పోలింగ్‌కు ముందు సొమ్ములు జమచేసి రాజకీయ లబ్ధి పొందాలన్న వ్యూహంతో... కావాలనే జాప్యం చేశారు. ఎన్నికలకు రెండ్రోజుల ముందు లబ్ధిదారులకు నగదు బదిలీ చేస్తామంటూ సీఎస్ జవహర్ రెడ్డి, ఆర్థికశాఖ అధికారులు హడావుడి చేశారు. అయితే, ఇది ఓటర్లను ప్రభావితం చేస్తుందని, మిగతా పార్టీలు సమానావకాశాలు కోల్పోతాయంటూ ఈసీ తిరస్కరించింది. హైకోర్టులో సింగిల్ బెంచ్ తీర్పుతో వచ్చిన వెసులుబాటును ఉపయోగించుకుని నిధులు జమ చేయాలని చూశారు. హైకోర్టు తీర్పును ఈసీకి పంపి మళ్లీ అనుమతి అడిగారు. దీనిపై ఈసీ మండిపడింది. వరుస ప్రశ్నలు సంధించి.. ఎన్నికల్లో లబ్ధికోసమే డబ్బులు వేయాలని నిర్ణయించుకున్నట్లు నిర్ధారించింది. పోలింగ్ పూర్తయిన వెంటనే... 14నే లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు వేసుకోవచ్చునని స్పష్టం చేసింది.

కష్టాలు తీరాయా?

"లబ్ధిదారులు చాలా ఇక్కట్లు పడుతున్నారు. వారి జీవనానికి బటన్ నొక్కుడు డబ్బులు చాలా అవసరం. ఇప్పుడు విడుదల చేయాల్సిందే" అని పోలింగ్‌కు ముందు సీఎస్ పదేపదే ఈసీకి లేఖలు రాశారు. సోమవారం పోలింగ్ ముగిసింది. మంగళవారం ఉదయం నుంచి ఏ క్షణమైనా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బు వేయొచ్చు. కానీ, మంగళవారం పొద్దుపోయే వరకూ ఒక్కరి ఖాతాలోనూ డబ్బు పడలేదు. మే 9న హైకోర్టు తీర్పు వచ్చిన రోజు రాత్రి కూడా తెల్లారేసరికి డబ్బులు పడిపోవాలంటూ ఆర్థిక శాఖ అధికారులు హడావుడి చేశారు. బడ్జెట్ లేదు, బీఆర్‌వోలు లేవు... తాము చేయలేమంటూ అధికారులు అడ్డంతిరిగినప్పటికీ రూ.9,600 కోట్లు చెల్లించేందుకు అంతా సిద్ధం చేశారు. టీడీపీ అడ్డం పడుతోందంటూ తీవ్రవిమర్శలు చేశారు. మరిప్పుడు ఈసీ అడ్డంకి లేదు, టీడీపీ అడ్డం పడడం లేదు మరెందుకు ఇవ్వలేదు. అసలు ఇస్తారా? లేదా? అనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఎలాగూ ఎన్నికలైపోయాయి కాబట్టి.. లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేసినా ఇప్పుడు వచ్చే రాజకీయ ప్రయోజనమేమీ లేదని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఆ నిధులను కాంట్రాక్టర్లకు చెల్లిస్తే కమీషన్లయినా వచ్చి పడతాయనే దిశగా ఆలోచిస్తున్నట్లు అనుమానిస్తున్నారు. గతంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో పారిశ్రామిక సంస్థలకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలపై రగడ జరిగింది. కోడ్ అడ్డం ఉన్నందున ఇవ్వలేకపోతున్నామంటూ జగన్ చెప్పుకున్నారు. అది ముగిసి ఏడాదిన్నరయింది. అసెంబ్లీ ఎన్నికల కోడ్ కూడా వచ్చింది. ఇప్పటివరకు ఆ ప్రోత్సాహకాలు జమకాలేదు. ఇలాంటి విన్యాసాలు ఈ ఐదేళ్లలో జగన్ చాలాచేశారు. ఇప్పుడు ఆ ఆరు పథకాల నిధులనూ లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసే అవకాశం లేదని అంచనా. పైగా... కోడ్ వచ్చినప్పటి నుంచి కాంట్రాక్టర్లకు చెల్లింపులపైనే ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఎన్నికల షెడ్యూలు విడుదల నుంచి ఇప్పటివరకు ఏకంగా రూ.20వేల కోట్లదాకా బిల్లులు చెల్లించారు. కోడ్‌కు 10రోజుల ముందు రూ. 7,000 కోట్లు చెల్లించారు. అప్పుడే బటన్ నొక్కుడు డబ్బులు జమచేసే అవకాశమున్నా, ఆ పని చేయలేదు.

సిద్ధంగా రూ.7,000 కోట్లు

ఈ నెల 10వ తేదీన కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా కింద రూ.3,000 కోట్లు రాష్ట్ర ఖజానాకు వచ్చాయి. మంగళవారం ఆర్బీఐలో సెక్యూరిటీలు వేలం వేసి రూ.4,000 కోట్లు అప్పు తెచ్చారు. రాష్ట్రానికి ప్రతి రోజూ వచ్చే సొంత ఆదాయం ఉంటుంది. ఇవన్నీ కలుపుకుంటే ప్రభుత్వం వద్ద ఇప్పుడు రూ.8000 కోట్లకు పైగా డబ్బు ఉంది. అయినా... ఆ 6 పథకాల లబ్ధిదారుల ఖాతాల్లోకి మాత్రం ఆ నగదును ప్రభుత్వం జమ చేయడం లేదు.



కాశీలో భార్యతో కలిసి పూజలు చేస్తున్న పవన్

కూటమి క్లీన్ స్వీప్

» త్వరలో ఏపీలో ప్రజా పాలన: పవన్

అమరావతి, మే 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్డీయే కూటమి క్లీన్‌స్వీప్ చేయబోతోందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ నామినేషన్ కార్యక్రమం కోసం వారాణసీకి వెళ్లిన ఆయన మంగళవారం అక్కడ మీడియాతో మాట్లాడారు. ఏపీలోని శాసనసభ, లోక్‌సభ స్థానాల్లో కూటమి భారీ విజయం నమోదు చేయనుందని తెలిపారు. 2014లో మోదీ తొలిసారి ప్రధాని అయినప్పటి నుంచి తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నారు. వ్యక్తిగతంగాను మోదీ అంటే అమితమైన గౌరవం ఉందన్నారు. దేశానికి మోదీ మూడోసారి కూడా ప్రధాని కావాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. దేశం ఆయన నాయకత్వంలో మరింత ముందుకు వెళ్తుందని బలంగా నమ్ముతున్నట్లు చెప్పారు. ఎన్డీయే కూటమి తరఫున, జనసేన పార్టీ తరఫున మోదీకి మద్దతుగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచినట్లు వివరించారు. ఎన్డీయే ప్రభుత్వం అత్యధిక మెజార్టీతో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోందని తెలిపారు. ఇటు రాష్ట్రంలోనూ త్వరలోనే ఎన్డీయే ప్రజా పాలన మొదలు కాబోతున్నట్టు ధీమా వ్యక్తం చేశారు.

కాలువల్లో పూడిక తీయించండి

రాష్ట్రంలో కాలువల నిర్వహణపై వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లుగా దృష్టి పెట్టలేదని పవన్ ఆరోపించారు. సాగునీటి అవసరాలు తీర్చే కాలువలు, వాటికి సంబంధించిన డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థలకు అవసరమైన నిర్వహణ, మరమ్మతులు వేసవిలో చేపట్టాలని సూచించారు. ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఆపద్ధర్మ ప్రభుత్వం ఈ అంశంపై జలవనరుల శాఖతో సమీక్షించాలని కోరారు. కాలువలు పూడిపోవడంతో ఆయకట్టుకు నీరు అందడం లేదని, గతేడాది పశ్చిమ కృష్ణాలో పంటలు ఎండిపోవడానికి కాలువల నిర్వహణ సరిగా లేకపోవడమేనని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా రైతాంగం ఈ సమస్యనే ప్రస్తావించిందని పేర్కొన్నారు. జలవనరుల శాఖ యుద్ధ ప్రాతిపదికన కాలువలకు, లాకులకు మరమ్మతులు నిర్వహించి, వేసవి ముగిసేలోగా పనులు పూర్తి చేయాలని కోరారు.

పేదలకు ఆపి.. కాంట్రాక్టర్లకు చెల్లింపులా!

» వాటిని నిలిపివేయాలంటూ గవర్నర్‌కు చంద్రబాబు లేఖ

అమరావతి, మే 14(ఆంధ్రజ్యోతి): ఖజానాలోని డబ్బులను పథకాల లబ్ధిదారులకు ఇవ్వకుండా, తమకు కావాల్సిన కాంట్రాక్టర్లకు చెల్లించడానికి జగన్ ప్రభుత్వం సిద్ధమవుతోందని టీడీపీ అధినేత చంద్రబాబు ఆరోపించారు. కాంట్రాక్టర్లకు చెల్లింపులు నిలిపివేసి, ఈ డబ్బులు లబ్ధిదారులకు చెల్లించేలా చూడాలని గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు విజ్ఞప్తి చేశారు. 'పోలింగ్‌కు ముందు జగన్ ప్రభుత్వం పథకాల లబ్ధిదారులకు డబ్బులు చెల్లించాలని హడావుడి చేసింది. పోలింగ్ అయిపోగానే వారిని గాలికి వదిలేసింది. ఖజానాలో ఉన్న డబ్బులను సొంత కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడానికి సిద్ధమవుతోంది. కోడ్‌కు ముందు కూడా తమ బినామీ కాంట్రాక్టర్లకు, తమకు కావాల్సిన కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేశారు. పథకాల లబ్ధిదారులకు బటన్ నొక్కినా వారి ఖాతాలకు మాత్రం డబ్బులు పంపలేదు. దీనిపై ఈసీ కూడా రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అయినా ప్రభుత్వం మాట్లాడటం లేదు' అని మంగళవారం గవర్నర్‌కు రాసిన లేఖలో చంద్రబాబు పేర్కొన్నారు. అనేక వర్గాలు తమకు రావాల్సిన డబ్బుల కోసం ఎదురు చూస్తుంటే, వారిపై ప్రభుత్వం కనికరం చూపడం లేదని విమర్శించారు. 'పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు పీఎఫ్, మెడికల్ బిల్లులు తదితరాలను కూడా ఈ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. ఆరోగ్యశ్రీ కింద ప్రైవేటు ఆస్పత్రులకు రూ.వేల కోట్లు చెల్లించాల్సి ఉంది. బకాయిలు చెల్లించకపోతే రోగులకు సేవలు నిలిపివేస్తామని ఆస్పత్రులు హెచ్చరిస్తున్నాయి. ఫైనాన్స్ కమిషన్ ద్వారా పంచాయతీరాజ్ సంస్థలకు అందాల్సిన నిధులను జగన్ ప్రభుత్వం దారి మళ్లించి ఇతర అవసరాలకు వాడుకొంది. రుణాల కిందరూ.4వేల కోట్లు, బాండ్ల ద్వారా రూ.7వేల కోట్లు ప్రభుత్వం ఇటీవల సమీకరించింది. ఈ నిధులను రిటైర్డ్ ఉద్యోగులు, ఆరోగ్యశ్రీ బిల్లులు, పంచాయతీరాజ్ సంస్థలకు చెల్లింపులు చేయకుండా.. అస్మదీయ కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేయడానికి ఆత్రుత పడుతోంది. రాజకీయ స్వార్థంతో చేసే ఈ పనుల వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉంది. ఈ కుటిల యత్నాలకు మీరు అడ్డుకట్ట వేయాలి. జగన్ బినామీ కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు జరగకుండా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలి. లబ్ధిదారులకు పథకాల కింద చెల్లింపులు జరిగేలా చూడాలి' అని విజ్ఞప్తి చేశారు. లేఖ ప్రతిని కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిలకు కూడా పంపారు.

జనం సొమ్మేగా ఇచ్చేయండి!

(మొదటిపేజీ తరువాయి)

గతంలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ సొమ్మును ఇంధన సర్‌చార్జి కింద వినియోగదారుల నుంచి డిస్కమ్‌లు రాబట్టుకున్నాయి. తాజాగా, 2018 నుంచి 2022 దాకా విద్యుత్తు ధరను ఖరారు చేయాలంటూ 'ఏపీపీసీసీ'కి హిందూజా లేఖ రాసింది. తీసుకున్న విద్యుత్తుకు రూ.1,250 కోట్లు చెల్లించాలని, అదేవిధంగా .. విద్యుత్తు కొనుగోలు ఒప్పందం మేరకు రూ.250కోట్లను మహానది కోల్‌ఫీల్డ్స్‌కు చెల్లించాలని ఆ లేఖలో కోరింది. దీనిపై, స్పందన లేకపోవడంతో ఒడిశా హైకోర్టుకు ఈ వివాదం చేరింది. దీనిపై ఒడిశా హైకోర్టు...ఏపీ డిస్కమ్‌లకు నేరుగా ఆదేశాలు ఇవ్వనప్పటికీ, వివాదాన్ని పరిష్కరించుకోవాలని మాత్రం సూచించింది. ఈ నేపథ్యంలో మొత్తంగా రూ.1500 కోట్లను చెల్లించాలంటూ ఏపీపీసీసీపై వసూల్‌రాజా ద్వారా హిందూజా ఒత్తిడి పెంచుతోందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. సాధారణంగా ప్రైవేటు కంపెనీలు తమ తమ క్లెయిమ్‌లను ఈఆర్‌సీ ద్వారా పరిష్కరించుకోవాలి. లేదంటే, న్యాయస్థానాల్లో తేల్చుకోవాలి. కానీ బిల్లులను పంపి, ఆ క్లెయిమ్‌లను పరిష్కరించాలంటూ వసూల్ రాజా ద్వారా ఏపీపీసీసీపై ఒత్తిడిని హిందూజా పెంచుతున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకవేళ వసూల్‌రాజా ఒత్తిడి మేరకు బిల్లులు చెల్లిస్తే .. భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తుతాయని ఏపీపీసీసీ భయపడుతోంది. ఈ నేపథ్యంలో ఈ నెల తొమ్మిదోతేదీన సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ విక్రమ్‌జిత్ సేన్ సలహా కోరుతూ ఏపీపీసీసీ లేఖ రాసింది. ఈ లేఖతో పాటు, ఇప్పటిదాకా చోటు చేసుకున్న న్యాయపరమైన ప్రతిబంధకాలను, . చిక్కులను, ఇతర వివరాలను ఆయన దృష్టికి తెచ్చింది. అయితే, రాష్ట్ర వ్యవహారాలతో ఏమాత్రమూ సంబంధంలేని ఒక రిటైర్డు న్యాయమూర్తి ని ఏపీపీసీసీ సలహా కోరడం ఇప్పుడు విద్యుత్తు శాఖలో చర్చనీయాంశంగా మారింది. హిందూజా క్లయిమ్‌లు చట్టబద్ధమైనవే అయితే .. వాటిని పరిష్కరించాలని .. లేదంటే .. తోసిపుచ్చాలని విద్యుత్తురంగ నిపుణులు చెబుతున్నారు. ఒకవేళ సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జి ఏదైనా సలహా ఇచ్చినా.. దాని ప్రకారం ఏపీపీసీసీ దీనిపై నిర్ణయం తీసుకునే వీలు కూడా లేదంటున్నారు. వసూల్‌రాజా ఒత్తిడికి లొంగి రూ.1500 కోట్లు హిందూజాకు చెల్లిస్తే .. ఈ భారాన్ని రాష్ట్ర విద్యుత్తు వినియోగదారులపైనే వేయాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. వచ్చే నెల నాలుగోతేదీన ఎన్నికల ఫలితాలు రాబోతున్నాయి. కొత్త ప్రభుత్వం కొలువు తీరాకే హిందూజా బకాయిలపై ఏదో ఒక నిర్ణయాన్ని తీసుకునే వీలుంది. కానీ ఈ లోపే హిందూజాకు చెల్లింపులు చేసేయాలన్న ఆత్రుత కనిపిస్తోందని చెబుతున్నారు.



వైసీపీ విధ్వంసకాండ

పులివర్తి నానీపై హత్యాయత్నం

- మహిళా వర్సిటీ ఆవరణలో మాటేసి...
- 150 మంది వైసీపీ వర్గీయుల దాడి



స్విమ్స్‌లో పులివర్తి నానీకి చికిత్స

తిరుపతి, మే 14(ఆంధ్రజ్యోతి): పోలింగ్ ముగిసిన తర్వాత కూడా వైసీపీ మూకల దాడులు కొనసాగుతునే ఉన్నాయి. మంగళవారం చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై హత్యాయత్నానికి పాల్పడ్డాయి. తిరుపతిలోని పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయ ఆవరణలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను సందర్శించి తిరిగి వెళ్తున్న సమయంలో వైసీపీ వర్గీయులు ఆయనపై దాడి చేశారు. సుమారు 150మంది మారణాయుధాలతో దాడి చేయగా నానీ భుజానికి గాయమైంది. గాల్లోకి కాల్పులు జరిపి వైసీపీ శ్రేణులను అడ్డుకునేందుకు యత్నించిన గన్‌మన్ తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతి నగరంతో పాటు చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం మధ్యాహ్నం సుమారు 3గంటల సమయంలో పులివర్తి నానీ రెండు వాహనాల్లో మహిళా విశ్వవిద్యాలయంలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల వద్దకు వచ్చారు. తిరిగి వెళ్తుండగా అప్పటికే అక్కడ మాటేసిన రామచంద్రాపురం మండలం రామాపురం వైసీపీ ఎంపీటీసీ భాను, అతని అనుచరులు 150మంది రాళ్లు, ఇనుప రాడ్లు, సుత్తులు, కర్రలతో నానీ వాహనాలపై దాడిచేసి ధ్వంసం చేశారు. ఈ దాడిలో నానీ భుజానికి గాయాలయ్యాయి. వారిని అడ్డుకునేందుకు నానీ గన్‌మన్ ధరణి గాల్లోకి కాల్పులు జరిపారు. అయినా వైసీపీ వర్గీయులు దాడికి తెగబడటంతో ధరణి తలకు, కంటి వద్ద తీవ్ర గాయాలయ్యాయి. స్ట్రాంగ్‌రూమ్ వద్ద కాపలా ఉన్న పోలీసు బలగాలు అక్కడకు చేరుకోవడంతో వైసీపీ వర్గీయులు పరారయ్యారు. స్ట్రాంగ్ రూమ్ వద్దే ఉన్న నానీ భార్య సుధారెడ్డి దాడి గురించి పోలీసులకు, టీడీపీ శ్రేణులకు సమాచారమిచ్చారు. దీంతో భారీఎత్తున టీడీపీ మద్దతుదారులు వర్సిటీ ప్రాంగణానికి చేరుకుని ప్రతిదాడికి దిగారు. ఈ దాడిలో వైసీపీ వర్గీయులు వదిలిపెట్టిన కారుతోపాటు అలిపిరి సీఐ రామచంద్రారెడ్డి వాహనం సైతం ధ్వంసమైంది. ఆవరణ వెలుపల ఓ మోటర్ బైక్‌ను కూడా తగులబెట్టారు. సొమ్మసిల్లి పడిపోయిన నానీని వర్సిటీ మెయిన్ గేటు వెలుపల రోడ్డుపై పడుకోబెట్టి టీడీపీ శ్రేణులు బైఠాయించారు. పోలీసు వైఫల్యంతోనే దాడి జరిగిందంటూ విరుచుకుపడ్డారు. వర్సిటీ వెనుకవైపు ప్రహరీని ఆనుకునే ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి స్వగ్రామమైన తుమ్మలగుంట ఉంది. తీవ్ర ఆగ్రహంతో ఉన్న టీడీపీ శ్రేణులు దాడులకు దిగుతారేమోనని వైసీపీ వర్గీయులు భారీగా తుమ్మలగుంట కూడలి, గాంధీపురం ప్రాంతాల్లో కర్రలు, రాళ్లతో మోహరించారు. టీడీపీ వర్గీయులను చెదరగొట్టేందుకు పోలీసులు చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో బీఎస్ఎఫ్ జవాన్లు రబ్బర్ బుల్లెట్లతో గాల్లోకి కాల్పులు జరిపారు. అయినా వెనక్కి తగ్గకపోవడంతో కేంద్ర బలగాలను, టియర్ గ్యాస్ వాహనాలను రప్పించారు. కేంద్ర బలగాలు లాఠీచార్జి జరిపి ఆందోళన చేపట్టిన టీడీపీ వర్గీయులను చెదరగొట్టారు. లాఠీచార్జిలో ఐదుగురు టీడీపీ కార్యకర్తలతో పాటు ఐదుగురు మీడియా ప్రతినిధులు గాయపడ్డారు. గాయపడిన నానీని స్విమ్స్ ఆస్పత్రికి తరలించగా గన్‌మన్ ధరణి రుయాలో చికిత్స పొందుతున్నారు. ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, గాయపడిన నానీ, గన్‌మన్ ధరణితో మాట్లాడారు.

నానీ క్షేమం... స్ట్రాంగ్ రూమ్ భద్రం: ఎస్పీ

ప్రత్యర్థుల దాడిలో గాయపడిన నానీ క్షేమంగా ఉన్నారని ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ స్పష్టం చేశారు. వర్సిటీ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. నానీని, గన్‌మన్‌ను స్వయంగా కలసి మాట్లాడి వివరాలు తెలుసుకున్నానని, వారి పరిస్థితి బాగుందని, ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. వర్సిటీ ఆవరణలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లు కూడా భద్రంగా ఉన్నాయని తెలిపారు. పులివర్తి నానీపై దాడికి పాల్పడిన వ్యక్తులను గుర్తించామని, వారిని అరెస్టు చేసి రిమాండుకు తరలిస్తామన్నారు. సీసీ ఫుటేజీ ఆధారాలున్నాయని ఎస్పీ చెప్పారు.

పోలీసు వైఫల్యంతోనే దాడి

వర్సిటీ ఆవరణలోని ఇంజనీరింగ్ విభాగం గదుల్లో ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. అక్కడ మూడంచెల భద్రత కల్పించామని కలెక్టర్, ఎస్పీ వెల్లడించారు. అయితే ఎన్నికల అధికారులను, అభ్యర్థులను వారి ఐడీలు తనిఖీ చేశాకే లోనికి అనుమతించాల్సి ఉండగా 150మందికి పైగా వైసీపీ కార్యకర్తలు వాహనాల్లో వర్సిటీ ఆవరణలోకి ఎలా రాగలిగారన్నది ప్రశ్న. అంతమంది యథేచ్ఛగా మారణాయుధాలతో లోనికి వచ్చి టీడీపీ అభ్యర్థి వాహనాలను ధ్వంసం చేసి దాడి చేయడం కలకలం సృష్టించింది. స్ట్రాంగ్ రూములున్న వర్సిటీ ఆవరణలో భద్రత డొల్లతనాన్ని ఈ ఘటన బట్టబయలు చేసింది. ఘటన జరిగిందని తెలిసిన తర్వాత కూడా తగిన సంఖ్యలో పోలీసు బలగాలు సకాలంలో చేరుకోకపోవడంతో ఐదారువందల మంది టీడీపీ మద్దతుదారులు ప్రతిదాడులకు పాల్పడ్డారు.



తిరుపతిలోని మహిళా వర్సిటీ వద్ద పులివర్తి నానీపై దాడి దృశ్యం

యుద్ధభూమి.. తాడిపత్రి

- టీడీపీ నాయకుడు సూర్యముని ఇంటిపై దాడి

తాడిపత్రి టౌన్, మే 14: అనంతపురం జిల్లా తాడిపత్రిలో వైసీపీ హింసాకాండ కొనసాగుతోంది. పోలింగ్ రోజైన సోమవారం వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, తనయులు, అనుచరులు పలు చోట్ల దాడులకు తెగబడ్డారు. మంగళవారం మరింత రెచ్చిపోయారు. మధ్యాహ్నం 3 గంటల సీనియర్ నాయకుడు సూర్యముని ఇంటిపై వైసీపీ మూకలు రాళ్ల వర్షం కురిపించాయి. టీడీపీ శ్రేణులు భారీగా అక్కడికి చేరుకోగా, ఇరువర్గాలు రాళ్లు రువ్వుకోవడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అదనపు ఎస్పీ రామకృష్ణ, డీఎస్పీ గంగయ్య, సీఐ మురళీకృష్ణ అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టేందుకు ప్రయత్నించినా పరిస్థితి అదుపులోకి రాలేదు. వైసీపీ రాళ్లదాడిలో సీఐ మురళీకృష్ణ తలకు గాయమైంది. సీఐ, ఎస్ఐల వాహనాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు బాష్పవాయువును ప్రయోగించగా పరిస్థితి అదుపులోకి వచ్చింది. మరోవైపు మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పెద్దఎత్తున అనుచరులతో సూర్యముని ఇంటికి చేరుకున్నారు. ఆయన వస్తే పరిస్థితి చేయి దాటుతుందని భావించిన పోలీసులు ప్రభాకర్‌రెడ్డిని అడ్డుకున్నారు. పరామర్శించేందుకు వెళుతుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని ఆయన వాగ్వాదానికి దిగారు. శాంతిభద్రతల దృష్ట్యా వెనుదిరగాలని అదనపు ఎస్పీ కోరడంతో ప్రభాకర్‌రెడ్డి అనుచరులతో కలిసి వెనుదిరిగారు. వైసీపీ మూకలపై ఫిర్యాదు చేసేందుకు ఆయన పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చేరుకోగా, పోలీసులు స్టేషన్‌కు తాళం వేశారు. దీంతో ఆయన అనుచరులతో గాంధీసర్కిల్‌కు చేరుకుని నిరసన తెలిపారు. పోలీసులు నచ్చజెప్పడంతో కార్యకర్తలతో వెళ్లిపోయారు. వైసీపీ అల్లరిమూకలు మరోసారి రెచ్చిపోయాయి. ముందస్తుగా ట్రాక్టర్లతో రాళ్లను సిద్ధం చేసుకున్నాయి. పెద్దారెడ్డి ఇంటిపై నుంచి రాళ్లు విసరడంతో టీడీపీ కార్యకర్తలు పరుగులు తీశారు. దీపావళి రాకెట్లనూ వైసీపీ వర్గీయులు ప్రయోగించారు. దీంతో టీడీపీ వర్గీయులూ పెద్దారెడ్డి ఇంటివైపు రాకెట్లను వదిలారు. పరిస్థితి అదుపుతప్పడంతో పోలీసులు మరోసారి భాష్పవాయువు ప్రయోగించారు. సీఆర్‌పీఎఫ్ బలగాలను రప్పించినా.. పరిస్థితి అదుపులోకి రాలేదు. రాత్రి 9 గంటలైనా దాడులు కొనసాగుతూనే ఉండటంతో పోలీసులు చేతులెత్తేశారు. ఎంతో సమస్యాత్మకమైన తాడిపత్రిలో పోలీసు అధికారులు ముందస్తు ప్రణాళిక రెడీ చేయకపోవడంతోనే పరిస్థితి ఇలా తయారైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తాడిపత్రిలో టీడీపీ శ్రేణులపైకి వైసీపీ మూకల దీపావళి రాకెట్ల ప్రయోగం





రెంటాలలో వైసీపీ రౌడీమూకల దాడిలో గాయపడిన చేరెడ్డి మంజుల

'పిన్నెల్లి'కి వీరనారిలా ఎదురునిలిచి

- అరాచకాలపై ఎదురుతిరిగిన ఎమ్మెల్యే బంధువు మంజుల
- రెచ్చిపోయి వేట కొడవళ్లతో దాడి చేసిన వైసీపీ మూకలు
- నుదుటిపై తీవ్ర గాయమైనా బెదరకుండా బూత్‌లోనే విధులు

గుంటూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాచర్లలో వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరాచకానికి అడ్డూ ఆపు ఉండదు! అయితే.. ఈ ఎన్నికల్లో ఓ మహిళ వీరనారిలా ముందుకొచ్చి ఆయనకు ఎదురు నిలిచారు. ఏజెంట్లుగా ఉండేందుకు పురుషులు తటపటాయిస్తున్న చోట ఏజెంట్‌గా కూర్చున్నారు. ఇది సహించలేక వైసీపీ మూకలు ఆమెపై వేటకొడవళ్లతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. నుదిటిపై పెద్ద గాయమై రక్తమోడుతున్నప్పటికీ ఆమె పోలింగ్ బూత్‌లోనే కూర్చున్నారు. ఆమె పేరు చేరెడ్డి మంజుల. ఎమ్మెల్యే పిన్నెల్లికి వరసకు మరదలు. మాచర్ల నియోజకవర్గంలోని రెంటచింతల మండలం రెంటాల గ్రామ వాసి. మంజుల భర్త వెంకటేశ్వరరెడ్డి గ్రామ సర్పంచ్‌గా పని చేశారు. మొన్నటి వరకు వైసీపీలోనే ఉన్నారు. పిన్నెల్లి సోదరుల అకృత్యాలను, దౌర్జన్యాలను, అరాచకాలను చూస్తూ తట్టుకోలేక మార్చి 15న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. అప్పటి నుంచి మాచర్ల టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి గెలుపు కోసం పాటు పడుతున్నారు. తీరా ఎన్నికలు సమీపించిన తరుణంలో రెంటాల పోలింగ్ బూత్‌లో ఏజెంట్లుగా ఉండేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఆ నేపథ్యంలో మంజుల ఏజెంట్‌గా వున్నారు. సోమవారం ఉదయం పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కాక ముందే వైసీపీ మూకలు రెచ్చిపోయి దాడులకు తెగబడ్డారు. మంజుల, ఆమె భర్త వెంకటేశ్వర రెడ్డిపై వేట కొడవళ్లతో దాడులు చేశారు. ఈ దాడుల్లో తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర రెడ్డిని వెంటనే గురజాల ఆస్పత్రికి తరలించారు. మంజుల నుదిటిపై తీవ్ర గాయమై రక్తం ధారగా కారుతున్నప్పటికీ ఆ గాయంతోనే బూత్‌లో ఏజెంట్‌గా కూర్చుని తన కర్తవ్యం నిర్వర్తించారు. చివరకు పార్టీ నేతలు సర్ది చెప్పి మంజులను బయటకు తీసుకొచ్చి వైద్యం కోసం గురజాల ఆస్పత్రికి తరలించారు. మంజుల సాహసం ఉమ్మడి గుంటూరు జిల్లాలో తీవ్ర చర్చనీయాంశమైంది.

చంపండి... నరకండి!

- కారంపూడిలో వైసీపీ మూకల స్వైర విహారం
- రాడ్లు, కర్రలతో వందల మంది వీరంగం
- తన్నండి.. తరమండి.. తగలబెట్టండి అంటూ కేకలు
- 30 కార్లు.. 300 మంది గూండాలతో విధ్వంసం
- దగ్గరుండి రెచ్చగొట్టిన పిన్నెల్లి సోదరుడు



కారంపూడిలో కర్రలు, కత్తులతో వీరంగం

మాచర్ల టౌన్, మే 14: పట్టపగలు.. నడి వీధుల్లో వైసీపీ మూకలు అరాచకం సృష్టించాయి. కిరాయి రౌడీలతో కలిసి వీరంగం వేశాయి. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం కారంపూడిలో మంగళవారం కనీవినీ ఎరుగని స్థాయిలో భయానక వాతావరణం నెలకొంది. "మాచర్ల నియోజకవర్గంలో మనకు ఎదురుండ కూడదు. ఎదిరించే వారిని అంతం చేద్దాం. పోలింగ్ రోజున మనపై ఎదురు తిరుగుతారా! నా కొడుకులందరినీ చంపేద్దాం. ఆస్తులు తగలబెడదాం. మన పేరు చెప్తే నియోజకవర్గం మొత్తం హడలిపోవాలి. మనజోలికి రావాలంటే గుండెలు అదిరిపోవాలి"... అంటూ వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు వెంకట్రామి రెడ్డి తమ రౌడీ మూకలను రెచ్చగొట్టారు. నియోజకవర్గంలో తన అనుయాయులతోపాటు... పొరుగునే ఉన్న తెలంగాణలోని నల్లగొండ జిల్లా హాలియా మండలం నుంచి 300 మందికిపైగా కిరాయి మూకలను మాచర్లకు రప్పించారు. వీరందరికీ మాచర్ల-సాగర్ ప్రధాన రహదారిలోని ఆర్టీసీ గ్యారేజీ పక్కన ఉన్న వెంచర్‌లో మందు, విందు ఏర్పాటు చేశారు. పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి వీరందరినీ రెచ్చగొట్టి 30 కార్లు, ఇతర వాహనాల్లో కారంపూడికి చేరుకున్నారు. వీరంతా చెక్‌పోస్టు సెంటర్‌కు చేరుకొని రాడ్లు, కర్రలు, మారణాయుధాలతో రోడ్డుపై హల్ చల్ చేశారు. 'తన్నండి.. తరమండి.. తగలబెట్టండి.. ఎవర్నీ వదిలిపెట్టొద్దు' అంటూ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి రెచ్చగొట్టారు. రౌడీలు విధ్వంసం చేస్తూ ముందుకు సాగారు. టీడీపీ కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. టీడీపీ నేత కారును తగలబెట్టారు. చిరువ్యాపారుల దుకాణాలను ధ్వంసం చేస్తూ రాళ్లు రువ్వారు. అదుపు చేసేందుకు ప్రయత్నించిన సీఐ నారాయణస్వామిపై కూడా రాళ్లు రువ్వారు. దీంతో సీఐ మెడకు గాయాలుకాగా రక్తస్రావమైంది. ఏం జరుగుతోందో అర్థంకాక సామాన్య ప్రజలు భీతిల్లిపోయారు. సుమారు గంటసేపు కారంపూడిలో రౌడీ మూకల విధ్వంసకాండ కొనసాగింది. గురజాల డీఎస్పీ పల్లపురాజు కారంపూడికి చేరుకొని వెంకట్రామి రెడ్డిని, రౌడీ మూకలను కారంపూడి నుంచి బయటకు వెళ్లగొట్టారు. వీరంతా మాచర్ల మండలం రాయవరం జంక్షన్‌కు చేరుకొని మంతనాలు చేశారు. పోలింగ్ రోజున రెంటచింతల మండలం పాలువాయిగేటులో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన తనయుడిపై జరిగిన దాడికి ప్రతీకారం తీర్చుకునేందుకు... ఆ గ్రామాన్ని ధ్వంసం చేయడానికి సిద్ధమయ్యారు. పోలీసులు అక్కడకు చేరుకొని వారిని అడ్డుకున్నారు. ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డితోపాటు ఆయన సోదరుడు వెంకట్రామి రెడ్డిని హౌస్ అరెస్ట్ చేశారు. రౌడీ మూకలు మంగళవారం రాత్రి పొద్దుపోయాక కూడా పట్టణ శివారులోనే పాగా వేశాయి. ఏ క్షణాన్నైనా నియోజకవర్గంలోని టీడీపీ సానుభూతిపరుల గ్రామాలపై పడి దాడి చేసేందుకు వ్యూహం రచించుకున్నారు.

రెండోరోజూ నెత్తురోడిన పల్నాడు

- పోలింగ్ మర్నాడు కారంపూడిలో బీభత్సం.. టీడీపీ కార్యాలయం, వాహనాలు ధ్వంసం
- టీడీపీ కార్యకర్తల ఇళ్లు, షాపులపై రాళ్లవర్షం.. 'టీడీపీ' గ్రామాల్లో బీభత్సకాండ
- హింసాకాండకు వైసీపీ అభ్యర్థుల నేతృత్వం.. దగ్గరుండి దాడులు చేయించిన కాసు, అనిల్

(ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్)

పోలింగ్ ముగిసినా ప్రతీకార దాడులకు వైసీపీ మూకలు తెగబడుతూనే ఉన్నాయి. పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్లుగా కూర్చున్నవారిని, అభ్యర్థులను, పోలింగ్ బూత్‌లకు రక్షణ కల్పించిన పోలీసు అధికారులను లక్ష్యంగా చేసుకుని వరుసగా రెండోరోజు కూడా విధ్వంసకాండ సాగింది. చివరకు ఓటర్లపైనా వైసీపీ గూండాలు విరుచుకుపడ్డారు. 'మా సైకిల్ జోరు పెరిగింది' అంటూ టీడీపీ అనుకూల వ్యాఖ్యలు చేసిన ఓ వృద్ధుడిపై శ్రీకాకుళంలో దాడిచేశారు. కూటమికి ఓటు వేశాడనే అనుమానంతో కౌలురైతుపైనా కర్ర ఎత్తడం అధికార పార్టీ నేతల బరితెగింపునకు పరాకాష్ఠ! తిరుపతిలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించి బయటకువస్తున్న చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీని స్పృహ తప్పిపోయేంతగా వైసీపీ రౌడీలు కొట్టారు. పోలింగ్ జరిగిన మర్నాడు కూడా పల్నాడులో అరాచకం రాజ్యం చేసింది. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేశ్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్ నాయకత్వంలో గురజాల నియోజకవర్గంలోని మాచవరం మండలం కొత్త గణేషునిపాడులో వైసీపీ గూండాలు రెచ్చిపోయారు. సోమవారం పోలింగ్ సందర్భంగా గాయపడిన వైసీపీ కార్యకర్తల పరామర్శకు అన్నట్టు వెళ్లి.. ఆ గ్రామంలో కర్రలు, మరణాయుధాలతో వీరంగం సృష్టించారు. టీడీపీ కార్యకర్తల ఇళ్లను ఎంచుకుని మరీ దాడులు చేశారు. టీడీపీ కార్యకర్తలు ఈ దాడులను గట్టిగా ప్రతిఘటించడంతో కొన్నిగంటల పాటు ఉద్రిక్తత నెలకొంది. వరుస దాడుల నేపథ్యంలో పల్నాడులో 140 సెక్షన్ విధిస్తూ కలెక్టరు శివశంకర్ ఆదేశాలు జారీచేశారు. మాచర్లలో పిన్నెల్లి సోదరులను గృహ నిర్బంధంలో ఉంచారు. వైసీపీ దాడులకు గురైన టీడీపీ కార్యకర్తలకు ధైర్యం చెప్పేందుకు ప్రత్యేక కమిటీని చంద్రబాబు ఏర్పాటుచేశారు. ఈ కమిటీలో వర్ల రామయ్య నక్కా ఆనందబాబు, బోండా ఉమా, కొల్లు రవీంద్ర, లావు శ్రీకృష్ణ, జంగా కృష్ణమూర్తి, జూలకంటి బ్రహ్మారెడ్డి ఉన్నారు.



కారంపూడిలో వైసీపీ మూకలు తగలబెట్టిన కారు

బీభత్సకాండ

శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ తరపున ఏజెంట్లుగా కూర్చున్నవారిని లక్ష్యంగా చేసుకుని వైసీపీ మూకలు విరుచుకుపడ్డాయి. ఓబుళనాయునిపల్లిలోని వారి ఇళ్లపై రాళ్లవాన కురిపించాయి. ఈ దాడిలో గాయపడినవారిని ఆస్పత్రిలో ధర్మవరం కూటమి అభ్యర్థి సత్యకుమార్ పరామర్శించారు. బాపట్ల జిల్లా పడమర పిన్నిబోయనవారిపాలెంలో టీడీపీకి ఎక్కువగా ఓటింగ్ జరిగిందనే కోపంతో ఆగ్రామంపై వైసీపీ గూండాలు దాడిచేశారు. అక్కడి ఎన్టీఆర్ విగ్రహానికి నిప్పుపెట్టారు. స్థానికనేత నర్రా కొండలుపై దాడిచేశారు. శ్రీకాకుళంజిల్లా పలాసలోని అమల ఎకుడియాకు చెందిన బూర్ల అప్పలస్వామి అనే వృద్ధుడు.. సోమవారం పోలింగ్‌కేంద్రంలో టీడీపీ అను కూల వ్యాఖ్యలు చేశారు ఆ కోపంతో ఇంటికెళ్లి కొట్టారు.

పోలీసులనూ వదిలిపెట్టలేదు..

ఎమ్మెల్యే పిన్నెలి సోదరుడు వెంకట్రామిరెడ్డి నేతృత్వంలో వైసీపీ మూకలు కారంపూడిలో కొన్ని గంటలపాడు వీరంగం చేశాయి. మంగళవారం వెంకట్రామిరెడ్డి పేటసన్నెగండ్ల గ్రామానికి వెళ్తూ మధ్యలో కారంపూడిలో ఆగారు. ఆ తర్వాత కొద్దిసేటికే టీడీపీ కార్యాలయంపై వైసీపీ మూకలు దాడికి పాల్పడ్డాయి. కార్యాలయంలోని ఫర్నీచర్‌ను, సమీపంలో ఉన్న వాహనాలను ధ్వంసం చేశాయి. రోడ్డు పక్కన నిలిపిన తెలుగుదేశం నేత జానీబాషా వాహనానికి నిప్పు పెట్టాయి. టీడీపీ సానుభూతిపరుల ఇళ్లు, వ్యాపార దుకాణాలపై రాళ్లు పడ్డాయి. దాడులను ఆపేందుకు ప్రయత్నించిన కారంపూడి సీఐ నారాయణస్వామిపై కూడా వైసీపీ గూండాలు విరుచుకుపడ్డారు. ఈ దాడిలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. నరసరావుపేట నియోజకవర్గంలోని రొంపిచర్ల మండలం సంతగుడిపాడులో బీసీ వర్గీయులపై వైసీపీ శ్రేణులు దాడి చేశాయి. తమ పార్టీకి అనుకూలంగా ఓటు వేయలేదనే కక్షతో రక్తం కళ్ల చూశారు.

ఒక్కొక్క నా కొ....ని ఏం చేయాలో చేద్దాం!

పోలీసులనుద్దేశించి డిప్యూటీ సీఎం నారాయణస్వామి వ్యాఖ్యలు

చిత్తూరు, మే 14(ఆంధ్రజ్యోతి): 'మన దళిత జాతికి మనమే సైనికుల్లా నిలబడదాం. ఒక్కొక్క నా కొ...ని ఏమి చేయాలో అది చేద్దాం. మనకు ఎవరూ వద్దు. ఈ ఎస్పీ పని చేయడానికి వచ్చాడో లేక చంద్రబాబుకు ఊడిగం చేయడానికి వచ్చాడో తెలియదు' అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. చిత్తూరు జిల్లా శ్రీరంగరాజపురం మండలం పుల్లూరు దళితవాడలో మంగళవారం జరిగిన గొడవపై గ్రామస్తులతో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'డీఎస్పీకి ఫోను చేస్తే ఎలక్షన్ అవ్వగానే మీ కూతురే గెలుస్తుందని, అప్పుడు వాళ్లని తొక్కేస్తానని అన్నాడు. సీఐ, ఎస్ఐలకు ఫోన్ చేస్తే మేమేం చేసేది సార్.. ఎస్పీ వన్‌సైడ్ చేయమన్నాడు అని చెప్తున్నారు. ఇంతవరకు బాగున్నవాళ్లు కూడా ఈ ఎస్పీ వచ్చాక వన్ సైడ్ ఉండమన్నాడని చెప్తున్నారు. ఇక మనకు మనమే దిక్కు. పోలీసు ప్రొటెక్షన్ అవసరం లేదు' అని నారాయణస్వామి వ్యాఖ్యానించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● బుధవారం 15 మే 2024
diksuchi@andhrajyothy.com

అన్ని బోర్డులకు సంబంధించిన టెన్త్, ఇంటర్ ఫలితాలు వెలువడ్డాయి. నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా కెరీర్‌ను తీర్చిదిద్దుకునేందుకు సమయం ఇదే. నిజానికి ఇప్పుడు ఎన్నో కెరీర్లు ఉన్నాయి. సైన్స్, కామర్స్, ఆర్ట్స్ అలాగే మెడిసిన్, ఇంజనీరింగ్.... ఇలా ఎటువైపు మొగ్గుచూపినా అందమైన భవిష్యత్తును నిర్మించుకోవచ్చు. ఉదాహరణకు ఇంగ్లీష్ చదివితే ఏమి వస్తుందన్న ప్రశ్నకు లెక్చరర్, ట్రాన్స్‌లేటర్ కావచ్చన్నది ఒకప్పటి సమాధానం. కార్పొరేట్ ట్రైనర్ మొదలుకుని కంటెంట్ రైటింగ్ ఉనికిలోకి వచ్చిన తరవాత ఇంగ్లీష్ స్వరూప స్వభావమే మారింది. చివరాఖరుకు సినిమాలకు అడుగున ఆంగ్లంలోకి డైలాగ్స్‌ను అనువదించడం కూడా ఒక వృత్తిగా నేడు మారింది. ఏ సబ్జెక్టు తీసుకున్నా వృత్తిలో ఇమిడిపోగలిగే, నిలదొక్కుకోగలిగే విధమైన కెరీర్లు కుప్పలు తెప్పలుగా నేడు ఉన్నాయి. అలాగే కొన్ని వృత్తుల్లో చేరిన మొదటి నెలలోనే అధిక ఆదాయం ఉండదు. ఉదాహరణకు డాక్టర్ కాగానే, లాయర్ అవ్వగానే లక్షలు రావు. అనుభవం మాత్రమే అధిక అర్జనకు, ఆ వృత్తిలో నిలదొక్కుకునేందుకు వీలు కల్పిస్తాయి. ఏయే విభాగాల వారికి ఎలాంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయో అవగాహన ఏర్పడితే చాలు. ఈ రోజుల్లో వివరాలు తెలుసుకోవడం సులువు. అదనపు సమాచారం కోసం ఇంటర్నెట్‌లో వెతుక్కోవచ్చు. కోర్సుల ఎంపిక అనేది ముమ్ముందు జీవితాన్ని నిర్ణయించేది. అందుకే ఆచి తూచి అడుగు వేయాలి. ఎంపిక చేసిన కొన్ని కాలేజీలను మాత్రమే ఇక్కడ ప్రస్తావించాం.

సివిల్ ఏవియేషన్

భారతదేశంలో పౌరవిమానయాన మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ ఏవియేషన్స్ అత్యున్నతమైన సంస్థ. ఇది దేశంలోని ఎయిర్‌పోర్టులకు సంబంధించిన చాలా వ్యవహారాలను పర్యవేక్షిస్తుంది. ఏరోనాటికల్ ఇంజనీరింగ్ చేసిన వారు కూడా ఈ రంగంలోకి వెళ్లవచ్చు. ఇందులో ప్రధానంగా టెక్నికల్ అండ్ ఇంజనీరింగ్ డివిజన్, కమర్షియల్ డివిజన్ ఉంటాయి. ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్, ఫిట్టింగ్ మొదలు ఎగిరే ప్రక్రియ వరకు ఇంజనీరింగ్ విభాగం పనే. కమర్షియల్ విభాగంలో కార్గో, ప్యాసింజర్ విమానాల సేవలు ఉంటాయి. పైలెట్ ట్రెయినింగ్‌ను ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు నిర్వహిస్తున్నాయి. వీటికి ఫీజు లక్షల్లో ఉంటుంది. ఎంట్రెన్స్ టెస్ట్‌లు, మెరిట్ ఆధారంగా ఇందులో చేర్చుకుంటారు. కంటిచూపు, ఫిజికల్ ఫిట్‌నెస్ చక్కగా ఉండాలి.

కమర్షియల్ ఏవియేషన్, ఎయిర్‌పోర్ట్, టెక్నికల్ అండ్ ఇంజనీరింగ్ డివిజన్, ఎయిర్ క్రాఫ్ట్ మాన్యుఫ్యాక్చరింగ్, కమర్షియల్ ఆపరేషన్ డివిజన్‌లో ఉద్యోగాలు ఉంటాయి. హోదాను బట్టి వీటిల్లో వేల రూపాయల నుంచి లక్షల రూపాయల వరకు నెల వేతనాలు లభిస్తాయి.



ఏవియేషన్ ఇండస్ట్రీ

మేథమెటిక్స్, ఫిజిక్స్‌తో ఇంటర్ పూర్తి చేసినవారు ఏరోనాటికల్ ఇంజనీరింగ్, సంబంధిత ఉద్యోగాలు చేయవచ్చు. సైన్సేతర రంగాలకు చెందిన విద్యార్థులు కమర్షియల్ ఏవియేషన్‌లోని క్యాబిన్ క్రూ, గ్రౌండ్ డ్యూటీ ఉద్యోగాలు ఎంచుకోవచ్చు. క్యాబిన్ క్రూ విషయంలో కొంత ఎగ్జయిట్‌మెంట్ ఉంటుంది. వివిధ దేశాలు తిరగడం, భిన్నమైన వ్యక్తులను కలుసుకోవడం వీరి ఉద్యోగంలో భాగం.

ఏవియేషన్ కోర్సులను అందిస్తున్న కొన్ని సంస్థలు

- Central training establishment, Hyderabad.
- Global institute, B-1/637, 1st Flr, Janakpuri, Delhi - 110058
- Indian aviation academy, Office 7& 8, Rushabh Complex, Oshiwar Link Road, Andheri West, Mumbai - 400053.
- Aptima air hostess academy, Block-J, Rajouri garden, New Delhi- 110027

Colleges, Institutions and Universities

Some of the institutes offering aviation courses are as follows.

- Indian Institute of Aeronautics, Delhi.
- Bharat institute of aeronautics, Patna.
- institute of aeronautics & Engineering, Bhopal.
- Flytech Aviation, PlotNo:24, Arunodaya Building, Paigah Colony, S.P Road, Secunderabad, Hyderabad-500006, Telangana, INDIA. Tel: (91)-040-66200000
- Avalon aviation academy, aptech house, A/65, MIDC, Andheri (E), Mumbai- 400 093.
- There are multiple Aviation centres in Mumbai itself.
- Bombay university or Mumbai university now offers a 3 year B.Sc course in aviation. The course is being conducted by the institute of aviation and aviation safety (IAAS), an educational wing of the Mumbai based federation of Indian pilots. This course also trains students to be pilots and thus also offers commercial pilot's licenses (CPL) if one wishes to become a pilot.

సైన్స్ విద్యార్థుల కోసం

టెన్త్, ఇంటర్ తరవాత
What Next



సైన్స్ గ్రూపులు

మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బోటనీ, స్టాటిస్టిక్స్ మొదలైన సబ్జెక్టులతో అవకాశాలు

ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ (జనరల్)
- మర్చంట్ నేవీ (సైన్స్ వారికి మాత్రమే)
- నేషనల్ డిఫెన్స్ అకాడమీ
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ
- ఫ్యాషన్ డిజైన్
- బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ స్టడీస్
- లా (ఐదు సంవత్సరాల కోర్సు)
- ఫారిన్ లాంగ్వేజెస్ (ఐదు సంవత్సరాల కోర్సు)
- ఫిల్మ్, ఇంటీరియర్ డిజైనింగ్

బైపీసీ
- అగ్రికల్చర్ సైన్సెస్ (వెటర్నరీ/డైరీ సైన్స్/ హ్యూమన్ బయాలజీ
- ఉపాధినిచ్చే కోర్సులు
- పోస్ట్‌గ్రాడ్యుయేషన్
- బయోటెక్, జెనెటిక్స్
- రీసెర్చ్/టీచింగ్

బైపీసీ
- మెడిసిన్
  - బీడీఎస్, ఆయుర్వేద, ఎండీఎస్
  - ఎంబీబీఎస్ (పోస్ట్ గ్రాడ్యుయేట్ స్పెషలైజేషన్) భారతదేశంలో 2, 3 సంవత్సరాలు, విదేశాల్లో అయితే 5 సంవత్సరాలు
  - హోమియోపతి
- పారా మెడికల్: ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, స్పీచ్ థెరపీ, ల్యాబ్ టెక్నాలజీ, నర్సింగ్
- బీఎస్సీ: హోమ్ సైన్స్, హోమ్ ఎకనామిక్స్, హ్యూమన్ బయాలజీ, ఎన్విరాన్‌మెంట్
  - ఎమ్మెస్సీ: చైల్డ్ డెవలప్‌మెంట్, న్యూట్రిషన్
- బీఫార్మసీ

ఎంపీసీ
- ఇంజనీరింగ్: సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానికల్, కంప్యూటర్, మెటలర్జీ, ప్రొడక్షన్, మెరైన్, లెదర్, సిరామిక్, ప్లాస్టిక్, ప్యాకేజింగ్ టెక్నాలజీ
- టెక్నికల్ డిప్లొమాలు
- ఆర్కిటెక్చర్
- బీఫార్మసీ

షిప్పింగ్ ఇండస్ట్రీ



కనీసం 60 శాతం మార్కులతో ఫిజిక్స్, మేథమెటిక్స్‌తో ఇంటర్ పూర్తిచేసిన వారు షిప్పింగ్, మర్చంట్ నేవీకి సంబంధించిన కోర్సుల్లో చేరవచ్చు. ఎంట్రెన్స్ టెస్ట్‌లు, మెరిట్ ఆధారంగా ఇందులో చేర్చుకుంటారు. ఇందులో డిగ్రీ, డిప్లొమా కోర్సులు ఉంటాయి. కంటి చూపు, ఫిజికల్ ఫిట్‌నెస్ చక్కగా ఉండాలి. ప్రధానంగా రెండు రకాల కోర్సులు ఉంటాయి.

- షిప్పింగ్
- మర్చంట్ నేవీ

కంప్యూటర్ & ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ

కంప్యూటర్ సంబంధిత కోర్సుల్లో చేరాలనుకుంటే డిగ్రీ స్థాయిలో బిసిఏ ఉండేది. అయితే ఇంజనీరింగ్, ఎంసిఏ కోర్సుల్లో సీట్లు పెరిగిన తరవాత బిసిఏకు తెలుగు రాష్ట్రాల్లో ఆదరణ తగ్గింది. అలాగే ఇంటర్‌లో మేథ్స్ చదివి, డిగ్రీ పూర్తిచేసినవారు మాత్రం ఎంసిఏ కోర్సులో చేరవచ్చు. ఏ సబ్జెక్టులతోనైనా డిగ్రీ అర్హతతో పెద్ద సంస్థల్లో కంప్యూటర్ లాంగ్వేజెస్ నేర్చుకుని సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్‌గా, హార్డ్‌వేర్ ప్రొఫెషనల్స్‌గా స్థిరపడుతున్నారు. ఎంబిఏకు తోడు సాఫ్ట్‌వేర్‌పై మంచి అవగాహన ఉన్నవారు సాఫ్ట్‌వేర్ మార్కెటింగ్ కూడా చేస్తున్నారు. మొత్తం ఇంజనీరింగ్ కోర్సులకున్న అవకాశాలతో సమానంగా ఐటీ ఉద్యోగాలు లభిస్తున్నాయి. బీఈ/బీటెక్‌లో మొదట సీఎస్ఈ మాత్రమే ఉండేది. కాలక్రమంలో పలు ఆప్షన్స్ అందులోనూ వచ్చాయి. ఏఐ, మెషీన్ లెర్నింగ్, ఐఓటీ, క్లౌడ్, బ్లాక్‌చెయిన్.. ఇలా పలు విభాగాలు ఆవిర్భవించాయి. ఇవన్నీ కలిసి, వేర్వేరుగా ఒక కోర్సుగా రూపొందాయి.

ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ

మేథ్స్‌తో ఇంటర్ తరవాత ఇంజనీరింగ్‌లో చేరవచ్చు. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ సహా పలు ఇంజనీరింగ్ కోర్సులను అందిస్తున్నాయి. అవి చేసి ఇంజనీరింగ్ టెక్నీషియన్, ఎలక్ట్రానిక్ అండ్ టెలీకమ్యూనికేషన్ ఇంజనీర్, అగ్రికల్చరల్ ఇంజనీర్, మైనింగ్ అండ్ పెట్రోలియం ఇంజనీర్, ప్లాస్టిక్ అండ్ రబ్బర్ టెక్నాలజిస్ట్, సిరామిక్ టెక్నాలజిస్ట్, టెక్స్‌టైల్ టెక్నాలజిస్ట్, ప్యాకేజింగ్ టెక్నాలజిస్ట్, లెదర్ టెక్నాలజిస్ట్‌లు కావచ్చు.

మెరైన్ ఇంజనీరింగ్

ఇంజనీరింగ్ బ్రాంచ్‌ల్లో మెరైన్ ఇంజనీరింగ్ కూడా ప్రత్యేకమైనది. సైన్స్ సబ్జెక్టులతో ఇంటర్ పూర్తి చేసినవారు ఈ రంగంలోకి వెళ్లడానికి అర్హులు. ఐఐటీల్లో సీటు రావాలంటే జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు తెచ్చుకోవాల్సిందే. ప్రైవేటు రంగం విస్తృతం అవుతున్న ఈ రోజుల్లో దీనికి మంచి భవిష్యత్తు ఉంటుందనడంలో ఎలాంటి అనుమానం లేదు.

ఐఐటీలు కాకుండా మెరైన్ ఇంజనీరింగ్‌ను అందిస్తున్న కాలేజీలు

List of marine engineering colleges

- T.S. Chanakya, karaus, New Mumbai - 400 706
- Haldia Institute of Maritime Studies And Research ICARE Complex, Marine Campus, P.O. Hatiberia, Haldia Dist. Purba Medinipur, PIN – 721657, West Bengal. Phone Nos: 03224 267501 / 267502
- RL Institute of Nautical Science, T.V.R Nagar Aruppukottai Road Elliyerpatti, Madurai, Tamil Nadu 6250224. Phone: 0452 391 8614
- Marine Engineering Research Institute, P-19, Taratolla Rd, Kolkata - 700088, Ph:033 2401 4675.
- Marine Engineering & Research Institute, Hay Bunder Road, Mumbai - 400033
- Lal Bahadur Shastri College of Advanced Maritime Studies & Research, Hay Bunder Road, Mumbai, Maharashtra 400033. Ph: 022 2371 9931



- The Calcutta Technical School, 110 SN Banerjee Road, Kolkatta - 700013
- Andhra University College of Engineering- Visakhapatnam, Andhra pradesh
- White Shark Marine Institute-New Delhi, Delhi
- Gujarat Technological University- Ahmedabad, Gujarat
- Praveenya Institute Of Marine Engineering - Vizianagaram, Andhra pradesh
- Institute Of Technology And Marine Engineering-24 Parganas (south), West Bengal
- Coimbatore Marine College - Coimbatore, TamilNadu - International Maritime Institute, Delhi
- Maharashtra Academy of Naval Education & Training, Pune
- Institute of Technology &Marine Engineering, Kolkata
- Indian Meritime University, Chennai
- Academy of Maritime Education & Training, Chennai
- BP Marine Academy, Navi Mumbai
- TS Rahaman, Mumbai
- Tolani Maritime Institute, Pune
- Samundra Institute if Maritime, Mumbai
- Karnatak University
- Annamalai University
- Mangalore University
- University of Chennai
- Berhampur University

(మిగిలిన వివరాలు రేపటి పేజీలో)

లిటిల్స్



అసూయ గాడిద

ఒక కుండలు చేసేవాడు ఉండేవాడు. పేరు రంగయ్య. కుండలు చేసేప్పుడు పాటలు పాడేవాడు. ఆ రాగాలు బావుండేవి. అతని దగ్గర కుక్క, గాడిద ఉండేవి. రెండింటినీ ప్రేమతో చూసుకునేవాడు. అతని పాటలకు ఆ రెండు జంతువులూ తలలూపేవి. అంత బావుండేది అతని పాట.


కుండలు తయారవ్వగానే గాడిద మీద యజమాని దగ్గరలోని సంతకు తీసుకెళ్లేవాడు. అయితే వచ్చాక పట్టించుకునేవాడు కాదు. దీంతో గాడిదకు కోపం. పైగా తన యజమాని ముందునుంచి పక్షపాత ధోరణి అనుకుండేది. అనుకుండేది కాదు.. తన నిర్ణయం. తన కంటే కుక్కను బాగా చూసుకునేవాడు. దానికి పెరుగన్నం పెట్టేవాడు. దాని తల మీద నిమిరేవాడు. ఈ సంఘటన చూసినప్పుడల్లా గాడిద ఖుశ్లకునేది. అసూయపడేది. నేను తక్కువ పనేమీ చేయలేదు కదా.. ఈ కష్టం ఎవరూ చేయలేరు. అలాంటిది నన్ను ఈ యజమాని చూసుకోవటం ఇబ్బందిగా ఉంటాడే? అనుకుంది.

గాడిద కొన్నాళ్లు కుక్క వాలకం అంటే.. కుక్క తోక తిప్పటం, చిన్నగా అరవటం చేసేది. యజమాని మీద ప్రేమ ఉన్నట్లు చేసేది. ఈ కుక్కకే ఇంత లౌక్యం ఉంటే ఇంత భారీ శరీరం ఉండే నాకు మెదడు లేదా? అనుకుంది గాడిద. ఒకసారి తన యజమాని పక్క ఊరుకు వెళ్లాడు. అక్కడ పనులు చూసుకుని ఆలస్యంగా వచ్చాడు. కుక్క కంటే ముందు గాడిద వెళ్లింది. తన రెండు కాళ్లు ఎత్తి యజమాని మీద పెట్టబోయింది. యజమాని భయపడిపోయాడు. ఈ గాడిద ఏంటీ? పిచ్చెక్కిందా? అనుకుంటూ పెద్ద కర్రతో గట్టిగా బాదాడు. దాని నడుము మీద దెబ్బలు పడటంతో గాడిద మంటతో అల్లాడిపోయింది.


ఇది నన్ను గట్టిగా తన్నాలనుకుంది. నా గుండెలమీద పడి ఉంటే ఈ పాటికి చచ్చేవాన్ని. దేన్ని ఎలా ఉంచాలో నాకు తెలుసు. ఈ గాడిదను ఇలా తిరగకుండా గొలుసుతో చెట్టుకు కట్టేయండి దూరంగా. ఎండయినా, చలి అయినా దానికి అదే గతి అన్నాడు. తన ప్రేమను పట్టించుకోని యజమాని కంటే.. కుక్క మీద ఆ యజమానికి గల ప్రేమను చూసి గాడిద కుళ్లకునేది. ఆ తర్వాత అలానే అసూయ ఉండిపోయింది.




సరైన నీడ ఏది?



6 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 307

						9		
5			7	6			8	4
			2		5		1	6
				5		4		
		7	3		6	5		
		8		2				
6	4		9		3			
8	3			4	2			7
		2						

సుడోకు - 306 సమాధానం

5	6	7	4	8	9	1	2	3
8	4	1	2	3	7	9	6	5
2	9	3	5	6	1	4	7	8
3	5	2	6	9	4	7	8	1
9	7	8	1	5	3	2	4	6
6	1	4	8	7	2	5	3	9
7	2	6	3	1	5	8	9	4
1	3	9	7	4	8	6	5	2
4	8	5	9	2	6	3	1	7

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.